# శాశ్వత యోగిక వ్యవసాయము

## నూతన ప్రపంచం కోసం వినూత్న విదానము

గ్రామ వికాస వర్గం, రాజయోగ ఎడ్యుకేషన్ అండ్ రీసర్చ్ ఫౌండేషన్ మరియు
ప్రజాపిత బ్రహ్మాకుమారి ఈశ్వరీయ విశ్వ విద్యాలయం, అబూ పర్వతము

2012

ముద్రణ :

© Copyright : Brahme Kumaris Ishwariya Vishwa Vidyalaya, Mount Abu, (Raj)
No part of this book may be printed without the permission of the publisher.

# శాశ్వత యోగ వ్యవసాయం - సనాతన వ్యవసాయం

యోగ సాధనతో విభిన్న యోగానుభూతులతో చేసే సనాతన వ్యవసాయ విదానము చిరస్మరణీయమైనది. అదే '**శాశ్వత యోగిక వ్యవసాయము**'.

ఈ విదానములో విత్తనము నుండి మొదలుకొని పంట నుండి విత్తనాలు తయారు అయ్యే వరకు అన్ని దశలలోను యోగానుభూతి తరంగాలను విత్తనాలకు, పంచతత్వాలకు అందించాలి. అవి ఎంతకంతకు పంట నాణ్యతను ఇనుమడింప చేస్తాయి. సర్వశక్తిమంతుడు సృష్టికర్త అయిన నిరాకార పరమాత్మ నుండి శక్తిశాలి కిరణాలను స్వీకరిస్తూ వాటిని పంచతత్వాలకు విత్తనాలకు అందిస్తూ వాటి వాస్తవిక అస్థిత్వ యోగ్యతను సృజింప చేయడమే ఈ విదానానికి మూలాధారము.

ఎలాగైతే పంచతత్వాల కర్మేంద్రియాలను తోడు చేసుకున్నప్పుడే చైతన్యమైన ఆత్మ తనలోని వ్యక్తిత్వాన్ని, శక్తి సామర్థ్యాలను, నైపుణ్యాలను, భావోద్వేగాలను వ్యక్తపరచగలదో అలాగే ఒక విత్తనం దానిలో దాగిన సమూల వృక్ష సారాన్ని వెలికి తీయాలంటే పంచతత్వాలతో జోడింపబడవలసి ఉంటుంది.

ఒక మనిషి తన బాల్య దశ నుండి ఆధ్యాత్మిక సాధనను అవలంబించినట్లయితే ఒక ఆధ్యాత్మిక మార్గదర్శకుడిగా, దేశోద్ధారకుడిగా తీర్చిదిద్దబడతాడు. అలాకాక సాధారణ జీవన విదానాన్ని అవలంబిస్తే ఒక సాధారణ సమాజ పౌరుడిగా మిగిలిపోతాడు. అలాగే ఆధ్యాత్మిక విదానంతో విత్తనానికి పంచతత్వాలకు యోగ తరంగాలను అందిస్తూ పంట పండించినట్లయితే ఆ పంట ఆరోగ్యకరమైనదేగాక అందరిలో ఆధ్యాత్మికతను పెంచే ప్రసాదంగా మారుతుంది. ఈవిధంగా పండించే పంటతో చేసే అన్నమే 'పరబ్రహ్మ స్వరూపం'గా గ్రంధాలలో పేర్కొనబడింది.

కాబట్టి సనాతన విదానమైన '**శాశ్వత యోగ వ్యవసాయాన్ని**' మనమందరం కలిసి ఆచరిద్దాం, ఈ విశ్వాన్ని మానవతా విలువలతో, దివ్యగుణాలతో నిండిన ఆయురారోగ్యలతో సుసంపన్న స్వర్గంగా మారుద్దాం.



# విషయ సూచిక


1. శాశ్వత యోగిక వ్యవసాయక ప్రేరణల మూలాధారము -------------------------- 6
2. శుభ ప్రేరణా సందేశము -------------------------------------------------- 7
3. సద్భావనలు -------------------------------------------------------- 8
4. అభినందనలు ------------------------------------------------------ 9
5. భూమిక ----------------------------------------------------------- 10
6. ఈశ్వరీయ ప్రేరణలు - మనో వృత్తి ద్వారా ప్రకృతి పరివర్తన ---------------------- 13
7. శాశ్వత యోగిక వ్యవసాయము - అవసరము --------------------------------- 17
8. యోగ ప్రయోగ విధానాలు మరియు వాటి పరిణామాలు --------------------- 28
9. భూమిని సారవంతంగా చేయుటకు - సేంద్రీయ మరియు జైవిక ఎరువులను
తయారుచేయు పద్ధతులు ------------------------------------------------ 40
10. సశ్య సంరక్షణ ---------------------------------------------------- 47
11. పంటలకు అనుకూల వాతావరణం ---------------------------------------- 51
12. శాశ్వత యోగిక వ్యవసాయాన్ని కొనసాగించే రైతులకు నియమావళి ----------- 53
13. వివిధ పంటలలో తీసుకోవలసిన జాగ్రత్తలు -------------------------------- 55
14. 'గ్రామీణాభివృద్ధి ఆధ్వర్యంలో శాశ్వత యోగిక వ్యవసాయంలో యోగ ప్రయోగం' ---75
15. శాశ్వత యోగిక వ్యవసాయ విధానంతో పండించిన
టమోటా పంటల నాణ్యత పరిశోధనల వత్యాసం -------------------------- 80

## శాశ్వత యోగిక వ్యవసాయానికి ప్రేరణల మూలాధారము

అది 18, ఫిబ్రవరి 2008. సర్వోన్నత కృషీవలుడు అయిన పరమపిత పరమాత్మ మరియు విశ్వకర్మ అవ్యక్త పితాశ్రీ బ్రహ్మాబాబా, గౌరవనీయులగు దాది హృదయమోహిని గారి మాధ్యమము ద్వారా గ్రామీణాభివృద్ధి వర్గానికి చెందిన సోదర సోదరీమణులతో శాశ్వత యోగిక వ్యవసాయము గురించి చెప్పిన ప్రేరణాదాయక మహావాక్యములు.......

" ఏదైనా నవీనతను చేస్తున్నారు కదా! ఏమైనా క్రొత్తగా చేస్తున్నారా? ఏం చేస్తున్నారు? ఎవరైనా చెప్పండి. (గ్రామీణాభివృద్ధికి వర్గానికి అధ్యక్షురాలైన మోహిని అక్కయ్య గారు వివరిస్తూ – యోగ ప్రయోగముతో పాటుగా జైవిక వ్యవసాయాన్ని కొనసాగించే యోజనలు చేయబడినవి.) బాగుంది. ఎందుకంటే, ఈ రోజుల్లో పంటల నుండి ఏవైతే వెలువడుతున్నాయో వాటిలో ఎన్నో సమస్యలు ఉన్నాయి. చాలా మంచి పని చేస్తున్నారు. ఒకటి, యోగం చేయడంతో స్వయానికి మేలు. రెండవది, అందరి ఆశీర్వాదాలు లభిస్తాయి. చాలా మంచిగా చేస్తున్నారు. చాలా ఉల్లాస–ఉత్సాహాలతో చేస్తున్నారు, చేస్తూండండి. బాగుంది, శుభాకాంక్షలు. మంచిది......... "

## శుభ ప్రేరణా సందేశము



సృష్టి జగన్నాటకంలో ఆది కాలమైన స్వర్ణిమయుగంలో మానవులు సర్వగుణ సంపన్నంగా, షోఢష కళా పరిపూర్ణంగా, దైవీ స్వరూపంగా వుండేవారు. అక్కడ సంపూర్ణ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యము, అపారమైన సుఖ-సంతోషాలేకాక దివ్య సంస్కృతితో నిండిన జీవన శైలి వుండేది. ఎందుచేతనంటే- ఒకటి, నాటి కాలం( యుగం)లోని సాత్విక వ్యవసాయ విధానం ద్వారా పండించిన రుచికరమైన, శుచికరమైన మరియు పోషక విలువలతో కూడిన పౌష్టికాహారం, పండ్లు- ఫలాలు, కూరగాయలు మొ॥వి చాలా సహజంగా లభించేవి. ఇటువంటి నూతన యుగం యొక్క పునః స్థాపన స్వయం పరమపిత పరమాత్మయే చేస్తున్నారు.

ఇలాంటి పరివర్తన సమయంలో బ్రహ్మాకుమారీ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం సహభాగి సంస్థ అయిన రాజయోగ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్ ద్వారా నిర్వహించబడుతున్న 'గ్రామీణాభివృద్ధి' ఉద్యమంలో అంతర్గతంగా ఈశ్వరీయ జ్ఞానము రాజయోగ ధ్యానముపై ఆధారితమైన "శాశ్వత యోగిక వ్యవసాయం - నవయుగ నిర్మాణంలో ఒక అడుగు"గా ప్రయోగించటం జరుగుచున్నది. ఇందులో ముఖ్యంగా భారతదేశం మరియు విశ్వంలోని సమస్త రైతు సోదర సోదరీమణులకు ఒక మార్గదర్శక రూపంగా, ఉపయోగకరంగా ఉంటుంది. గ్రామీణాభివృద్ధి అనే మహత్తర కార్యంలో సేవలందిస్తున్న కార్యకర్తలందరికి నేను మనస్పూర్తిగా అభినందనలు తెలయచేస్తున్నాను.... మరియు ఈ వినూత్న ప్రణాళిక సఫలతకు కోటి కోటి శుభ ప్రేరణలతో పాటు, సర్వులకు అభినందనలు తెలయజేస్తున్నాను."సఫలత మీ జన్మ సిద్ధ అధికారం", అనే శుభాకాంక్షలతో......

**ఈశ్వరీయ సేవలో,**

**బ్రహ్మాకుమారీ జానకీ**

# సద్భావనలు



వర్తమాన సమయంలో రైతు సోదర సోదరీమణుల జీవితంలో ఆధ్యాత్మికత మరియు వ్యవసాయ పద్ధతులలో ప్రకృతిలోని పంచ తత్వాల సతోప్రధానతతో పాటు, అత్యుత్తమ విత్తనాలు, ఎరువులు, సాధన-సామాగ్రి కూడా సాత్వికంగా వుండడం చాలా అవసరం. ఎందుకంటే, నేడు రైతులు వ్యవసాయరంగంలో అనేక పరిస్థితులను మరియు సమస్యలను ఎదుర్కొంటూన్నారు. ఫలితంగా పంట పొలాల్లో వచ్చే దిగుబడిలో ఎంత శుద్ధత, రుచికరంగా మరియు పౌష్టిక విలువలు ఎంతగా వుండాలో అంతగా లభించడం లేదు. ఫలితంగానే అనేక విధాలగు మానసిక, శారీరక వ్యాధులు పెరుగుతూ ఉన్నాయి.

ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో బ్రహ్మాకుమారీ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం సహభాగి సంస్థ రాజయోగ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్‌కు సంబంధించి, 'గ్రామీణాభివృద్ధి' వర్గం ద్వారా "శాశ్వత యోగిక వ్యవసాయ – నవయుగ నిర్మాణానికి ముందడుగు"గా ప్రయోగించటం జరుగుచున్నది. దీని ద్వారా జాతీయ మరియు అంతర్జాతీయ పరంగా రైతాంగానికి అనేక విధాలైన సమస్యలకు సరళమైన, సరైన సమాధానములు లభించును. రాజయోగ విధానంపై ఆధారితమైన ఈ వ్యవసాయం, సభ్య సంస్కృతితో నిండిన ఓ నవయుగ నిర్మాణంలో ఒక మహత్తర కార్యాన్ని నిర్వహించునని మేము విశ్వసిస్తున్నాము. ఈ వినూత్న ప్రణాళికల అంతర్గతంగా తయారు చేయబడిన ఈ పాఠ్యాంశాల ద్వారా రైతాంగానికి ఒక మార్గదర్శకాన్ని ప్రసాదించునని భావిస్తున్నాను. ఈ పుస్తక ప్రచురణ సందర్భంగా నేను నా హృదయపూర్వక సద్భావనలను అందిస్తున్నాను.

***ఈశ్వరీయ సేవలో,***

***బ్రహ్మా కుమారీ హృదయమోహిని.***

# అభినందనలు



భారత దేశం ముఖ్యంగా వ్యవసాయ ప్రధాన దేశం. ఇక్కడ దాదాపు 70% ప్రజలు వ్యవసాయం పై ఆధారపడి జీవిస్తున్నారు. ఈ వ్యవసాయం పై పూర్తి దేశ ఆర్థిక వ్యవస్థ ఆధారపడి ఉంది. రైతులను 'అన్నదాత'లు అంటారు. ఎందుకంటే, వారిలోని తత్పరత మరియు కఠిన పరిశ్రమ ద్వారానే ఆహార ధాన్యాలు, పండ్లు, ఫల పుష్పాదులు, కూరగాయలు మొ॥వి లభిస్తున్నాయి. వీటి అవసరం అందరికి ఎంతగానో ఉంటుంది. ప్రాచీన కాలమందు మానవుల జీవితంలో వ్యవసాయమే ప్రధాన కేంద్ర బిందువుగా ఉండేది. దాని ఆధారంగానే మన దేశంలో పండుగలు, ఉత్సవాలు మొ॥వి ఏర్పడ్డాయి. వ్యవసాయం ఆధారంగానే భారతీయ సంస్కృతి ఆవిర్భవించిది. బహుశా అందుకే ఆంగ్ల భాషలోని 'అగ్రి' అనగా అగ్రిమ (ప్రారంభిక) సంస్కృతిగా చెప్పబడింది. 'ఎటువంటి ఆహారమో అటువంటి మనస్సు' అని కూడా చెప్పడం జరిగింది. తనువు, మనస్సు రెండింటి ఆరోగ్యానికి ఆధారం- ఆహారమే. శరీర ఆరోగ్యం కోసం శుచికరమైన, సాత్వికమైన భోజనం, పాలు-పండ్లు, కూరగాయల మొ॥గు వాటి ఉత్పాదన చాలా అవసరం.

గ్రామీణ అభివృద్ధి వర్గంలో జోడించబడిన రైతు సోదరులు తమ పంట పొలాలపై శుభ సంకల్పాలను మరియు సహజ రాజయోగమును ప్రయోగించారు. ఫలితంగా ఎంతో ఉపయోగకరమైన దిగుబడి లభించింది. వీరి అనుభవాలు, వ్యవసాయ సంబంధిత నిపుణుల ద్వారా అందించ బడిన మార్గదర్శక సూత్రాలకనుసారంగా, "శాశ్వత యోగిక వ్యవసాయం-నవయుగ నిర్మాణంలో ఓ ముందడుగు" అను ఈ పుస్తక ప్రచుణ జరిగింది. ఇందులో రాజయోగమును ప్రయోగించే పద్ధతులను, సేంద్రియ ఎరువులను తయారు చేయు విధానాలను మరియు పంట పొలాలను సంరక్షించేందుకు భిన్న భిన్న ఉపాయాలను చాలా అందంగా పొందుపరచబడ్డాయి. యోగిక వ్యవసాయాన్ని అవలంభించు రైతు సోదర సోదరీమణుల కోసం నియమ నిబంధనలు మరియు వాటిని అనుసరించిన రైతుల అనుభవాలను ఈ పుస్తకంలో ప్రచురించడం జరిగింది.

ఈ పుస్తకంలో వివరించబడిన విషయాలను శ్రద్ధగా అధ్యయనం చేసి, నిశ్చయ బుద్ధితో, వివేకము-భావనల సమతుల్యతతో వ్యవసాయాన్ని కొనసాగించినట్లైతే నూటికి నూరు శాతం వారికి సఫలత లభించునని మాకు పూర్తి విశ్వాసము ఉన్నది.

***ఈశ్వరీయ సేవలో,***

***బ్రహ్మా కుమారీ మోహిని.***

# భూమిక

ఈ భువిపై ఆదికాలమగు సత్యయుగంలో ప్రకృతి సంపూర్ణ సతోప్రధానముగా వుండేది. వ్యవసాయం ద్వారా పౌష్టిక శుద్ధ ఆహారం, కూరగాయలు, పండ్లు, పాలు మొ॥వి లభించేవి. అందుచేత అక్కడ అందరూ నిరోగులుగా ఉండేవారు. ప్రతి మానవుడి తనువు, మనస్సు పవిత్రంగా ఉన్న కారణంగా దివ్య గుణాలతో సంపన్నంగా ఉంటూ దేవీ దేవతలు అనేబడేవారు. పరస్పర స్నేహం, సహయోగం, సద్భావనా, సుఖ- శాంతి, పవిత్రతల కారణంగా భారతావని సుఖ సంతోషాలతో, ధన ధాన్యాలతో నిండుగా, "బంగారు పిచ్చుక" అని పిలువబడింది. కాల గమనానుసారంగా మనుష్యాత్మలతో పాటు ప్రకృతిలోని పంచ తత్వాలు కూడా నెమ్మది నెమ్మదిగా సతో స్థితి నుండి రజో, తమో ప్రధాన స్థితికి దిగజారింది. ఫలితంగా ఆత్మ, ప్రకృతి రెండింటి శక్తులు క్షీణిస్తూ వచ్చాయి. సృష్టిచక్ర మధ్య కాలంలో ఆత్మ, తన నిజ స్వరూపమును మరచి, దేహాభిమానానికి వశమయింది. దానితో ఆత్మలో విషయ వికారాలు ప్రవేశించాయి. అంతేకాక జనసంఖ్య కూడా వృద్ధి చెందడంతోపాటు మానవుల అవసరాలు కూడా పెరుగుతూ వచ్చాయి. మానవులలోని స్వార్థ భావం అనే దావానలము ప్రకృతిని పీల్చి పిప్పి చేసింది. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత పంటలలో అధిక దిగుబడిని పెంచేందుకు రసాయనిక ఎరువులను, క్రిమిసంహారక రసాయనాలను ప్రయోగించారు. వర్తమాన సమయంలో కూడా అధిక ఆహార ధాన్యాల ఉత్పత్తి కోసం అనేక రకాల క్రొత్త పద్ధతులను వినియోగించడం జరుగుతుంది. పెరుగుతున్న జనాభా కారణంగా ఆహార ధాన్యాల ఉత్పత్తి భారం పెరిగింది. ఫలితంగా భూసారము క్షీణించడం మొదలైంది. సారవంతమైన భూమి బంజరు భూమిగా మారింది. ప్రకృతి తత్వాలు తమ సమతుల్యాన్ని కోల్పోయాయి. స్వార్థం మరియు హింసాత్మకమైన ప్రవృత్తులతో పండించినఆహారం, మానవుల మనోవృత్తులను మరింత హింసాత్మకంగా మార్చింది. తనువు, మనస్సు అనేకానేక క్రొత్త రోగాలకు ఆశ్రయంగా మారాయి. పంచ తత్వాలలో సమతుల్యత లోపించిన కారణంగా కొన్ని చోట్ల కరువులు, భూకంపాలు, సునామి వంటి సముద్ర ఉప్పెనలు మరికొన్ని చోట్ల వరదలు వంటి పరిస్థితులు సంభవిస్తున్నాయి. ప్రాకృతిక ఆపదలతో పాటు పంట పొలాలలో విభిన్న రకాలైన చీడలు రోగాలు కూడా తమ వంతు ప్రభావాన్ని చూపిస్తున్నాయి. వీటన్నింటికి కారణము మనుష్యాత్మల దూషిత (దుష్ట) కర్మలు, స్వార్థ ప్రవృత్తులే.

1988 సం॥లో రోమ్ నగరంలో నిర్వహించబడిన మహా సభలో 'పౌష్టికాహారం మరియు వ్యవసాయదారులు' అనే విషయ అంతర్గతంగా సంపూర్ణ గ్రామీణాభివృద్ధి కావాలంటే మన నైసర్గిక ఉపకరణ సామాగ్రిని యోగ్యమైనవిగా నిర్మించుకోవాల్సిన అవసరం ఎంతగానో ఉంటుంది అని

తెలయచేయబడింది. మానవుల ప్రాథమిక అవసరాలైన తినడానికి తిండి, కట్టుకోవడానికి బట్ట, నివసించేందుకు ఇల్లు సహజంగా లభించాలి. దీనికోసం మానవులు జాగరూకులై వుండాల్సిన అవసరం వున్నది. అప్పుడే రాబోవు తరాలవారు కూడా సుఖ సంతోషాలతో జీవించగలరు. దానికోసం భూమి, నీరు, వృక్షాలు, పశువులు, పక్షులు మరియు జీవ సంబంధిత వుత్పరివర్తనాలను యోగ్యంగా చేయడం మరియు మెరుగైన పంటలను పండించుటకై వాతావరణాన్ని సమతుల్యంగా వుంచడం చాలా చాలా అవసరం. ఆర్థిక, సామాజిక అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుంటూ ఉపయుక్తమైన యాంత్రిక జ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం మరెంతగానో ఉన్నది.

అధిక దిగుబడులతో పాటు రైతులు, పంటలను ఎలా పండించాలి అనేది మన ఆరోగ్యవిషయంలో ఒక మహత్తర అంశంగా మారింది. కాబట్టి, వర్తమాన సమయమనుసారంగా మీరు మీ అవినాశీ స్వరూపమును గుర్తించి సహజ రాజయోగ సాధనను అర్థం చేసుకుని, శాశ్వత యోగిక వ్యవసాయ పద్ధతులను అనుసరించండి. ఈ పద్ధతి ద్వారా అప్పటి స్వర్ణిమ కాలాన్ని మరల ప్రత్యక్ష రూపంలో చూడగలము.

ప్రజాపిత బ్రహ్మాకుమారీ ఈశ్వరీయ విశ్వ విద్యాలయ అనుబంధ సంస్థ అయిన రాజయోగ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్ ద్వారా "గ్రామీణాభివృద్ధి" అనే ఉద్యమం చేపట్టబడింది. ఇందులో గత ఐదు సం॥రాలుగా భారత దేశంలోని రైతు సోదర సోదరీమణులకు "శాశ్వత యోగిక వ్యవసాయం" గురించిన వినూత్న మేల్కొల్పును తేవడం జరుగుచున్నది. ఈ విద్యాలయంతో సంబంధమున్న మహారాష్ట్ర, గుజరాత్‌లకు చెందిన రాజయోగి రైతు సోదర సోదరీమణులు తమ తమ పంట పొలాలపై రాజయోగ ప్రయోగంతో పాటు కొన్ని జైవిక ఎరువులను ఓ నవీన పద్ధతిలో వినియోగిస్తూ భూమిని సారవంతంగా తయారు చేసి పంటలను పండిస్తున్నారు. ఈ పద్ధతిలో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి గల పంటలను పండిస్తున్నారు. నవ యుగ నిర్మాణంలో ఇదొక వినూత్న యత్నం.

సృష్టి ఆది– మధ్యాంతముల జ్ఞాత, జ్ఞాన సాగరుడు, సుఖ – శాంతుల దాత అయిన పరిమపిత పరమాత్ముడే స్వయంగా తన సంతానమైన మనందరికి మరల రాజయోగాన్ని నేర్పించి మన మనోవృత్తులను పరివర్తన చేస్తున్నారు. వారి శ్రేష్ఠ మహా వాక్యాలలోని కొన్ని వాక్యాలు – ***"మీరు మీ నిజ స్వరూపమును గుర్తించండి, స్వధర్మంలో స్థితులై జ్ఞాన సూర్యడను, పరమోన్నతుడను తండ్రిని అయిన నాతో మీ బుద్ధి యోగాన్ని జోడించినట్లైయితే నా లోని శక్తులు మీ ఆలోచనలను శక్తివంతంగా చేస్తాయి. అప్పడే మీ శుద్ధ శ్రేష్ఠ ఆలోచనలు సర్వసిద్ధులను ప్రాప్తింపజేస్తాయి, అసంభవ కార్యం కూడా సంభవం కాగలదు. ఇది చమత్కారము కాదు***

***సుమా! కేవలం ఇదొక ఆధ్యాత్మిక వ్యవసాయ విజ్ఞానం మాత్రమే. ఇందులో భగవంతునితో ఆత్మలోని శుద్ధ ఆలోచనల కలియికతో కూడిన శ్రేష్ఠమైన ఒక ప్రయోగ విధానం ఇమిడి ఉన్నది. ఈ విధానంలో శుద్ధమైన, శక్తిశాలి భావనల తరంగాలు లక్ష్య సాధనలో ప్రథమ భూమికను పోషించును.***

అయితే మన అన్నదాతలగు రైతులను మేల్కొలిపే సమయం ఆసన్నమైంది. వారు కూడా తమ శ్రేష్ఠ స్వమానమును శక్తులను గుర్తించాల్సిన అవసరముంది. ఇందులో మొట్ట మొదట రైతులు రాజయోగాన్ని నేర్చుకుని తమ పంట పొలాల్లోని కొద్ది భాగంలో ఈ యోగాన్ని ప్రయోగిస్తూ సఫలీకృతులై అనుభవజ్ఞులుగా కాగలరు అనే సద్భావనలను వ్యక్తం చేస్తున్నాము. ఈ విధానంలో ఎలాంటి రసాయనిక ఎరువులను, విషపూరిత క్రిమి సంహారకాలను వినియోగించకుండానే, ఇంట్లోనే తయారు చేసుకోగల జైవిక ఎరువులను ఉపయోగిస్తూ పంట పొలాలను సారవంతంగా తయారు చేయలి. ఆ తరువాత పొలంలో యోగ సాధనతో ప్రకాశ కిరణాలను, ఆత్మలోని సప్త గుణాలను ఏకాగ్రతతో మరియు నిరంతర కృషితో రోజు ప్రయోగించాలి. ఈ విధంగా తమకు నిత్యము ఉపయోగ పడే శుద్ధ సాత్వికమైన ధాన్యము, కూరగాయలను, ఫలహారాదులను పండించాలి. ఇందులో సఫలత పొందిన తరువాత మీ సన్నిహితములో ఉన్న రైతు సోదరులకు ప్రేరణనివ్వండి. దీనితో వారు కూడా ఆధ్యాత్మిక శక్తులను గుర్తించగలరు. ఈ విధంగా పూర్తి విశ్వంలో ముఖ్యంగా భారత దేశం మరల ధనధాన్య రాశులతో నిండుగా వుంటూ, 'విశ్వగురు' పదవిని పొందగలరు. అలాగే పరమాత్ముని కార్యం కూడా ప్రత్యక్షం అవుతుంది.

ఈ శుభాభినందనలతో "శాశ్వత యోగిక వ్యవసాయము" అనే ఈ పుస్తకం ద్వారా పంటలు పండించుటలోని క్రొత్త క్రొత్త విధానాలను తెలుసుకోగలరు అని మేము ఆశిస్తున్నాము.

***శుభాభినందనలతో***

***బి.కె. రాజు***
***ముఖ్యాలయ కార్య నిర్వాహకులు,***
***గ్రామీణాభివృది వర్గం***
***మౌంట్ ఆబూ***

***బి. కె. సరళా***
***జాతీయ కార్యనిర్వాహకులు,***
***గ్రామీణాభివృద్ధి వర్గం***
***మౌంట్ ఆబూ***

# ఈశ్వరీయ ప్రేరణలు

## ( మనోవృత్తి ద్వారా ప్రకృతిలో పరివర్తన )

1. ఏ కార్యంలోనైనా సార్ధకతను పొందాలంటే సహజ విధానము - మనోవృత్తి ద్వారా శుద్ధ ప్రకంపనాలను వ్యాపించాలి. శ్రేష్ఠ వాయుమండలాన్ని తయారు చేయాలి. ఏలాగైతే వైజ్ఞానిక నిర్మితమైన రాకెట్ చాలా వేగంతో ప్రయణించునో అలాగే మీ సద్భావన, శుభ ఆకాంక్షలతో కూడిన మనోవృత్తి , దృష్టి ఈ సృష్టినే పరివర్తన చేస్తాయి. ఇలా ఒకే స్థానంలో వుంటూ మనోవృత్తి ద్వారా సేవ చేయవచ్చు.
2. మన హృదయంలో ఎప్పుడైతే అశుద్ధ మనోవృత్తికి సంబంధించిన వైబ్రేషన్స్ వుండునో అప్పుడు మన మనోవృత్తి ఆత్మీయంగా, శక్తిశాలిగా వుండదు. కావున, మన మనో వృత్తిని నిర్మలంగా పెట్టుకోవాలి. మొదట మనలోని వ్యర్థపు చెడు మనోవృత్తిని సానుకూలంగా మార్చుకోవాలి. మనస్సులో ఎలాంటి అసూయ, ద్వేషం లేనప్పుడే మనం శుభమైన మనోవృత్తితో సేవ చేయగలము.
3. ఎప్పుడైతే నిమిత్తమైన వారు ఒక్క సెకండ్‌లో వ్యర్థాన్ని సమర్థవంతంగా మార్చి శక్తిశాలి ప్రకంపనాలను వాతావరణంలో వ్యాపింప చేస్తారో, అప్పుడే మనసా సేవ ప్రభావం ప్రత్యక్ష రూపంలో అగుపిస్తుంది. కేవలం విస్తారాన్ని సార రూపంలో ఇముడ్చుకుంటూ మనో శక్తులను పెంచుకోండి, వాటిని ప్రయోగించండి.
4. ప్రతి రోజు భిన్న భిన్న సమయాల్లో మనస్సు యొక్క ఎక్స్‌రసైజ్ ( అభ్యాసము) 5 - 5 నిమిషాలు చేయండి. ఇప్పుడిప్పుడే సాకార శరీరధారి, ఇప్పుడిప్పుడే ఆకారీ శరీరధారి మరియు నిరాకారీ బీజరూప స్థితి అభ్యాసాల ద్వారా మనస్సు శక్తిశాలిగా అవుతుంది. శక్తిశాలి మనస్సు ద్వారా ఎప్పుడు కావాలంటే అప్పుడు, ఎక్కడ కావాలంటే అక్కడ తమ ప్రభావమును చూపించవచ్చు.
5. వర్తమాన సమయానుసారంగా వృత్తి ద్వారానే శ్రేష్ఠ వాయు మండలాన్ని తయారు చేసే తీవ్ర పురషార్థ అవసరం ఎంతగానో ఉంది. మనోవృత్తి మరియు వైబ్రేషన్స్ ద్వారానే వాయుమండలం తయారవుతుంది. ఈ వాయుమండలం ప్రకృతిని పరివర్తన చేస్తుంది. అయితే మనోవృత్తిని సదా శ్రేష్ఠంగా (స్వచ్ఛంగా) పెట్టుకోవాలి. ఇతరులు ఎలాంటి వ్యర్థము వినిపించిననూ, ఒక చెవి నుండి విని, మరో చెవితో వదలివేయాలి. అప్పుడే వృత్తి ద్వారా వాయుమండలాన్ని తయారు చేసే సేవ చాలా వేగంగా చేయగలరు.
6. విశ్వ పరివర్తన, ప్రకృతిని పరివర్తన కావించాలంటే ఆశీర్వాదం అనే మాటను గుర్తుంచుకోండి. మీ జడ మూర్తులు భక్తులకు ఆశీర్వాదాలిస్తున్నాయి. అందరి మనోభీష్టాలను నెరవేరుస్తున్నాయి.

అలాంటప్పుడు చైతన్య స్వరూపులైన మీరు ఆశీర్వాదాలివ్వలేరా? కేవలం ఆశీర్వాదాలు ఇవ్వండి తీసుకోండి.

7. మాస్టర్ సర్వశక్తివంతులైన మీ ప్రతి ఒక్కరిలో ఎంత శక్తి ఉదంటే 'మీరు ఏది కావాలంటే అది చేయగలరు'. దీనికి కేవలం ధృడత అనే తాళపు చెవిని సమయానుకూలంగా ప్రయోగించండి.
8. శాంతి శక్తితో బంజరు భూమిని ( కఠిన హృదయాలను) కూడా మార్చవచ్చు. ఒక సంకల్పము సృష్టిని నిర్మించగలదు. సంకల్పంలో శుభ భావన ద్వారా సదాలోచనాల వైబ్రేషన్స్ ద్వారా భూమిని పరివర్తన చేయండి. ఈ సంకల్ప శక్తియే ఎల్లవేళలా మీ మెడలో విజయ మాలను ధరింప చేస్తుంది.
9. శాంతి యొక్క శక్తిశాలీ శుభ భావనల ప్రభావం ప్రత్యక్ష రూపంలో ముందు ముందు మీరే అనుభూతి చేస్తారు. ఇందులో కేవలం ఏకాగ్రత అనగా ఆత్మిక భావనలో ఉంటూ, అంతర్ముఖులుగా ఉండాలనే వ్రతమును ఆచరిచండి. అప్పుడే మీరు ఇతరలకు జ్ఞాన సూర్యుడి చమత్కారాన్ని చూపించగలరు.
10. పవిత్రతతో ప్రకృతిని కూడా పావనంగా చేసే బాధ్యతను మీరందరూ చేపట్టారు. అయితే విశ్వంలోని ప్రతి బిడ్డ సాధనాలపై, సంబంధీకులపై ఎలాంటి మోహం ఉండకూడదని బాప్‌దాదాల శుభ ఆశయం.
11. మాటలతో పాటు మనోవృత్తితో కూడా సేవ చేసినట్లయితే అనగా రెండు విధాల సేవలతో శక్తిశాలీ వాయుమండలం తయారవుతుంది మరియు ప్రకృతి కూడా దాసిగా అవుతుంది. ప్రకోపాలను సృష్టించేందుకు బదులుగా దాసిగా అయి సేవ చేస్తుంది.
12. 'దివ్యబుద్ధి' ఒక శ్రేష్ఠమైన యంత్రము. ఈ యంత్రము ద్వారా వ్యక్తులనే కాదు ప్రకృతిని కూడా దివ్యంగా మార్చవచ్చు, వ్యక్తి దివ్యంగా మారినప్పుడు తన ప్రభావం ప్రకృతిపై స్వతఃగానే చూపగలడు. కావున దివ్యబుద్ధి ఎల్లప్పుడు ఇమిడి ఉన్నట్లయితే ప్రకృతిని కూడా పరివర్తన చేయగలడు. ఇదే భగవంతుడి ఆశీర్వాదము.
13. ఎప్పుడైతే మీ స్థితి అందరికి అతీతంగా మరియు ప్రియంగా ఉంటుందో అప్పుడే మీరు శక్తిశాలి లైట్ హౌస్, మైట్ హౌస్ స్థితిలో స్థితులై ఈ ప్రకంపనాలను వ్యాపింప చేసే సేవ చేయగలరు.
14. ప్రయోగీ ఆత్మల మొట్ట మొదటి చిహ్నం – సదా తమ సంస్కారాలపై విజయులుగా ఉంటారు. రెండెవ చిహ్నం – ప్రకృతి ద్వారా రాబోవు పరిస్థితులపై యోగం ప్రయోగంతో విజయులవుతారు.
15. బ్రాహ్మణులైన మీరు పురుషోత్తమ ఆత్మలు. ప్రకృతి పురుషోత్తమ ఆత్మలకు దాసి అవుతుంది.

ఇప్పుడు మీరు కేవలం ఆత్మలనే కాదు ప్రకృతిని కూడా పరివర్తన చేస్తున్నారు. ఎంతగా మీలో శక్తిశాలీ సతోప్రధానమైన వైబ్రేషన్స్ వుంటాయో అంతంత ప్రకృతి మరియు మనుష్యాత్మల మనోవృత్తి రెండూ పరివర్తితమవుతాయి. మనుష్యాత్మలను మీ శ్రేష్ఠ మనోవృత్తితో మార్చాలి, వైబ్రేషన్స్‌తో ప్రకృతిని మార్చాలి. కాబట్టి, పరివర్తన చేసేవారి మనోవృత్తి ఎల్లప్పుడు శక్తిశాలిగా ఉండాలేగాని సాధారణంగా వుండకూడదు.

16. మీ పవిత్ర దృష్టితో విశ్వంలోని ఆత్మలు మరియు ప్రకృతి రెండూ పవిత్రంగా అవుతున్నాయి. మీ దృష్టి సృష్టినే మారుస్తుంది. మీ శ్రేష్ఠ కర్మలతో శిష్టాచార ప్రపంచ నిర్మాణం గావించబడును.

17. ఆత్మిక సంతానమైన మీరు స్మృతి శక్తి తో పూర్తి విశ్వాన్నే పరివర్తన చేస్తున్నారు. స్మృతి అనగా శాంతి శక్తి. దీనితో వ్యక్తి ప్రకృతి పరివర్తన చెందును. దీని అర్థం మనుష్యులు ప్రకృతి మారాలి. ప్రకృతికి మన నోటి ద్వారా జ్ఞానం వినిపించలేము కదా, మానవులకు జ్ఞానాన్ని తెలయజేయవచ్చును. కాని ప్రకృతిని యోగబలంతో పరివర్తన చేయగలము.

18. 'బాబా, నేను ' అనే ఒకే ఒక సంకల్పము మనస్సులో వుండాలి. దీన్నే 'యోగం' అంటారు. ఎప్పుడైతే మీరు శక్తిశాలి యోగంలో కూర్చుంటారో, అప్పుడు ఇతర సంకల్పాలు శాంతిస్తాయి. బాబాతో కలయిక జరపాలనే సంకల్పము తప్ప, మిగతా సంకల్పాలన్నీ తగ్గిపోతాయి. సంకల్పాలలో విస్తారము వుండకూడదు. స్టాప్ అనగానే నిలిచిపోవాలి, పూర్తిగా ఆగిపోవాలి. అలాంటి కంట్రోలింగ్ పవర్ వుండాలి.

19. మీశ్రేష్ఠ భావన ఫలస్వరూపంగానే విశ్వంలోని ఆత్మలు పరివర్తితమవుతున్నారు. అంతేగాక ఇక ముందు ప్రకృతి కూడా మారి తీరుతుంది. మీ శ్రేష్ఠ భావనలు ఇంతటి శ్రేష్ఠ ఫలన్ని సాధిస్తాయి.

20. మీ శుభ భావన మహత్వం గురించి మీకు తెలుసా? శుభ భావనను సాధారణంగా భావించి కార్యములో వినియోగిస్తున్నారా, లేక, దాని మహత్వాన్ని గుర్తించి కార్యంలో వినియోగిస్తున్నారా? ప్రపంచంలోని వారు కూడా శుభ భావన అనే పదాన్ని వాడతారు, కాని మీ శుభ భావనలు కేవలం శుభప్రధమైనవే కాకుండా శక్తివంతమైనవి కూడా. ఎందుకంటే మీరు పురుషోత్తమ సంగమయుగంలోని శ్రేష్ఠ ఆత్మలు. డ్రామానుసారంగా సంగమయుగంలో ప్రత్యక్ష ఫలం పొందే వరదానం మీకు లభించింది. కేవలం ఈ మహత్వాన్ని గుర్తించి ప్రయోగించండి.

21. ఏలాగైతే సైన్స్ సాధనాలతో దూరంగా ఉన్నవారు కూడా దగ్గరగా ఉన్నట్లు మీ మాటలు వారికి వినిపిస్తాయి, మీ సందేశాలు, దృశ్యాలు కూడా వారికి చేరుతాయో, తాత్కాలికంగా సమీపతను అనుభూతి చేయగల్గుతున్నారో అలాగే మీరు మీ సైలెన్స్ శక్తితోశక్తిశాలి శుభ భావనలు

దూరంగా ఉన్నవారికి కూడా ప్రతిఫలాన్ని అందించలేవా? దీని కోసం శాంతి శక్తిని జమ చేసుకోవాలి.

22. శుభ భావన అనగా శక్తిశాలి సంకల్పము. అన్నింటికంటే సంకల్పాల గతి చాలా వేగవంతమైంది. చాలా వేగంగా వెళ్ళే సాధనాలను సైన్సు తయారుచేసింది. కాని, వాటన్నింటి కంటే వేగవంతమైనది – సంకల్పము. అందుచేత, మాస్టర్ విశ్వకళ్యాణకారి ఆత్మలైన మీరు చేసే మనసా సేవ వారికి ప్రత్యక్షఫలాన్ని అనుభూతి కల్గిస్తుంది. ఇందులో సమయం తక్కువ, సాధనాలు తక్కువ, ఖర్చు కూడా తక్కువే. ఇందులో కేవలం మీ మనుస్సు మరియు బుద్ధిని సదా తేలికగా వుంచుకోవాలి. 'ఏకాంతము ఏకాగ్రతల' పైన విశేషంగా శ్రద్ధ పెట్టాలి.

23. ఏకాంత ప్రియమైన ఆత్మ చాలా శక్తిశాలిగా తయారవుతుంది. తనలోని సూక్ష్మ శక్తులైన మనస్సు, బుద్ధిని ఎప్పుడు కావాలంటే అప్పుడు, ఎక్కడ కావాలంటే అక్కడ ఏకాగ్రము చేయగల మహోద్భుత కార్యసమర్థతను కల్గివుంటుంది. మీరు ప్రకృతికే అధికారులు. మీ పరివర్తన ద్వారా ప్రకృతి కూడా పరివర్తితమవుతుంది. ఇప్పుడు మీరు సతోప్రధానంగా అవుతున్నారు, మీకు తోడుగా ప్రకృతి కూడా తమోప్రధానత నుండి సతోప్రధానంగా అవుతుంది. ఈ విధంగా శుభ భావనలు మరియు శుభ సంకల్పాల ద్వారా యోగ ప్రయోగం చేయండి.

# శాశ్వత యోగిక వ్యవసాయము - అవసరము

ప్రపంచంలో ప్రతి మనిషి – తన జీవితం సాత్వికంగా వుండాలని, మంచి కార్యములు చేయాలని, గొప్పవారిగా కావాలని, ప్రశాంత జీవితాన్ని గడపాలని ఆశిస్తుంటాడు. కాని, కోరిక కల్గి వుండడం ఒక ఎత్తైతే ఆ కోరికను నెరవేర్చుకోవడం మరో ఎత్తు అవుతుంది. నేటి మానవులలో మనం గమనిస్తున్న విషయం – వారు ఆశించేది వేరు, చేసేది వేరైనా శాంతిని ఆశిస్తారు కాని, పరిస్థితులకు స్వభావ సంస్కారాలకు వశమై చేసే కర్మలతో తమకు, ఇతరులకు అశాంతికి కలిగిస్తున్నారు. స్నేహంతో, ప్రేమగా మెలగాలని కోరుకుంటారు కాని, వ్యవహారంలో అపార్థాలు చేసుకోవడంతో విభేధాలు (భేదాభిప్రాయాలు), వివాదాలు, విద్వేషాలకు దారి తీస్తున్నారు. ఆరోగ్యవంతముగా జీవించాలనుకుంటారు కానీ, సరైన సాత్వికాహారం లభించని కారణంగా శారీరక ఆరోగ్యాన్ని క్షీణింపచేసి, రోగాలను ఉత్పన్నం చేసే లేదా ఉద్రేకతలను రేకెత్తింపచేసే విషపూరిత తత్వాలు శరీరంలో వుండిపోతున్నాయి. ఇవి కేవలం శరీరానికి హాని చేయడమే కాక మానసిక సమతులత్యను కూడా పాడుచేస్తుంటాయి, నిర్ణయశక్తిని విచలితం చేస్తాయి, నియంత్రణలేని మానసిక ఆవేశాలను రేకెత్తిస్తాయి. స్థిరత్వాన్ని పోగొట్టి తప్పుదారి పట్టిస్తాయి. అందువల్లనే మనుష్యులు తీసుకునే ఆహారానికి వారి ఆచరణకు, ఆలోచనలకు వ్యవహారాలకు నిగూఢ సంబంధం ఉంటుంది.

ఆహారం మనస్సు పై ప్రభావం చూపుతుందని, మనస్సు (ఆలోచనలు) ఆరోగ్యము పై చూపుతుందని ప్రాచీన కాలం నుండి చెప్పబడుతోంది. అందుకే 'ఎటువంటి ఆహారమో అటువంటి మనస్సు, ఎటువంటి మనస్సో అటువంటి దేహ ఆరోగ్యము' అని అంటుంటారు. అందుచేత ఉద్రిక్తతలకు దూరంగా, వ్యసనాలకు దూరంగా, చరిత్ర సంపన్నమైన మానవ జీవితాన్ని కొనసాగించుటలో ఆహారం పాత్ర ఎంతగానో ఉంటుంది. శాంతి, సౌమ్యత సాత్వికలను ధారణ చేసి సుఖమయమైన, ఆనందమయమైన జీవతాన్ని కొనసాగించాలన్నదే మనందరి లక్ష్యం. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు మనస్సును మన ఆధీనంలో ఉంచుకోవడం చాలా అవసరం. మన మనస్సును ఆధీనంలో ఉంచుకోవాలంటే మన ఆహార పథ్యముపై శ్రద్ధ పెట్టడం చాలా చాలా అవసరం.

ధాన్య ఉత్పాదన విధానంపై కూడా ఆలోచించాల్సిన అవసరం ఉంది. వివిధ దేశాలలో వ్యవసాయంలో ధాన్యము, పండ్ల ఉత్పాదనకు విభిన్న పద్దతులను ప్రయోగిస్తారు. అందులో–

1. **నైసర్గిక సేద్య విధానం :–**

ఇందులో నాగలి పట్టి భూమిని దున్నడం (సేద్యం చేయడం) జరగదు మరియు ఏ విధమైన

ఎరువులను తెచ్చి ప్రయోగించడం జరగదు. కలుపు తీయుట, పదును పెట్టుటలో ఎలాంటి పనిముట్లను మరియు క్రిమిసంహారకాలను ఉపయోగించనక్కరలేదు. పంట చేతికొచ్చిన తర్వాత ధాన్యము వేరు చేసాక, మిగిలిన అనవసర భాగాలను ఆ పొలంలోనే వెదజల్లుతారు. ఈ విధానంలో పప్పుదినుసులకు సంబంధించిన పంటలను (ఉదా॥కు కంది,శనగ పెసర్లు, మినుములు, సోయాబీన్ మొ॥వి) పండిస్తారు.

## 2. సేంద్రీయ సేద్య విధానం :-

భూమిలో పౌష్టికత మరియు పంట ఉత్పాదన సమర్థతను పెంచుటకై తక్కువ సమయంలో కంపోస్ట్ అయ్యే పదార్థాలను భూమిలో లేక భూమిపై వెదజల్లుతారు. తరువాత నాగలితో సేద్యం చేసి భూమిలో కలుపుతారు. ఇందులో కంపోస్ట్ ఎరువులు, పచ్చి మొక్కల ఎరువులు, వానపాముల ఎరువులు మొ॥గు వాటిని ఉపయోగిస్తారు. పంట పండించుటకు ముందుగానే కొన్ని రకాల మొక్కల సాగుబడి చేయడం కూడా జరుగుతుంది. ఈ విధానంలో జైవిక క్రిమిసంహారకాలను కూడా ప్రయోగించడం జరుగుతుంది.

## 3. జైవిక వ్యవసాయ విధానం :-

సేంద్రియ సాగుబడిలో మరియు జైవిక సాగుబడి విధానంలో పెద్ద వ్యత్యాసము కనిపించదు. సేద్యపు భూమిలోనే అనేక విధాలగు ఉపయోగకారి సూక్ష్మ జీవరాసులు వుంటాయి. అందులో కొన్నింటిని పౌష్టికాహారం ద్వారా పెంపొందించటం జరుగుతుంది. ఉదా॥కు నత్రజనిని స్థిరం చేసే బాక్టీరియాలు, ఫాస్ఫరస్‌ను అందించే బాక్టీరియాలు, సేంద్రీయ పదార్థాలను విఘటితం చేయు పరాన్న జీవులు, బూజులను అరికట్టే (నిరోధించే) పరాన్న జీవులు మొ॥వి పంటలకు అవసరమైన సమయాల్లో పొలాలకు అందించబడును.

## 4. రసాయనిక సేద్య విధానం :-

ఈ విధానంలో సేద్యపు భూమిలో రసాయనిక ఎరువులను ఉపయోగిస్తారు. మందులను చల్లి కలుపు మొక్కలను నివారిస్తారు. ప్రమాదకరమైన మందులను ఉపయోగించి చీడ పురుగులను మరియు రోగాలను నియంత్రిస్తారు. ఈ విధానంతో ప్రాకృతిక నియమాలలో చాలా నష్టము కలుగుతుంది.

## 5. శాశ్వత యోగిక వ్యవసాయ విధానం :-

యోగము యొక్క మాధ్యమముతో అనగా పరమాత్ముని శక్తి అలాగే శ్రేష్ఠ సంకల్పాల ప్రకంపనాల ద్వారా నైసర్గిక వనరులలో గుణాత్మకమైన విలువలను పెంపొదిస్తారు. ఫలితంగా ఉత్పాదన సమర్థత కూడా పెరుగును. ఈ వ్యవసాయ విధానంలో పంటలు పండించుటలో ఖర్చు తక్కువ శ్రమ కూడా

తక్కవే. అంతేగాక ప్రకృతి సుఖదాయిగా, వాతావరణం పరిశుద్ధంగా అవుతుంది, ఆహార ధాన్యాలు సాత్వికంగా, అధిక పౌష్టికయుతంగా లభించును.

పూర్తి ప్రపంచములో ధాన్య ఉత్పాదన పెంచుటకై రసాయనిక ఎరువులు క్రిమిసంహారకాలను అత్యధిక మోతాదులలో ప్రయోగించడం జరుగుతుంది. దీనితో నేడు అనేక రకాల దుష్పరిణామాలు ఎదురవుతున్నాయి. వీటిని అత్యధికంగా ఉపయోగించటం ద్వారా వాతావరణ సమతుల్యత పాడవుతుంది. వాతావరణ కాలుష్యము పెరుగుతుంది. మొక్కలలో రోగ నిరోధక శక్తి క్షీణిస్తుంది. ధాన్య పదార్థాలలో పౌష్టికత లోపించి శరీరంలో రసాయనిక విష తత్వాలు వ్యాపించడంతో 'శారీరక రోగ నిరోధక శక్తి' క్షీణించి ఫలితంగా అనేక రకాల రోగాలకు కారకాలవుతున్నాయి.

రసాయనిక ఎరువులను మరియు క్రిమిసంహారక రసాయనాలను ప్రయోగించడం ద్వారా మొక్కల ఆకుల లోపలి కణజాలాల ఆకృతిలో మార్పులు కల్గుతాయి. మొక్కలలోని ఆంతరిక క్రియా శక్తి నశిస్తుంది. కాబట్టే మొక్కలకు అనేక రోగాలు సహజంగా వెలువడుతున్నాయి. ఇలాంటి వృక్ష జాతిపై ఆధారపడి జీవించే జీవరాశికి, మానవులకు అసాధ్యమగు రోగాలు ఉత్పన్నమవుతున్నాయి. భూమి పై క్రొత్త క్రొత్త కలుపు మొక్కలు మొలకెత్తుతున్నాయి. వీటన్నింటి కారణంగా ధాన్య ఉత్పాదనలో ఆశించిన దానికంటే ఫలితం తక్కువగా లభిస్తోంది. దీని పరిణామ స్వరూపంగా రైతుల జీవితాలలో దుఃఖము, అశాంతి, ఉద్రేకం మొ॥వి పెరుగుతున్నాయి మానసిక సమత్యులత కృశిస్తూ ఉంది. ఫలితంగానే అనేక శారీరక మానసిక రోగాలు వెలువడుతున్నాయి. ఈ కారణంగా రైతులు ఎన్నోమార్లు ఆత్మహత్యలకు కూడా పాల్పడుతూంటారు.

## రసాయనిక ఎరువులు క్రిమిసంహారకాలను ప్రయోగించడం ద్వారా కల్గే అనర్థాలు

ఈ విభాగానికి చెందిన పరిశీలకుల, అనుభవజ్ఞుల ద్వారా తెలసిన విషయం ఏమంటే – భారత దేశంలో వుండే ప్రతి మనిషి కడుపులో దాదాపు ఒక మి.గ్రా. డి.డి.టి, బి.హెచ్.సి వంటి కీటక నాశక మందులు అల్ప మోతాదులో ప్రవేశిస్తాయి. వీటి కారణంగా మెదడు, మూత్రపిండాలు వంటి సునిశిత అవయవాలలో అధిక మోతాదులో విష ప్రభావాలను చూపుతున్నాయి. కాన్సర్ లాంటి రోగాలు పెరుగుతున్నాయి.

డా॥ ప్రకాశ్ చంద్ర అనే వైజ్ఞానిక శాస్త్రవేత్త అనుసారంగా – " ఇలాంటి రోగాలు భారతదేశంలో లక్షలాది మందిలో వృద్ధి అవుతున్నాయి". ఐక్యరాజ్య సమితి నుండి కూడా ఇలాంటి ప్రమాదకర హెచ్చరికలు మొదటి నుండే లభిస్తూవున్నాయి.

లక్నోలో ఉన్న 'కింగ్ జార్జ్ మెడికల్ కాలేజ్ అండ్ టాక్సికాలొజీ రీసెర్చ్ సెంటర్' ద్వారా డి.డి.టి మరియు మెలాథియాన్ వంటి విష పూరిత కీటకనాశకాలను ప్రయోగించే (చల్లే) వారిలో పరీక్షలు నిర్వహించారు. వారిలో 50% కంటే ఎక్కువ మందిలో తలనొప్పి, చింత, నిద్రలేమి, నిరాశ, విస్మృతి ( జ్ఞాపక శక్తి క్షీణించుట), నేత్ర దోషాలు మొ॥గు రోగ లక్షణాలు పెరుగుతున్నట్లు గమనించడం జరిగింది.

హైదరాబాద్‌కు చెందిన ఒక ఆసుపత్రిలోని బాలెంతరాళ్ళు వార్డులో స్పష్టంగా విధితమైనదేమంటే– అకాలంగా కల్గే కాన్పులు (సమయ నిర్ధారణ లేని కాన్పులు), గర్భమందే పిల్లలు చనిపోవడం వంటి విషయాలకు కారణాలు విషతుల్యమైన క్రిమిసంహారకాలేనని తేలింది. అలాంటి బాలెంతరాళ్ళ రక్తంలో డి.డి.టి మరియు బి.హెచ్.సి వంటి మందులు అధికంగా వుండుటం గమనించడం జరిగింది.

1977 సం॥ము కర్ణాటకకు చెందిన 'మాలనాడ' అనే ఊరిలో జరిగిన సంఘటన " హండిగోడు సిండ్రోమ్స్" పేరుతో ప్రసిద్ధి గాంచింది. అక్కడ సాగుబడి చేసే కొన్ని వరి పొలాలలో అత్యధిక మోతాదులలో క్రిమిసంహారకాలను వాడడం జరిగింది. అందులోని కొంత శాతం నీటి ద్వారా లోతట్టు ప్రాంతాల పొలాల్లోకి ప్రాకి ఆ పొలాల నీటిలోనే ఉండిపోయింది. ఈ నీళ్ళల్లో చాలా ఎండ్రకాయులు (పీతలు) ఉండేవి. ఇక్కడ పనిచేసే వారిలో కొందరు వీటిని పట్టి తినేవారు. వీటిని తిన్న వారిలో 200 మందికి పెరాతలైసిస్ (పక్షపాతం) వచ్చింది. అనేక పరీక్షల ద్వారా గుర్తించినదేమంటే– పంట పొలాలలో ప్రయోగించిన క్రిమిసంహారకాలు ఆంశిక రూపంలో ఆ పీతలలో ఉన్న కారణంగానే అందరికి ఒకే సారిగా పక్షవాతం కల్గినది.

ఇటాలియన్ రసాయనిక శాస్త్రవేత్త అయిన 'అమెరిగో మాస్కొ' అనుసారంగా పంట పొలాలలో ఉపయోగించే క్రిమిసంహారక మందులు, ఎంతటి ప్రమాదకరమైనవంటే, జన్యు ఉత్పరివర్తనాలను మార్చకల్గే పరమాణు విచ్ఛేదనంలో వెలువడే రేడియోధార్మిక పదార్థాల (మూళకాల)తో సమానం. జేలిబ్, ఫల్తాన్, కెప్టాన్ వంటి తెగుళ్ల మందులను ప్రయోగించడం ద్వారా ప్రతి సం॥ము కల్గే నష్టం 14 మాగ్నెట్‌ల 19 హైడ్రోజన్ బాంబులతో సమానం. దీని కారణంగానే అమెరికాలో 15 శాతం పిల్లలు మానసిక వికలాంగులుగా జన్మిస్తున్నారు. అంతేకాకుండా వృక్షాలు, జంతువులలో రోగాలు, భూ కాలుష్యము పెరుగుతూ వచ్చాయి. ఇది ఎంత భయంకరమైనదంటే దీని నష్టాన్ని ఊహించటమే కష్టం.

క్లోరినేటెడ్, హైడ్రోకార్బన్, డి.డి.టి, పి.సి.బి లాంటి మందుల కారణంగా అమెరికా యువకులలో నపుంసకుల సంఖ్య పెరుగుతుంది. దానికి తోడు హై బ్లడ్ ప్రెషర్ (అధిక రక్త ప్రసరణ), హార్ట్ అటాక్ ( గుండె పోటు), కాన్సర్ మరియు ఎయిడ్స్ వంటి రోగాలకు కూడా మూలం ఈ రసాయనిక ఎరువులు మరియు క్రిమిసంహారక మందుల అధిక ప్రయోగమే.

## కర్మల గుహ్య రహస్యము

పంట ఉత్పాదనను విపరీతంగా పెంచాలనే స్వార్థంతో రసాయనిక ఎరువులను ఉపయోగిస్తున్నారు మరియు చీడ పురుగులు పట్టినప్పుడు ఆందోళన చెంది క్రిమిసంహారకాలను చల్లుతున్నారు. పంట పొలాల్లో చీడ పురుగు కనిపిస్తే చాలు, దానిని ఏవిధంగానైనా నాశనం చేయాలి, లేదంటే చాలా నష్టపరుస్తుంది అనే ఆలోచన మొదట మనస్సులో వస్తుంది . ఇలాంటి సంకల్పాలతో పాటు మందులు ప్రయోగించడం వల్ల దాని ప్రభావం పంట ఉత్పాదనపై చెడు ప్రభావం చూపిస్తుంది. ఇలాంటి ఆహార ధాన్యాలతో వండిన భోజనాన్ని తినే వ్యక్తులలో కూడా అలాంటి చెడు ఆలోచనలే వస్తాయి. కొద్ది పాటి సమస్య రాగానే వెంటనే ఆందోళన చెందడం, గొడవలకు దిగడం చేస్తుంటారు.

అత్యధిక రసాయనిక ఎరువుల అనావశ్యక ప్రయోగంతో భూమిలో నివసించే ఉపయోగకారి జీవరాశి కూడా చనిపోతుంది, దీనివల్ల ప్రకృతికి దుఃఖము కలగడమే కాక, ప్రకృతి నియమాలకు నష్టము కలుగుతుంది. క్రిమిసంహారక మందులు చల్లడం వల్ల చీడ పురుగులు విల విల కొట్టుకుంటూ మరణిస్తాయి. ఈ విధంగా విషమిచ్చి క్రిమి కీటకాలను చంపటం కూడా ఒక పాప కర్మే కదా! వాస్తవానికి చీడ పురుగులను హరించే విధానం ప్రకృతిలోనే స్వాభావికంగానే ఇమిడి ఉంది అనగా చీడ పురుగులపై ఆధారపడి జీవనం కొనసాగించే మరెన్నో క్రిమికీటకాలు ప్రకృతిలో జీవిస్తున్నాయి కాబట్టి, పంటకు పట్టే చీడ పురుగులను నష్టం చేయడం మనుష్యుల పని కాదు.

మన జీవితంలో వచ్చే సమస్యలు లేక పరిస్థితుల వెనక ఒక బలమైన కారణం ఉంటుందని, అది మనము చేసుకున్న కర్మల ఫలితమని కర్మ సిద్ధాంతం గురించి కాస్త నిగూఢంగా ఆలోచించినట్లైయితే చాలా స్పష్టంగా తెలుస్తుంది. ఏదైనా జబ్బు కలిగినా లేక ఆరోగ్యంగా హుషారుగా ఉన్నా అది మన మంచి చెడు కర్మల ప్రతిఫలమే, అంటే మనం పంచతత్వాల ప్రకృతి నియమాలను ఉల్లంఘించి ప్రకృతికి దుఃఖం కలిగించినట్లైయితే పంచ తత్వాల కర్మేంద్రియాలతో దుఃఖ పడవలసి ఉంటుంది.

మహాభారతంలోని ఒక వర్ణనలో భీష్మ పితామహుడు గాయాలమయమై అంపశయ్యపై విశ్రమించి ఉండగా, తాను శ్రీకృష్ణునితో – 'నేను చేసిన ఏ పాపకర్మ కారణంగా నేడు ఈ విధంగా అంపశయ్యపై ఉండి ప్రాణాలు త్యజించవలసి వస్తుంది?' అని ప్రశ్నిస్తాడు అందుకు శ్రీకృష్ణుడు సమాధానంగా నీవు ఒకసారి రథంలో కూర్చొని వెళ్తూండగా రథానికి అడ్డంగా ఒక పాము వచ్చింది, దాన్ని కాపాడాలని నువ్వు బాణంతో దాన్ని తీసి దారి ప్రక్కన పడేసి వెళ్ళావు. కాని ఆ పాము ముళ్ళ కంప పై పడి ఎటు కదల్లేక అక్కడే ప్రాణాలు విడిచింది. ఆ కర్మ ఫలితమే నేడు ఈ విధంగా మీరు మీ అంతిమ శ్వాసను వదిలిపెట్టవలసి వస్తోంది అని కృష్ణుడు పలికాడు.

బీష్ముడు ధర్మరాజుకు రాజనీతిని భోదిస్తాడు, అది విని ద్రౌపది కురు సభలో తనకు జరిగిని అవమానాన్ని గుర్తుచేస్తూ ఇంతటి జ్ఞానవంతులైన మీరు ఆ సమయంలో ఎందుకు మౌనం వహించారు?' అని ప్రశ్నిస్తుంది. దానికి సమాధానంగా భీష్ముడు ' కౌరవుల అన్నం(ఉప్పు) తినడం కారణంగా అదే నా రక్తంలో ప్రవహించేది. ఇప్పుడు అర్జునుడి బాణాలతో ఆ రక్తం తొలగిపోయింది కాబట్టి, ఇప్పుడు అశుద్ధ భోజన ప్రభావం సమాప్తమయ్యింది ' అని చెప్తాడు.

దీనిబట్టి చూస్తే నేడు వ్యవసాయ రంగంలో విపరీతంగా దిగుబడిని సాధించాలనే అత్యాశతోనేగాక పంటకు పట్టే చీడపురుగులను చూసి ఆందోళన చెంది వెంటనే దాన్ని చంపేయాలనే భావనలతో క్రిమిసంహారకాలను చల్లి చీడను నిర్మూలించే ప్రయత్నం చేస్తూ పంటలను పండిస్తున్నారు. ఇలాంటి స్వార్థం, ద్వేష, ఆందోళన భావాలతో పండించే ఆహార ధాన్యాన్ని మనమందరం ఈ రోజు ఆహారంగా తీసుకుంటున్నాము. ఫలితంగా నేడు సమాజంలో మన కళ్ళ ఎదుటగా జరుగుతున్న పాపాలను, ఘోరాలను చూస్తూ కూడా మౌనంగా ఉండిపోతున్నాము. ఏదో చేయాలనుకుంటున్నాము కాని, చేయలేకపోతున్నాము కారణం? మనం తీసుకునే ఆహారం మన శ్రేష్ఠ సంకల్పాలను కార్యాచరణలోకి రాకుండా చేయడమేగాక అనేక రకాల పాపాకర్మలకు కారణమవుతుంది. ఫలితంగా మన జీవితంలో ఆనందాన్ని, సుఖాన్ని, ఆరోగ్యాన్ని ఆశించినా వాటిని పొందేందుకు ఎన్నో రకాల అడ్డంకులు ఏర్పడుతున్నాయి.

కాబట్టి, రసాయనిక ఎరువులు క్రిమిసంహారకాల వల్ల కల్గే అనర్థాల నుండి కాపాడుకోవాలంటే వాస్తవానికి ఎక్కడ నుండి తప్పులు జరిగాయో అక్కడి నుండే మార్పులు తీసుకరావల్సిన అవసరం వుంది. అదే మన మనసులోని ఆలోచనలు. నేడు మనం మన సహజసిద్ధమైన జీవనానికతీతముగా కృత్రిమ జీవితాన్ని కొనసాగిస్తున్నాము ప్రకృతి నియమాలను ఉల్లంఘించాము. మరల ఇప్పుడు విజ్ఞానాన్ని ఆధారంగా చేసుకుని ప్రకృతి నియమానుసారంగా నడుచుకుంటూ, ప్రకృతి లేక పంచ తత్వాలతో పాటుగా సమస్త జీవరాశులతో, వృక్ష జాతులతో, పశుపక్షాదులతో, ప్రాణులతో కూడా ప్రేమ పూర్వకంగా స్నేహ సంబంధాన్ని జోడించి మన జీవితాలను సుఖమయంగా మార్చుకోవాలి. దీనికి ' రాజయోగం'తో లభించే ఆధ్యాత్మిక శక్తుల అవసరం ఎంతగానో ఉంది. ఈ శక్తుల ఆధారంగానే సాగుబడిచేస్తూ భూసారాన్ని పెంచవచ్చు, పంటలను రోగ రహితంగా, శక్తిశాలిగా చేయవచ్చు. అనేక విధాలైన చీడ పురుగులను, రోగాలను నియంత్రించ వచ్చు, అలాగే ఆహార ధాన్యాలలో సాత్వికతను కూడా తీసుకరాగలము. ఇటువంటి సేద్య విధానానికే "శాశ్వత యోగిక వ్యవసాయము" అని పేరు పెట్టడం జరిగింది.

ఈ రాజయోగ విధానం అజ్ఞాన అంధశ్రద్ధలతో కూడింది కాదు, ఇదొక సంపూర్ణ విజ్ఞానము. ఈ యోగ విధానంలో మంత్రోచ్చారణ, ప్రాణాయామాలు లేక ఆసనాలకు సంబంధించిన విషయాలు

వుండవు. ఇది భారతదేశానికి చెందిన ఒక ప్రాచీన యోగ పద్ధతి. దీని ఖ్యాతి ప్రపంచ నలుమూలలా వ్యాపించింది. కాని, ఈ యోగ విద్య గురించి ఆధ్యాత్మిక జ్ఞానం తెలయని కారణంగా మానవులలో చింత, చిరాకు, మానసిక ఉద్రేకాలు ఎక్కువ అవుతూనే ఉన్నాయి. మానవుల భవిష్యత్తు గాఢాంధకారంలో మునుగుతున్నట్లు కనిపిస్తుంది.

కలియుగ అంతిమ సమయంలో యోగేశ్వరుడు, జ్ఞానసాగరుడు అయిన పరమపిత పరమాత్మ స్వయంగా ప్రజాపిత బ్రహ్మ ముఖారవిందము ద్వారా సత్యమైన రాజయోగమును నేర్పించారు. ఈ ఆధునిక యుగంలో రాజయోగ అవసరం చాలా చాలా ఉంది. ఈ యోగాభ్యాసము ద్వారా మానసిక ఒత్తిళ్ళు (ఉద్రేకాలు) దూరమవడమేగాక శరీరానికి, మనస్సుకు సుఖశాంతులను, శక్తిని ప్రసాదిస్తుంది. మనుష్యులను కార్యకుశలురుగా చేస్తుంది. నేటి కలియుగపు కాలుష్య వాతావరణంలో ఉంటూ కూడా సంతులిత జీవనాన్ని సాగించే కళను నేర్పిస్తుంది. ఈ రాజయోగ అభ్యాసంతో ఆత్మలోని గుప్త శక్తులు జాగృతమవుతాయి, ఆత్మలోని గుణాలు, కళలు, విశేషతలు వెలుబడుతాయి. ఈ రాజయోగము మనుష్యులకు నిర్వహణా దక్షతను నేర్పడమేగాక నేడు మానవుల మనసును ఆవహించిన వికారాలనే క్రిములను కూడా నాశనం చేసే శక్తిని ఇస్తుంది. మనసును శక్తిశాలిగా చేసుకొనుటకు మనస్సులో శుద్ధ సంకల్పాలను రచించేందుకు, మనసును స్థిరంగా చేసుకోవడానికి రాజయోగం ఒక దివ్య ఔషధం.

రాజయోగము జీవితాన్ని దివ్యంగా మార్చి సంపూర్ణ గుణవంతుడిగా తయారయ్యే దిశలో నడిపించే సాధనము. ఈ రాజయోగములో శారీరక ఆసనాల గురించి చెప్పడం జరగదు, కాని ప్రతి విషయాన్ని ఆధ్యాత్మికంగా మనో వైజ్ఞానిక దృష్టికోణం ఆధారంగా, వ్యవహారిక శైలిలో తెలయజేయడం జరుగుతుంది. ఆసక్తిగలవారు ఎవరైనా ఈ యోగాన్ని ఏకాగ్రతతో అభ్యసించినట్లైతే అంతర్ముఖులుగా అయి నియమాలను జీవితంలో పాటించినట్లైతే వారు జీవితంలో పరమానందాన్ని, నిజమైన సుఖ-శాంతులను పొందగలరు. ఈ రాజయోగాన్ని, వారు ఏ జాతుల వారైనా, ధర్మాలకు, వర్ణాలకు, వయస్సులకు, వృత్తులకు, దేశాలకు చెందిన వారైనా అభ్యసించవచ్చు. ఎందుకంటే రాజయోగం ఈ బంధనాలన్నింటికి అతీతంగా తీసుకెళ్తుంది. ఇలాంటి అనుభూతిని పొందుతూ వ్యక్తులకు, వస్తువులకు, వనస్పతులకు (చెట్లకు) కూడా ఆ అనుభూతిని కలిగించవచ్చు. ఇందులో కేవలం స్నేహంతో ప్రేమగా ఆ వ్యక్తులతో, వస్తువులతో, మొక్కలతో సంబంధాన్ని జోడించవలసిన అవసరం ఉంటుంది.

## వనస్పతులలోని కొన్ని వైజ్ఞానిక సిద్ధాంతాలు

డా॥ సర్ జగదీశ్ చంద్రబోస్ తన ప్రయోగాల ద్వారా మనుష్యుల్లానే వృక్షాలలో కూడా క్రియలు ఉంటాయని నిరూపించారు. మొక్కలు, ఊపిరితిత్తులు లేకుండానే శ్వాసను తీసుకోగలవు, జీర్ణనాళాలు

లేకుండానే ఆహారాన్ని జీర్ణించుకోగలవు, కండరాలు లేకుండానే కదలికలను కల్గివుంటాయి, జ్ఞాన తంతువులు లేకుండానే సందేశాలను గ్రహించి వాటికి స్పందనను వ్యక్తం చేయగలవు. వారు వృక్షాలలో జరుగు ఆంతరిక కదలికలను అర్థం చేసుకోవడానికి ఒక పరికరాన్ని తయారుచేసారు. దీని ఆధారంగా చనిపోయే అంతిమ క్షణాలలో ప్రాణులు ఏ విధంగా కొట్టుమిట్టాడుతాయో అలాగే వృక్ష జాతి కూడా అంతిమ ఘడియలలో విలవిల్లాడుతాయి. ఆ సమయంలో వాటి నుండి అధిక మోతాదులో శక్తి వెలువడుతుందని ప్రమాణీకరించారు. బాహ్యపరమైన శక్తి ( వైబ్రేషన్) ఏదైనా మొక్కను స్పర్శించగానే ఆ శక్తి మొక్కలలో విద్యుచ్ఛక్తిగా మారుతుంది, దాని ప్రత్యక్ష ప్రమాణము కూడా కనిపిస్తుంది అని వారు ‘ ఆప్టికల్ పల్స్ రికార్డర్ ’ అనే పరికరంతో నిరూపించారు.

జగదీశ్ చంద్ర బోస్ గారి పరిశోధనా ప్రయోగాలను ముందుకు తీసుకువెళుతూ, వృక్షాలలో కూడా భావనలు ఉంటాయని, అవి మనుష్యుల మనో భావనలను కూడా అర్థం చేసుకోగలవని – క్లీవ్ బ్యాక్స్టర్ తన ప్రయోగాలలో నిరూపించారు. వారు “ లై డిటెక్టర్ ” అనే పరికరంతో అనేక వృక్ష జాతులపై ప్రయోగాలు గావించారు. మనస్సులోని భావనలను బట్టి మొక్కల ఆంతరిక శక్తి ప్రవాహంలో హెచ్చుతగ్గులు ఉంటాయి. భావనల ద్వారా ఉత్పన్నమయ్యే ప్రతీకార చర్యలను లేదా సంవేదనలను లై డిటెక్టర్ లోని గాల్వానో మీటర్ ద్వారా లెక్కించడం జరిగింది.

మనుష్యుల మనోభావనలకు మొక్కలు ఏ విధంగా ప్రతిస్పందిస్తాయో గమనించడానికి క్లీవ్ బ్యాక్స్టర్ ‘డ్రాసినా’ మొక్క ఆకును యంత్రంతో జోడించి, ఆ ఆకును కాల్చివేయాలని మనస్సులో సంకల్పించారు. ఎంతటి ఆశ్చర్యకర విషయం! కాల్చివేయాలనే సంకల్పము మనస్సులో రాగానే, అగ్గిపెట్టె చేతికి తీసుకోక మునుపే యంత్రంలో వ్రాత లిపిని చూపించే ముల్లు చాలా వేగంగా కదలటం గమనించారు, అనగా మొక్క తన మనసులోని ఆలోచనలను వెంటనే అర్థం చేసుకుందని గ్రహించారు. మరోమారు ఆకును కాల్చబోతున్నట్లు మనస్సులో నటించారు. అప్పుడు ప్రతిస్పందనలు తక్కువ వేగంగా కదలడం గమనించారు. దీని ద్వారా స్పష్టమౌతున్నదేమంటే వృక్షాలు మొక్కలు కూడా భావాలను అర్థం చేసుకోగలవు అని తెలుస్తున్నది.

ఇలా ఆశ్చర్యాన్ని కలిగించే ప్రయోగాల తర్వాత వారు దాదాపు 25 రకాల మొక్కలతో దేశంలోని విభిన్న ప్రదేశాలలో విభిన్న వ్యక్తులతో ‘లై డిటెక్టర్’ పరికరం ఆధారంగా ప్రయోగాలు చేసారు. అన్ని ప్రయోగాలలో ప్రారంభంలోని విధంగానే పరిణామాలు కనిపించాయి. దీని ద్వారా తెలుస్తున్నదేమిటంటే – మొక్కలు కూడా ఆలోచనలకు స్పందిస్తాయి. మొక్కలు తమను పోషించే వ్యక్తులతో కూడా విడిపోని సంబంధాన్ని పెంచుకుంటాయి. అలాంటి వ్యక్తి, మొక్క లేక వృక్షానికి సమీపంగా ఉండినా లేక చాలా

దూరంగా ఉన్నప్పటికీ అవి సమాన భావాలు కల్గిన మిత్రుల వలె స్పందిస్తాయి, తమ ఆలోచనల ఆధారంగా హృదయ భావనలను వారు మొక్కల వరకు చేరుస్తారు మొక్కలు ఆ భావనలకనుసారంగా తమలో ప్రతి క్రియలను వ్యక్తం చేస్తూ ఉంటాయి.

మనో భౌతిక విజ్ఞాన జనకుడయిన 'ఫెహనర్' తన ప్రయోగాలద్వారా మొక్కలలో కూడా వ్యక్తిత్వం ఉంటుంది అని నిరూపించారు. తమకు ఎంత ఆహారం అవసరమో మొక్కలకు తెలుసు, ఎంత అవసరమో అంత తమకు తామే పొందుతాయి. కేవలం వాటిలో తెలుసుకొనే, గ్రహించే విధానాలు వేరు వేరు.

'ఆల్బర్ట్ హర్జీలీ' అనే పరిశోధకుడు 'ది ఆరిజిన్ ఆఫ్ ఇనార్గానిక్ సబ్‌స్టెన్సస్ ' అనే పేరుతో ఒక పుస్తకాన్ని వ్రాసారు. అందులో– మొక్కలు కేవలం ఆహార ఘటకాలను తయారుచేయడమే కాకుండా అవి ఒక మాంత్రికుడిలా కూడా పనిచేస్తాయని వారు ఋజువు చేసారు. ఒక మూలద్రవ్యమును మరొక మూలద్రవ్యముగా పరివర్తన చేయగల శక్తి మొక్కలలో మాత్రమే ఉంది. అవసరమును బట్టి ఫాస్ఫరస్‌ను గంధకముగా, కాల్షియమ్‌ను ఫాస్ఫేట్‌గా, మెగ్నీషియమ్‌ను కాల్షియమ్‌గా, కార్బొనిక్ ఆమ్లాన్ని మెగ్నీషియంగా మరియు నైట్రోజన్‌ను పోటాషియంగా రూపాంతరము గావించుకుంటూ ఉంటాయి. మొక్కలు నియమిత ఉష్ణోగ్రతలలో అల్పశక్తిని మాత్రమే వినియోగించుకొని ఒక క్రొత్త రచనను గావించగలవు అనే విషయాన్ని కూడా హర్జీలీ స్పష్టం చేసారు.

'చార్లెస్ డార్విన్' అనే ఇంగ్లీషు శాస్త్రవేత్త , మొక్కలలో కల్పనాతీతమైన శక్తి ఉంటుంది, దీనితో మొక్కలకు వివేకము లేక బుద్ధి ప్రాప్తిస్తుంది, దీని ద్వారా మొక్కలు ప్రతిస్పందిస్తాయి అని తెలియచేసారు. వారు రచించిన 'ద పవర్ ఆఫ్ మూవ్‌మెంట్స్ ఇన్ ప్లాంట్స్' అనే పుస్తకంలో ఇలా వివరించారు– మొక్కల వేర్ల మూలాలలో ఏ జీవాణువులైతే ఉంటాయో, అవి మొక్కలలో మెదడు వలె పని చేస్తాయి అని అనడంలో అతిశయోక్తి ఉండదేమో. అవి మొక్కల కోసం సందేశాలను గ్రహించడంలో మరియు అలజడులను నియంత్రించడంలో సహాయడతాయని వివరించారు.

భారతీయ విజ్ఞాన శాస్త్రవేత్త అయిన డా॥ టి. సి. సింహ్, తమిళనాడులోని 'అన్నామలై విద్యాపీఠం' లో మురళి, వయోలిన్, వీణ, హార్మోనియం వంటి వాయిద్యాల ద్వారా మొక్కలపై అనేక ప్రయోగాలు చేసారు. అందులో మొక్కల పెరుగుదల పూలు, పండ్లు లేక విత్తనాలు మొ॥గు వాటి అభివృద్ధిలో సంగీతం అనుకూలమైన పరిణామాన్ని చూపిస్తాయని నిరూపించారు. సంగీతం ద్వారా మొక్కలలో ఆకుల సంఖ్య 72 శాతం, అలాగే మొక్క అభివృద్ధిలో 20 శాతం వృద్ధి కనిపించింది. మద్రాస్ పాండిచ్చేరిలలో ఏడు ప్రదేశాలలో సంగీతం ద్వారా ప్రయోగాలు చేసారు. అందులో ధాన్య ఉత్పాదనలో

25 నుండి 60 శాతం వృద్ధి కనిపించింది. అంతేగాక పూలతోటలలో భరతనాట్యం ద్వారా ప్రయోగాలు చేసారు వాటిలోనూ 'బంతి మరియు చేమంతుల' పూల తోటలలో 15 రోజుల ముందే పూలు పుష్పించాయి. బహుశా, నృత్యములోని లయ ద్వారా ఉత్పన్నమైన ప్రకంపనాలను (వైబ్రేషన్లను) ఆ పూల మొక్కలు భూమి నుండి గ్రహించియుంటాయి, దీని ప్రభావంగానే పెరుగుదలలో వృద్ధి కనిపించి ఉంటుంది అని వారు వ్యక్తపరిచారు.

డా॥ హేమాంగీ జాంభేకర్ తన ' నైసర్గిక శక్తుల వినియోగము' అనే లేఖ సంపుటిలో సౌరశక్తి, చంద్ర శక్తి మరియు విశ్వ శక్తుల ద్వారా భూమిని సజీవంగా అనగా సారవంతంగా చేయుట, కుళ్ళబెట్టే విధానాన్ని వేగవంతం చేయుట, క్షారముతో కూడిన భూమిని పరివర్తన చేయుట చాలా సహజమన్నారు. ఈ శక్తుల వల్ల భూమిలో ఉన్న ఉపయోగకరమైన సూక్ష్మ జీవులు మొక్కలపై వచ్చె చీడ పురుగుల జీవనచక్రములో ఎటువంటి మార్పులు రానివ్వకుండా చేయడమే కాక, పంట పొలాలు శక్తిని వినియోగించుటలో కూడా సహాయపడతాయి. ఈ శక్తులను ఉపయోగించటం ద్వారా రైజోబియమ్ వంటి సూక్ష్మ జీవులు చక్కని రీతిలో నత్రజనిని తయారు చేయగలవు. మిథనోజనిక్ సూక్ష్మజీవులు, కంపోస్ట్ చేయు ఇతర సూక్ష్మజీవులు అధిక కార్య క్షమతతో తమ కార్యాన్ని చేయగలవు. వీటి ద్వారా కుళ్ళే ప్రక్రియ వేగంగా జరుగుట, చెఱకులో చక్కెర ప్రమాణము అధికమగుట, చీడలు లేదా రోగ నియంత్రణ, తక్కువ మందుల ద్వారానే సాధ్యమగుట వంటివి చాలా సహజము. దీని ద్వారా పంట దిగుబడిలోనూ శ్రేష్టమైన ధాన్య ఉత్పాదనలోనూ గొప్ప మార్పులు కనిపిస్తాయి.

అమెరికాకు చెందిన విశ్వ ప్రసిద్ధ కృషి వైజ్ఞానికుడైన 'జార్జ్ వాషింగ్‌టన్ కావ్వర్' తాను వ్యవసాయ సంబంధముగా చేసిన విభిన్న ప్రయోగాలను చూసి చాలా మంది వారిని ఇలా ప్రశ్నించడం జరిగింది – మీలాగే ఇలాంటి ప్రయోగాలను మరెవ్వరైనా చేయవచ్చా? అప్పుడు వారు దానికి సమాధానంగా తన చేతిని బల్లపై నున్న బైబిల్‌పై ఉంచి, ఈ రహస్యాలన్నీ ఇందులోనే దాగివున్నాయి, భగవంతుడిపై వున్న విశ్వాసములోనే వున్నాయి, ఈ విశ్వాసమే సత్యమైనది, ఇందులో ఊహించని శక్తి దాగివుంది. ఎవరికైతే భగవంతుడిపై విశ్వాసము ఉంటుందో వారందరూ కూడా నాలాగే ప్రయోగాలను, అనుభూతులను చేయవచ్చు. ఇందులో కేవలం ప్రకృతి మరియు వృక్షజాతితో ప్రేమ, స్నేహయుక్తమైన సంబంధాన్ని జోడించవలసిన అవసరం ఎంతో ఉంది అని చెప్పారు.

మొక్కల మాంత్రికుడిగా పిలువబడే 'ల్యూథర్ బర్‌బక్' తన ప్రయోగాలలో 'కాక్టస్' మొక్కతో – నీవు నీపై ఉన్న ముళ్ళను తొలగించుకో అని నివేదించాడు. అతని ప్రీతికి ఫలస్వరూపంగా కాక్టస్ మొక్క తన సంరక్షణకోసం తనపైనున్న ముళ్ళను తొలగించుకునేందుకు సిద్ధమయ్యింది. అతని వద్ద చెట్లు,

పొదలు, మొక్కలతో మాట్లాడే శక్తి ఉండేది. మొక్కలపై ఎనలేని స్నేహం, ప్రీతి ఉండేది. ఏప్రిల్ 18, 1906 సం॥లో వచ్చిన భూకంపములో సాన్‌ప్రాన్సిస్కో ధ్వంసమైనది. అందులో బర్‌బక్ ఇల్లు భూకంప కేంద్రానికి దగ్గరగా ఉంది. అయినా తన ఇంటి కిటికీలలోని ఒక్క అద్దము కూడా పగలలేదు. ఇందుకు కారణము- తాను నైసర్గిక వనరులతో స్నేహ సంబంధాన్ని కల్గివుండడమే కావచ్చు అని బర్‌బక్ తెలియచేసారు.

ఈ ప్రయోగాలన్నింటిని వింటూ ఉంటే మనం కూడా ప్రకృతితో స్నేహ సంబంధాన్ని పెట్టుకోవడం చాలా అవసరం అని మనసుకు తడుతుంది. ఈ వైజ్ఞానిక యుగంలో మన జీవితాలు కృత్రిమముగా తయారవుతున్నాయి. కావున, మనం తిరిగి ప్రకృతితో స్నేహ సంబంధాన్ని జోడించి మసలుకోవడం ఎంతో అవసరము. నేడు ప్రతి రైతు వ్యవసాయాన్ని ఒక వృత్తిగా భావిస్తూ చేస్తున్నాడు. పొలాన్ని కేవలం పంట ఉత్పాదక సాధనంగా భావిస్తున్నాడు. ఫలితంగా ప్రజలందరికి సాగుభూమిపై మరియు పంట పైర్లపై ఏదైతే స్నేహం, ప్రీతి, నాది అను భావన ఉండాలో అవన్నీ లోపించాయి. భూమిని 'తల్లిగా' భావించి, పోషించినట్లైతే భూమాత కూడా మనకు చాలా పంచేందుకు సిద్ధంగా ఉంటుంది. ఒకవేళ మన పై మనము ప్రేమ, భూమాత పై ప్రీతి భగవంతుని పై విశ్వాసము ఉంచుకున్నట్లయితే ఈ 'శాశ్వత యోగిక వ్యవసాయ' విధానం ద్వారా నిజమైన ' అన్న దాతలు 'గా అయి మళ్ళీ ఈ భారత భూమిని సుజలాం, సుఫలాంగా మార్చి మన ఈ భారత దేశాన్ని తిరిగి 'వ్యవసాయ ప్రధాన దేశంగా' తయారుచేయగలము.

## యోగ ప్రయోగ విధానాలు మరియు వాటి పరిణామాలు

ప్రాచీన కాలంలోని ఋషులు, మునులు తపస్సును గురించి మనము వింటూనే వస్తున్నాము. వారు గుహలలో కూర్చొని తపస్సు చేస్తున్నప్పుడు వారి తపోబల ప్రభావం చాలా దూరదూరాలవరకు వ్యాపించేది. హింసాత్మక ఆలోచనలు గల వ్యక్తి ఆ తపస్వీ ఆశ్రమములోకి అకస్మాత్తుగా ప్రవేశిస్తే అతనిలో దాగియున్న హింసాత్మక ఆలోచనలు మారిపోయేవి. అలాగే అనేక చోట్ల ఆశ్రమాలలో అడుగు పెట్టగానే మనుష్యులు తమ దుఃఖాన్ని చింతలను మరచిపోయేవారు. తపస్వీ మునుల సమీపంగా హింసా ప్రవృత్తి గల్గిన క్రూరమృగాలు కూడా శాంతిగా కూర్చొన్నట్లుగా వినడమేకాక అనేక చిత్రాలలో చూస్తూ వస్తున్నాము. – దాని భావార్థమేమంటే తపస్సులో అనగా యోగసాధనలో ఒక మహాద్భుతమైన శక్తి దాగిఉంది. ఆ శక్తితో అసంభవ కార్యము కూడా సంభవమవుతుంది.

ఇప్పుడు భగవంతుడు మనకు అతి సహజమైన యోగాన్ని నేర్పించారు. ఇందులో మంత్రోచ్ఛారణ, ప్రాణాయామాలు లేక ఆసనాలవంటి విషయాలు లేవు. అందుకే దీనిని 'సహజ రాజయోగం' అంటారు. యోగమునకు సహజమైన అర్థం–స్మృతి(తలంపు). ఇందులో కండ్లు మూసుకోవలసిన అవసరం లేదు. ఈ రాజయోగం కర్మయోగులగా అయ్యే ప్రేరణనిస్తుంది. ఈ అభ్యాసం కోసం స్వయం యొక్క జ్ఞానము, పరమాత్ముడి జ్ఞానం తెలుసుకోవడం చాలా అవసరం. నేను ఎవరిని? ఎవరితో యోగము పెట్టుకోవాలి? రాజయోగపు యదార్థ విధానంలో స్వయాన్ని జ్యోతిర్బిందు ఆత్మగా నిశ్చయం చేసుకుని, దివ్య జోతిర్బిందు స్వరూపుడైన పరమాత్మునితో స్నేహముతో, ప్రేమతో సర్వ సంబంధాలను జోడించడంతో ఆత్మ అధికారిగా అయి, పరమాత్మ నుండి సర్వ ప్రాప్తుల అనుభూతి కలుగుతుంది. ఆత్మ పరమాత్మునితో సంబంధాన్ని జోడించుటకై శ్రేష్ఠ ఆలోచనలు అవసరం. ఏవిధంగా బ్యాటరీ పవర్ హౌస్‌తో సంబంధాన్ని పెట్టుకోవడం ద్వారా బ్యాటరీలో తిరిగి శక్తి నిండుతుందో అలాగే సర్వ శక్తివంతుడైన, సర్వ గుణాలకు, శక్తులకు ఆధారమైన పరమాత్మతో ఆత్మగౌరవముతో కూడిన సంబంధమును జోడించడం ద్వారా ఆత్మలో అనేక గుణాలు, శక్తులు తరంగాల రూపంలో ప్రవహిస్తూ ఉంటాయి.

రాజయోగంలోని మొదటి మెట్టు – ఆత్మ స్థితిని అనుభూతి చెందడం. నడుస్తూ, తిరుగుతూ, లేస్తూ, కూర్చుంటూ, ప్రతి కర్మ చేస్తూ కూడా స్వయాన్ని నిత్యమైన, నిజమైన స్వరూపముగా అనుభూతి చేయాలి. ఈ అభ్యాసం చాలా కాలంగా సహజంగా పరిపక్వంగా ఉండాలి.

ఆత్మలోని మూడు ముఖ్యమైన శక్తులు – మనస్సు, బుద్ధి మరియు సంస్కారము.

ఆలోచించే శక్తిని **మనస్సు** అని,

నిర్ణయించే వివేక శక్తిని **బుద్ధి** అని,

చేసిన కర్మల ప్రభావం స్మృతులపై పడుతుంది, వీటిని **సంస్కారము** అని అంటారు. మన ఆలోచనలు ఎలా ఉంటాయో అలాగే మన చిత్తము తయారవుతుంది. దీని ద్వారానే మన మనో వృత్తి తయారవుతుంది, దానికనుసారంగానే మన ' దృష్టి కోణము ' ఏర్పడుతుంది. ఎటువంటి దృష్టికోణమో అలాంటి వ్యవహారము ఏర్పడుతుంది. మన వ్యవహారము ద్వారానే మంచి, చెడు సంస్కారాలు తయారవుతాయి.

వాస్తవానికి ఆత్మ జ్ఞాన స్వరూపం, పవిత్ర స్వరూపం, శాంతి స్వరూపం, ప్రేమ స్వరూపం, సుఖ స్వరూపం, ఆనంద స్వరూపం, శక్తి స్వరూపం మరియు దివ్య గుణ స్వరూపం అలాగే పరమాత్మ ఈ అన్ని గుణాలకు శక్తులకు ఆధారం సాగర సామానులు. ఎప్పుడైతే మనం స్వయాన్ని ఆత్మగా భావించి, పరమాత్మను తలుస్తామో అప్పుడు పరమాత్మలోనున్న అన్ని గుణాలు శక్తుల ప్రవాహం ఆత్మలో కూడా ప్రవహిస్తుంది ఆత్మ సంపన్నత అనుభూతి కలుగుతుంది. ఈ స్థితిలో ఏకాగ్రమయ్యే అభ్యాసాన్ని పెంచుకుంటూ ఉండాలి. మొదట ఒక నిమిషం, తర్వాత రెండు... మూడు...... అలా 5 నుంచి 10 ని॥లు వరకు ఏకాగ్రం చేసినట్లైయితే పరమాత్ముని గుణాలు, శక్తుల ప్రకంపనాలు ఆత్మనుండి వెలువడి, శరీరం ద్వారా బాహ్య వాతావరణంలోకి వ్యాపిస్తాయి ప్రకృతితో పాటు మిగతా అందరికి ఆ ప్రకంపనాల అనుభూతి కలుగుతుంది.

రాజయోగ అభ్యాసంతో ఆత్మ స్మృతిలో స్థిరం చేసుకుని పరమపిత పరమాత్ముని ధ్యానము చేసినట్లైయితే మన చిత్తం, మనస్సు పరిశుద్ధమవుతాయి. దీని వల్ల మనలోని ఈర్ష్య, ద్వేషం, అసూయ, పగ మొ॥గు చెడు ఆలోచనలన్నీ నశించిపోతాయి. మనలో ఎటువంటి భావనలు ఉంటాయో అటువంటి చిత్తము (మనసు) నిర్మించబడును.

వర్తమాన సమయంలో స్వయాన్ని దేహంగా భావిస్తూ చేసే చెడు సంకల్పాల ప్రభావం ప్రకృతి సహితంగా సమస్త జీవరాశులపై అనగా పశు పక్షాదులపై, వృక్షాలు, వనస్పతులపై చూపుతుంది. కాని, రాజయోగ అభ్యాసంతో ఆత్మిక స్వరూపంలో ఉంటూ చేసే శ్రేష్ఠ సంకల్పాలు, ప్రకృతిపైననే కాక సమస్త జీవరాశులపై మంచి ప్రభావాన్ని చూపిస్తాయి. ఎందుకంటే ఆత్మిక స్థితిలోనే వికారాలు లేని ఆలోచనలు ఉత్పన్నమవుతాయి.

రాజయోగంలో పరమాత్మ శక్తులను అనుభూతి చేసుకుంటాము. అటువంటి సమయంలో ఆత్మ నుండి వెలువడే ప్రకంపనాలు వాయుమండలాన్ని కూడా మార్చేస్తాయి. ఇలాంటి ఏకాగ్ర స్థితిలో స్థితులై, ఎంతో దూరంలో ఉన్న వ్యక్తులు, వస్తువులు లేక వనస్పతుల గురించి చేసే శ్రేష్ఠ సంకల్పాలు

అతి దూరంలో ఉన్న వ్యక్తి లేక వస్తువు వనస్పతుల జీన్స్ లేక వారి ఆంతరిక శక్తిని శ్రేష్ఠ ప్రకంపనాలు ప్రభావితం చేయడమే కాక క్రియాశీలకంగా కూడా చేస్తాయి. ఇదే ప్రయోగాన్ని మనం భూమిని, పంట పొలాలను ఆరోగ్యవంతముగా మరియు శక్తిశాలిగా చేసేందుకు ప్రయోగించాలి.

రాజయోగ ప్రయోగమును పంట పొలాలపై ప్రయోగించేందుకు- ముందు, మనం ప్రకృతి అనగా భూమి, నీరు, వాయువు, అగ్ని, ఆకాశములకేగాక గ్రహాలు, నక్షత్రాలకు పరమాత్మ శక్తుల ప్రకంపనాలను వ్యాపింపచేయడం చాలా అవసరం. ఎందుకంటే వీటి సహకారంతోనే మొక్కలలో పెరుగుదల జరుగుతుంది, ధాన్యము- కాయలు, పండ్లు ఉత్పన్నమవుతాయి. తరువాత ఏ భూమిలో పంటలు పండించాలో ఆ భూమికి కూడా పరమాత్మ శక్తుల ప్రకంపనాలను పంచుతూ సారవంతంగా, నిరోగిగా, శక్తిశాలిగా చేయాలి. తరువాత విత్తనాల నుండి ఆరోగ్యవంతమైన శక్తిశాలి మొక్కలు అంకురించేటట్లు చేయడానికి పరమాత్మ శక్తుల ద్వారా విత్తనాలలోని ఆంతరిక శక్తిని ప్రేరేపితం చేయాలి. విత్తనాలు నాటిన తర్వాత విత్తనాలు మొలకెత్తే సమయంలో, మొక్కల పెరుగుదల సమయంలో, ధాన్యము తయారయ్యే సమయం నుండి కోతల వరకు ప్రతి రోజు యోగ ప్రయోగం ద్వారా పరమాత్మ శక్తుల ప్రకంపనాలను భూమికి, విత్తనాలకి, మొక్కలకి మరియు ధాన్యానికి ఇవ్వడం చాలా చాలా అవసరం. కీటకాలు, రోగాలు రాకుండా పక్షులు, జంతువుల నుండి కాపాడడానికి పరమాత్మ శక్తుల ప్రకంపనాలను పొలం నలువైపులా వ్యాపింపచేస్తూ కవచం రూపంలో ఒక శక్తిశాలీ వాయుమండలాన్ని నిర్మించాలి.

ఈ ప్రయోగాన్ని ప్రతి రోజు ఒకే సమయంలో ఒకే స్థానములో కూర్చొని ఒకే విధంగా చేయాలి. దీనికోసం పొలంలో కూర్చోండి లేక ఎక్కడైనా అనగా పొలానికి ఎంత దూరంగానైనా సరే ఇంట్లో కూర్చొని కూడా చేయవచ్చు. కాని నియమంలో విధానములో మాత్రం మార్పు ఉండరాదు. మొదట పంచ తత్వాలకు, గ్రహాలకు , నక్షత్రాలకు పరమాత్మ శక్తుల కిరణాలను ప్రసరింపచేస్తూ తర్వాత సాగుబడి చేసే భూమిపై పంటపై పరమాత్మ శక్తులను యోగ ప్రయోగం ద్వారా ప్రసరింపచేయాలి.

రోజంతటిలో ఎప్పుడు సమయం లభించినా కనీసం 5 ని॥లు పంట పొలాలలో లేక ఎక్కడైనా కూర్చొని ఏకాగ్రతతో యోగానుభూతిని చేయండి సాగుభూమిపై, అలాగే పంటలపై కూడా దృష్టిని సారించండి. ఇలాంటి యోగయుక్త స్థితితో, స్నేహంతో, ప్రేమతో పంటలపై దృష్టిని సారించండి. మీ శుభ భావనలను వాటితో ఇచ్చిపుచ్చుకోండి, మనము ఆత్మీయులుగా అనిపించే విధంగా వాటితో మాట్లాడండి. సాగుభూమితో మాతృ సంబంధాన్ని జోడించి సత్‌సంకల్పాలతో మాట్లాడండి. పంటలను తమ పిల్లలుగా భావిస్తూ ప్రేమతో పాలన చేయండి.

వ్యవసాయ క్షేత్రంలో ఏ పని చేస్తున్నా, అది సాగుభూమిలో ఎరువులు వేసే సమయం కావచ్చు, లేక పంటకు నీరు పెట్టే సమయం కావచ్చు, లేక కలుపు తీసే సమయం కావచ్చు, లేదా టానిక్స్ లేక కీటకనాశకాలను చల్లే సమయం కావచ్చు, ఆయాసమయాలలో మీరు మీ ఆత్మిక స్వరూపంలో ఉంటూ తండ్రి అయిన పరమాత్మ స్మృతి లో పని చేసినట్లైయితే ఆ ఎరువులు, టానిక్స్ మరియు కీటకనాశకాలు బాగుగా పని చేస్తాయి. చాలా సుందరమైన, అద్భుతమైన పరిణామాలు కనిపిస్తాయి.

యోగ ప్రయోగంలో మీ సూక్ష్మ శరీరం(ఫరిశ్తా స్వరూపం) ద్వారా మీరు ప్రయోగించే పంట పొలాలను సూక్ష్మవతనంలో పరమాత్ముని సమక్షములోకి తీసుకు వెళ్ళి పరమాత్ముని ద్వారా సకాష్ అనగా శక్తిశాలి ప్రకంపనాలను ఇస్తూ భూమిని పంటలను ఇంకా శక్తిశాలిగా చేయండి. (సూక్ష్మవతనం – ఇక్కడ ఆత్మ సంపూర్ణ స్వరూపంలో పంచ తత్వాల జగత్తుకు దూరంగా సూక్ష్మ లోకంలో ఆత్మ సంపూర్ణ స్వరూపంలో ఉంటుంది. దీనినే ప్రకాశమయ ప్రపంచమని అవ్యక్త వతనం లేక సూక్ష్మ వతనమని పిలుస్తారు).

మీ శక్తిశాలి శుభ సంకల్పాల మాధ్యమము ద్వారా మీరు ప్రయోగించబోయే సాగుభూమిలోని పంటలను, పరంధామం యొక్క పవిత్ర శక్తుల ప్రకంపనాలతో శక్తిశాలిగా రోగరహితంగా తయారు చేయండి. (పరంధామం – ఆత్మలు, పరమాత్మ నివసించే మూల స్థానము. అది ఈ పంచ తత్వాలకు చాలా దూరంగా బంగారు ఎరుపు రంగులో ఉండే ప్రకాశమయ తత్వము. దీనినే బ్రహ్మాండము లేక బ్రహ్మ మహాతత్వము అని కూడా అంటారు). ఒక్కొక్కసారి పరమాత్మను క్రిందకు ఆహ్వానించండి. భూమికి పంటకి పరమాత్మ ఎంతో స్నేహ దృష్టితో చూస్తున్నారని తమ శక్తుల ద్వారా శక్తిశాలిగా మరియు రోగాల రహితంగా చేస్తున్నారని ఈ విధంగా అభ్యాసం చేస్తూ అనుభూతి చేయండి.

ఒక్కొక్కసారి – మీరు ప్రయోగం చేసే సాగుభూమి విశ్వగోళముపై, పరంధామానికి క్రింద ఉన్నట్లుగా, పరంధామము నుండి శాంతి, శక్తి కిరణాలు భూమిపై పంటలపై ప్రసరిస్తున్నట్లుగా, పవిత్రమైన, శాంతి శక్తుల కిరణాల వాతావరణంలో పంట పొలాల అభివృద్ధి సాగుతున్నట్లుగా కూడా అభ్యాసము చేయండి.

ఇంట్లో కూర్చొని కూడా మీ సూక్ష్మ ఫరిశ్తా(దివ్య ఆకారీ శరీర) స్వరూపం ద్వారా పంట పొలాలలోకి చేరుకుని, ఎంతో స్నేహంతో, ప్రేమతో శక్తిశాలి శ్రేష్ఠ సంకల్పాల కిరణాలను ఇవ్వాలి. ఇతర విశేష ఆత్మలను ఆహ్వానించి వారి ద్వారా సాగుభూమికి, పంటలకు కూడా శక్తిని ఇప్పించవచ్చు.

ఏ రకమైన బూజులు, రోగాలు లేక చీడ పురుగుల ప్రభావం పంటలపై కనిపించినట్లయితే, వెంటనే మీరు పవిత్ర స్వరూపంలో స్థితులై, పవిత్రతా సాగరుడైన పరమాత్ముని పవిత్ర కిరణాలను

పంటలపై ప్రసరింప చేయండి, శక్తుల కిరణాలు ఇవ్వండి.

సమయానుకూలంగా 15 రోజులకు ఒకసారి లేక నెలలో ఒకసారైనా సామూహిక రూపంలో పంట పొలాలలో యోగం చేయడం ద్వారా వాయుమండలాన్ని పరిశుద్ధంగా, శక్తిశాలిగా చేయడంలో సహాయము లభిస్తుంది.

ఈ విధంగా ఆత్మకు చెందిన మూల గుణాలపై ఆధారితమైన రాజయోగ అభ్యాసాన్ని చేయాలి. ఆత్మలైన మనలోని సప్త గుణాల ప్రకంపనాలు సాగుభూమికి పంటలకు ఏ విధమైన లాభం చేకూర్చునో మీరే గమనించండి.

**1. జ్ఞాన స్వరూపం :–** ఆత్మలైన మనం ఎప్పుడైతే జ్ఞానస్వరూపంలో స్థిరమై జ్ఞాన సూర్యుడైన పరమాత్మ స్మృతిలో ఏకాగ్రచిత్తులమై, పంటలకు శుభ భావనలతో కూడిన మన నివేదనలను అందిస్తామో వాటి అనుసారంగా పంటలు తమ ప్రతిక్రియలను వ్యక్తం చేస్తాయి. ఆత్మ నుండి వెలువడే ప్రకంపనాలు పంటల వరకు ఎప్పుడు చేరునో అప్పుడు మొక్కలలోని ఆంతరిక జైవిక క్రియలు చైతన్యవంతం కావడం ప్రారంభమవుతాయి. భూమి నుండి పోషక తత్వాలను ( ఆహార ఘటకాలను) వేర్ల ద్వారా ఆకుల వరకు చేరడం, ఆహారపదార్థాలు తయారవడం, తయారయిన ఆహార పదార్థాలు తమ తమ స్థానాలకు చేరవేయడంలో ఎలాంటి కష్టమూ రాదు. ఈ అభ్యాసం ద్వారా మొక్కలలో ఆహార పదార్థాల అభివృద్ధిలో చాలా మేలు కలుగుతుంది.

**ఒక ప్రయోగము –** ఒక పాత్రలో నీళ్ళు తీసుకుని అందులో మీ చేతి వ్రేళ్ళను పెట్టి – నేను జ్ఞాన స్వరూప ఆత్మను...... జ్ఞాన సూర్యుని కిరణాలు నా నుండి వ్రేళ్ళ ద్వారా నీటిలో ప్రవేశిస్తున్నాయి, అని అనుకుంటూ అభ్యాసము చేయండి. 10 నిమిషాల వరకు ఈ సంకల్పముపైననే ఏకాగ్రమవ్వండి. ఆ నీరును భూమి పై మరియు పంటలపై చల్లినట్లైతే మన శ్రేష్ఠసంకల్పాల ప్రతిఫలము చాలా బాగా కనిపిస్తుంది. ( నీటిలో వ్రేలు ఉన్నప్పుడు ఎప్పుడూ కొద్దిగా కూడా సంశయము, వ్యర్థ సంకల్పాలు కలగకుండా శ్రద్ధ వహించాలి.)

**2. పవిత్ర స్వరూపము :–** ఆత్మలమైన మనము ఎప్పుడైతే పవిత్ర స్వరూపములో స్థిరమై పవిత్రతా సాగరుడైన పరమాత్మ స్మృతిలో ఏకాగ్రచిత్తులుగా అవుతామో, అప్పుడు మన ద్వారా వెలువడే పవిత్ర ప్రకంపనాలు వాతావరణాన్ని స్వచ్ఛంగా చేస్తాయి. భూమిలో లేక పంటలలో కాలుష్యము ద్వారా వ్యాపించే రోగాలు లేక కీటకాలు (బూజు, వైరస్ సంబంధిత రోగాలు) నశిస్తాయి మరియు సాగుభూమి, పంట పైర్లు రోగ రహితంగా అవడంలో సహాయం లభిస్తుంది. యోగము ద్వారా వెలువడే పవిత్ర ప్రకంపనాలు

భూమి మరియు పంట పైర్లలో రోగ నిరోధక శక్తిని పెంచుతాయి.

మనము పవిత్ర స్వరూపంలో స్థిరమై నీటిలో వ్రేళ్ళు పెట్టి – పవిత్రతా సాగరుడి స్మృతిలో ఏకాగ్రతతో 10 నిమిషాలు అనుభూతి చేసినట్లైయితే ఆ పవిత్ర కిరణాలు ఆత్మలైన మన నుండి వెలువడి చేతి వ్రేళ్ళ ద్వారా నీటిలోకి చేరును. ఈ నీరు సాగుభూమి పై, పంటలపై చల్లినట్లయితే రోగాలు లేక చీడల నియంత్రణలో చాలా ఉపయోగకరంగా ఉంటుంది.

**3. శాంతి స్వరూపము :–** ఆత్మలమైన మనం ఎప్పుడైతే శాంతి స్వరూపములో స్థిరమై శాంతి సాగరుడైన పరమాత్మ స్మృతిలో ఏకాగ్రచిత్తులుగా అవుతామో, అప్పుడు మన ద్వారా వెలువడే శాంతి ప్రకంపనాలను భూమి లేక పంటలలోకి వ్యాపించడం ద్వారా కాలుష్యము ద్వారా మొక్కలలో వచ్చే అలజడులు, ఈ శాంతి ప్రకంపనాల ద్వారా దూరమవుతాయి. మొక్కల శ్వాసక్రియ, కిరణజన్య సంయోగ క్రియలు కూడా మంచిగా జరుగుతాయి. హరిత ద్రవ్యాల ప్రమాణము పెరుగుతుంది మరియు మొక్కలలోని ఆంతరిక క్రియలు (శక్తికి సంబంధించిన) కార్యములు యదార్థ రూపంలో జరుగుతాయి.

ఒక పాత్రలో నీళ్ళు తీసుకుని అందులో మీ చేతి వ్రేళ్ళను పెట్టి – స్వయాన్ని శాంత స్వరూపములో అనుభూతి చేసుకుంటూ శాంతి సాగరుడైన పరమాత్మ స్మృతిలో 10 నిమిషాల వరకు ఏకాగ్రచిత్తులుగా కండి. మధురమైన శాంతిని అనుభూతి చేయండి, ఆ నీటిని భూమిలో మరియు పంటలపై చల్లినట్లైతే శాంతి స్వరూపులుగా అవ్వటం వల్ల కలిగే ప్రత్యక్ష పరిణామమును మీరే గుర్తించండి.

**4. ప్రేమ స్వరూపము :–** ఆత్మలమైన మనం ఎప్పుడైతే ప్రేమ స్వరూపములో స్థిరమై ప్రేమ సాగరుడైన పరమాత్మ స్మృతిలో నిమగ్నమై ఉంటామో అప్పుడు మన ద్వారా వెలువడే ప్రేమ ప్రకంపనాలు భూమి మరియు పంటల వరకు చేరుతాయి మరియు మన శద్ధమైన, శ్రేష్ఠ భావనలు చాలా సహజంగా తొందరగా వాటికి లభిస్తాయి. మొక్కలలో జరిగే క్రియలు పోషక తత్వాలను గ్రహించుట, పూలు పండ్ల అభివృద్ధి, కిరణజన్య సంయోగ క్రియ, శ్వాసక్రియ మొ॥వి ప్రేమ ప్రకంపనాల కారణంగా చాలా సహజంగా జరుగుతాయి. భూమిలో మొక్కల పెరుగుదలకు కావలసిన పోషక తత్వాల నిర్మాణానికి సహాయపడుతాయి.

ఒక పాత్రలో నీళ్ళు తీసుకుని అందులో మీ చేతి వ్రేళ్ళను పెట్టి – ప్రేమ స్వరూపంలో స్థిరమై ప్రేమ సాగరుడైన పరమాత్మ స్మృతిలో లీనమై అభ్యాసం చేయండి. ఆత్మనయిన నా నుండి ప్రేమ కిరణాలు వెలువడి చేతి వ్రేళ్ళ ద్వారా నీటిలోకి ప్రవేశిస్తున్నాయి అని అభ్యాసం చేయండి. ఈ నీటిని భూమి పై , పంటలపై చల్లినట్లైతే ప్రేమ స్వరూపం ద్వారా జరిగే ప్రత్యక్ష పరిణామాలు మీకు కనిపిస్తాయి.

**5. సుఖ స్వరూపము :–** ఆత్మలమైన మనము ఎప్పుడైతే సుఖ స్వరూపంలో స్థిరమై సుఖ సాగరుడైన పరమాత్మని స్మృతిలో ఏకాగ్రమవుతామో అప్పుడు ఆత్మ నుండి వెలువడే అతీంద్రియ సుఖ ప్రకంపనాలు(వైబ్రేషన్స్) సాగుభూమికి, పంట పొలాలకి చేరడం ద్వారా ఉపయోగకర సూక్ష్మ జీవుల సంఖ్య వృద్ధి అవడమేకాక వాటి కార్యక్షమత కూడా పెరుగుతుంది. దీని ద్వారా మొక్కల కాండము, శాఖల వృద్ధి జరుగుతుంది. ఆహార పదార్థాల ఆకారము కూడా పెరుగుతుంది, పౌష్టికత కూడా పెరుగుతుంది.

ఒక పాత్రలో నీటిని తీసుకుని, అందులో చేతి వ్రేళ్ళను పెట్టి – సుఖ స్వరూపంలో స్థిరమై సుఖ సాగరుడి స్మృతిలో 10 నిమిషాలు ఏకాగ్రచిత్తులై, అనుభూతి చేయండి – ఆత్మనైన నా నుండి వెలువడే సుఖ కిరణాలు వ్రేళ్ళ ద్వారా నీటిలో ప్రవేశిస్తున్నాయి అని అభ్యాసం చేయండి. ఈ నీటిని సాగుభూమి పై లేక పంటలపై చల్లినచో సుఖ స్వరూపంలో స్థిరం కావడంలోని ఉపయోగాన్ని మీరు ప్రత్యక్షంగా చూడగలరు.

**6. ఆనంద స్వరూపము :–** ఆత్మలమైన మనం ఎప్పుడైతే ఆత్మాభిమానిగా అయి, ఆనంద స్వరూపంలో స్థిరమై ఆనంద సాగరుడైన పరమాత్మ స్మృతిలో ఏకాగ్రులమవుతామో అప్పుడు ఆత్మ నుండి వెలువడే ఆనంద ప్రకంపనాలు భూమికి, పంటలకు చేరి ఉపయోగకారి అయిన సూక్ష్మ జీవుల కార్యక్షమతను పెంచుతుంది. మొక్కలలో పూలు, పండ్లు మంచిగా కాస్తాయి, పంటలు త్వరగా అభివృద్ధి చెందుతాయి, పండ్లు, ధాన్యము ప్రకాశవంతముగా అవుతాయి, పునరుత్పాదనకు శక్తి లభిస్తుంది.

నీటిలో వ్రేళ్ళు పెట్టి ఆనంద స్వరూపములో స్థిరమై, ఆనంద సాగరుడైన పరమాత్మని స్మృతిలో 10 నిమిషాల వరకు ఏకాగ్రచిత్తులుగా కండి. అప్పుడు ఆత్మనైన నా నుండి వెలువడే ఆనంద ప్రకంపనాలు (వైబ్రేషన్స్) చేతి వ్రేళ్ళ ద్వారా నీటిలో ప్రవేశిస్తున్నాయి అని అభ్యాసం చేయండి. ఈ నీటిని సాగుభూమి పై లేక పంట పొలాల పై చల్లినట్లైయితే, ఆనంద స్వరూపంలో స్థితులు కావడం వల్ల కలిగే ప్రత్యక్ష ఫలితాన్ని మీరు గుర్తించగలరు.

**7. శక్తి స్వరూపము :–** ఆత్మలమైన మనం ఎప్పుడైతే శక్తి స్వరూపంలో స్థిరమై సర్వశక్తివంతుడైన పరమాత్మని స్మృతిలో ఏకాగ్రచిత్తులుగా అవుతామో అప్పుడు ఆత్మ నుండి వెలువడే శక్తుల ప్రకంపనాలు సాగుభూమికి, పంటలలోకి ప్రవేశించడం ద్వారా భూమి శక్తిశాలిగా అవుతుంది. సాగుభూమిలో పంటలకు యోగ్యమైన సూక్ష్మ జీవుల సంఖ్యలో వృద్ధి కనిపిస్తుంది, మొక్కలు దృఢంగా మరియు శక్తిశాలిగా పెరుగుతాయి, ఎలాంటి రోగాలనైనా కీటకాలనైనా సహజంగా మొక్కలు ఎదుర్కోగలవు. వాటి ద్వారా

మొక్కలకు ఎలాంటి నష్టము వాటిల్లదు. మన శక్తిశాలి ప్రకంపనాలు అధిక ధాన్య దిగుబడిలో చాలా సహాయపడతాయి.

ఒక పాత్రలో నీటిని తీసుకుని అందులో చేతివ్రేళ్ళను పెట్టి – స్వయం శక్తి స్వరూపంలో స్థిరమై శక్తివంతుడైన పరమాత్ముని తలంపులో ఏకాగ్రమై, ఆత్మనయిన నా ద్వారా వెలువడే శక్తుల ప్రకంపనాలు చేతివ్రేళ్ళ ద్వారా నీటిలో ప్రవేశిస్తున్నాయి అని అభ్యాసము చేయండి. ఈ నీటిని సాగుభూమిలో లేక పంట పొలాలలో చల్లినట్లైతే, శక్తి స్వరూపానికి ప్రత్యక్ష ప్రమాణము కనిపిస్తుంది.

**8. దివ్య గుణాలు :-** గుణ మూర్తులుగా అయి, దివ్య గుణాల స్వరూపుడైన పరమాత్ముని స్మృతిలో ఏకాగ్రమైనచో సాగుభూమికి పంటలకు వైబ్రేషన్స్ ఇవ్వడం ద్వారా ధాన్యము లో సాత్వికత వస్తుంది, ఇలాంటి ధాన్యమును ఆహారంగా తీసుకుంటే మనుష్యుల మనస్సుపై శ్రేష్ఠ ప్రభావము చూపిస్తుంది. అందుకే హిందీలో – " జైసా అన్న్ వైసా మన్, జైసా మన్ వైసా తన్ " అని ఒక సామెత కూడా ఉంది! అనగా ఎటువంటి ఆహారమో అటువంటి మనస్సు, ఎటువంటి మనస్సో అటువంటి శరీరం అని అర్థం.

## విత్తన శుద్ధికి యోగ ప్రయోగము

ఒక పాత్రలో విత్తనాలను తీసుకుని, పాత్రను మీకెదురుగా పెట్టుకోండి. ఆత్మ స్థితిలో స్థిరమై పరమాత్ముని స్మృతిలో ఏకాగ్రులు కండి. ఈ స్థితిలోనే ఉంటూ అభ్యాసం చేయండి. పరమాత్మ నుండి వెలువడే బంగారు ఎరుపు వర్ణ కిరణాలు, ఆత్మనైన నా దృష్టి ద్వారా విత్తనాలపై పడుతున్నాయి, ఒక్కొక్క విత్తనం తండ్రి అయిన పరమాత్మ సమానంగా ప్రకాశిస్తూ ఉన్నాయి, ఈ విత్తనాల ద్వారా మొలకెత్తే ప్రతి మొక్క రోగ రహితంగా, శక్తిశాలిగా పెరుగుతాయి అనే శ్రేష్ఠ సంకల్పాలను చేయండి.

విత్తనాలను సూక్ష్మవతనంలో బాప్‌దాదాల సమక్షంలో ఉంచి, బాప్‌దాదా ద్వారా విత్తనాలకు శక్తిశాలీ కిరణాలను ఇవ్వండి. విత్తనాలు లోలోపలి నుండి బంగారు ఎరుపు వర్ణపు ప్రకాశములో మెరుస్తున్నట్లు, ఒక్కొక్క విత్తనం చుట్టూ పవిత్రత యొక్క శ్వేత వర్ణ కిరణాలు ఒక వలయంగా వ్యాపిస్తున్నట్లు అనుభూతి చేయండి.

అలాగే సంకల్పాల ఆధారంగా విత్తనాలను పరంధామములో పరమపిత పరమాత్మ సమీపంగా తీసుకుని వెళ్ళండి. పరంధామము యొక్క శాంతి, పవిత్రత మరియు శక్తిశాలీ వాతావరణంలో ఒక్కొక్క విత్తనం లోపల పరమాత్మ ప్రకాశము, శక్తి కిరణాలను నింపుతున్నట్లు విత్తనాలు మెరుస్తున్నట్లు అనుభూతి చేయండి. పరమాత్మ శక్తుల ఆధారముతో విత్తనాల నుండి మొలకెత్తే మొక్కలు ఆరోగ్యవంతంగా, శక్తిశాలిగా పెరుగుతాయి, ధాన్యములో పౌష్టికతతోపాటు దిగుబడి కూడా పెరుగుతుంది.

ఈ రాజయోగ అభ్యాసం కోసం ఉదయం బ్రహ్మ ముహూర్త సమయం 4 నుంచి 5 గంటల సమయం శ్రేష్ఠంగా ఉంటుంది. ఈ సమయంలో నలువైపులా వాతావరణం మిక్కిలి శాంతిగా ఉండటమేకాక మనస్సు కూడా తాజాగా ఉంటుంది. కావున, మనస్సు సహజంగా ఏకాగ్రమవుతుంది. మీ ఇంట్లో స్వచ్ఛమైన శాంతియుత స్థానమును యోగాభ్యాసం కోసం ఎంచుకుని అభ్యాసము చేసినట్లయితే సఫలత సహజంగానే లభిస్తుంది.

సమయానుసారంగా నియమాలన్నింటిని పాటిస్తూ రాజయోగ అభ్యాసం చేసే సోదరీ సోదరులు, తండ్రి అయిన పరమాత్మ ద్వారా లభించిన ఆత్మ గౌరవాలలో స్థితులై యోగాభ్యాసము చేసినట్లయితే చాలా సుందరమైన పరిణామాలు కనిపిస్తాయి.

యోగ ప్రయోగం కోసం కేవలం పరమాత్మపై విశ్వాసం పెట్టుకోవలసిన అవసరం వుంది. సాగుభూమిపై, పంట పైర్లపై స్నేహపూర్వకంగా ప్రేమతో కూడిన సంబంధాలను జోడించవలసి వుంటుంది. ఒక్కసారి సంబంధాన్ని జోడించారంటే పంట పైర్లకు మనం ఎంత దూరములోఉన్నా, మన సంకల్పాల ఆధారంగా సమీపంగా ఉన్నట్లు అనుభవం చేయగల్గుతాము. మన భావనలకు మొక్కలు ప్రభావితం అవుతాయి వాటి అనుసారంగా ఫలితాన్ని ఇస్తాయి. ఈ భావనలను ఎటువంటి విద్యుత్ శక్తి కాని అయస్కాంత శక్తులు కాని ఆపలేవు.

ఇందులో పూర్తి విజయాన్ని పొందాలంటే – దృఢత మరియు విశ్వాసముతో పాటు పరమాత్మ ద్వారా లభించిన నియమాలకనుసారంగా నడుచుకోవడం చాలా అవసరం.

## రాజయోగ కామెంట్రీ (ఆత్మిక సంభాషణ)

**1**. మొట్ట మొదట స్వయాన్ని ఆత్మ నిశ్చయం చేసుకోండి…… మీ స్వ స్వరూపాన్ని అనుభూతి చేయండి…… నేను ఆత్మను ఒక జ్యోతిర్బిందు స్వరూపాన్ని…… ప్రకాశ స్వరూపాన్ని…… జ్ఞాన స్వరూపాన్ని…… పవిత్ర స్వరూపాన్ని…… శాంతి స్వరూపాన్ని…… ప్రేమ స్వరూపాన్ని…… సుఖ స్వరూపాన్ని…… ఆనంద స్వరూపాన్ని…… శక్తి స్వరూపాన్ని…… ఇప్పుడు పరంధామములో పరమపిత పరమాత్మను స్మృతి చేయండి…… పరమాత్మ కూడా ప్రకాశ స్వరూపము…… ఒక జ్యోతిర్బిందువు…… తేజోమయుడు…… జ్ఞాన సూర్యుడు…… ఆత్మనైన నాలో ఆ జ్ఞాన సూర్యుని కిరణాలు ఇమిడిపోతున్నాయి…… పరమాత్మ పవిత్రతా సాగరుడు…… ఆత్మనైన నేను, సంపూర్ణ పవిత్రంగా అవుతున్నాను…… ప్రేమ సాగరుడైన పరమాత్మ నుండి ప్రేమ కిరణాలు నా మీద పడుతున్నాయి…… ఆత్మనైన నేను, ప్రేమతో సంపన్నమవుతున్నాను…… ఆత్మనైన నేను, సుఖ స్వరూపమును…… సుఖ

సాగరుడి సుఖపు కిరణాలు ఆత్మనైన నాలో ఇమిడిపోతున్నాయి...... నాకు అతీంద్రియ సుఖాన్ని అనుభూతి చేయిస్తున్నాయి...... ఆనంద సాగరుడైన పరమాత్ముని ఆనంద కిరణాలు నాపై ప్రసరిస్తున్నాయి...... ఆత్మనైన నేను, ఆనందాన్ని అనుభూతి చేస్తున్నాను...... సర్వశక్తివంతుడైన పరమాత్మ నుండి వెలువడే సర్వశక్తుల కిరణాలు నా పై పడుతున్నాయి...... నేను ఆత్మ, సర్వ శక్తులతో సంపన్నంగా అవుతున్నాను...... పరమాత్మ దివ్య గుణాల సాగరం వంటివారు...... ఆత్మనైన నన్ను దివ్య గుణాలతో సంపన్నంగా చేస్తున్నారు...... నేను పరమాత్మ సమానముగా సర్వ గుణాలతో శక్తులతో సంపన్నంగా, సంపూర్ణంగా అవుతున్నాను........

ఇలా పైన పేర్కొన్న విధంగా ఒక్కొక్క సంకల్ప స్వరూపములో ఏకాగ్రచిత్తులై , యోగయుక్తమైన సంకల్పాలతో సాగుభూమికి పంట పొలాలకి ప్రకంపనాలను అందించినట్లయితే అద్భుతమైన ఫలితాలను చూడగలము.

**2.** మొదట స్వయంలో తమ ఏదైన ఒక ఆత్మ గౌరవాన్ని స్మృతికి తెచ్చుకుని ఆ స్వరూపాన్నే అనుభూతి చేయండి...... నెమ్మది నెమ్మదిగా మీ ఫరిశ్తా స్వరూపమును మీముందుకు తీసుకరండి...... నేను ఫరిశ్తాను తేలికగా ప్రకాశమయంగా ఉన్నాను...... సూక్ష్మ వతనం వైపు వెళ్తున్నాను...... స్వయాన్ని సూక్ష్మవతనంలో బాప్‌దాదాలకు సమీపంగా అనుభవం చేస్తున్నాను...... స్వయములోని లోపాలను, బలహీనతలను త్యజించి స్వయాన్ని సంపన్నంగా, సంపూర్ణంగా అనుభూతి చేయాలి...... ఆ తర్వాత, నెమ్మది-నెమ్మదిగా మీ ఫరిశ్తా స్వరూపంతో కూడా అతీతమె...... ఇప్పుడు జ్యోతిర్బిందు స్వరూపుడనై ఆత్మనైన నేను...... పరంధామము వైపు వెళ్తున్నాను...... పరంధామములో పరమాత్మ సమీపంగా మరియు సమానముగా అనుభూతి చేస్తున్నాను...... ఏకాగ్రచిత్తులై ఇలా బీజరూప స్థితిలో స్థితులయ్యే అభ్యాసాన్ని కనీసం 5 నిముషాలు చేయాలి...... తండ్రి అయిన పరమాత్మ నుండి వెలువడే జ్ఞానం...... పవిత్రత......శాంతి...... ప్రేమ...... సుఖం...... ఆనందము...... శక్తి కిరణాలు ఆత్మనైన నాపై ప్రసరిస్తున్నాయి...... నా నుండి భూమి, నీరు, వాయువు, ఆకాశం, అగ్ని, సూర్య-చంద్ర-నక్షత్రాలకు గ్రహాల వరకు చేరుతున్నాయి...... అవన్నియు పావనంగా, శుద్ధముగా, శాంతిగా మరియు శక్తిశాలిగా అవుతున్నాయి...... జీవ జంతువులు, కీటకాలు, పశు పక్ష్యాదులు అన్నింటిపై పరమాత్మ శక్తుల అనుభూతి కలుగుతోంది...... శాంతి, ప్రేమ, సుఖం, ఆనందం, మరియు శక్తులచే సంపన్నంగా అవుతున్నాయి...... సర్వత్రా శాంతియే శాంతి...... ఏకాగ్రచిత్తులై ఇవే సంకల్పాలలో 5 నిమిషాలు స్థితులవ్వండి......

ఈ సంపూర్ణ స్థితితో ప్రకాశ స్వరూపం శక్తిశాలి అయిన ఆత్మను, తిరిగి సూక్ష్మ వతనానికి చేరుకొని ఫరిశ్తా స్వరూపాన్ని ధారణ చేస్తున్నాను...... బాప్‌దాదా సమక్షములోకి వెళ్ళి బాప్‌దాదాను

క్రిందకి ఆహ్వానించాలి...... మీరు ప్రయోగించే సాగుభూమిని బాప్‌దాదాకు చూపించండి...... ఆత్మిక సంభాషణ చేస్తూ...... సాగుభూమిపై మరియు పంట పొలాలపై బాప్‌దాదా శక్తిశాలీ దృష్టిని ప్రసరిస్తున్నారు...... శక్తి, ప్రకాశకిరణాలను ఇస్తున్నట్లు అనుభూతి చేయండి...... బాప్‌దాదాల నేత్రాల ద్వారా పవిత్రత మరియు శక్తి కిరణాలు పంటభూమిలో పంటపైర్లలో కలుస్తున్నాయి......వీటి ద్వారా సాగుభూమి మరియు పంట పైర్లు రోగరహితంగా శక్తిశాలిగా అవుతున్నాయి...... ఈ కిరణాలతో పంట పొలాల అభివృద్ధికి కావల్సిన పోషక తత్వాలు తయారవుతున్నాయి...... పంటలలో పెరుగుదల చాలా బాగా జరుగుతున్నది...... ఈ విధంగా శుద్ధమైన, శుభమైన సంకల్పాలు మనస్సులో కొనసాగిస్తూ ఉండాలి......

పంటలలో ధాన్యము ఏర్పడే సమయంలో పరమాత్మ ద్వారా పవిత్రత, శాంతి, ప్రేమ, సుఖం, ఆనందం, శక్తి కిరణాలను పంట పైర్లకు ఇవ్వండి...... పరమాత్మ శక్తులు విత్తనాలలో, పండ్లలో సాత్వికతను మరియు పౌష్టికతను పెంచుతున్నాయి...... ధాన్యపు గింజల పరిమాణము కూడా పెరుగుతోంది...... ఇలాంటి శ్రేష్ఠమైన శుభకారి సంకల్పాలు చేయాలి......

పరమాత్ముని పవిత్ర కిరణాలు, శక్తిశాలీ కిరణాలు పంటపొలాలపై పడుతున్నాయి...... కీటకాల వల్ల గాని, రోగాల వల్ల గాని, పశువుల వల్ల గాని పంట పొలాలకు ఎలాంటి నష్టము వాటిల్లకూడదు...... దీనికై పంట పొలాల నలువైపులా పవిత్రతతో కూడిన శక్తిశాలి ప్రకాశ వలయాన్ని నిర్మించండి......

పంటపొలంలో పనులు చేస్తున్న సమయంలో సంపూర్ణ ఫరిశ్తా స్వరూపంలో ఉంటూ పని చేయండి...... పరమాత్ముని శక్తులు ఫరిశ్తానైన నా ద్వారా పంట భూములలో పంటపైర్లలోకి వ్యాపిస్తున్నాయి...... శాంతి కిరణాలు పూర్తి పంటపొలాలపై వ్యాపిస్తున్నట్లు అనుభూతి చేయాలి......

అప్పుడప్పుడు పంట పొలాలను సూక్ష్మవతనంలో బాప్‌దాదా సమీపంగా తీసుకుని వెళ్ళండి...... వాటికి బాప్‌దాదా ప్రకాశమైన శక్తిశాలి కిరణాలను ఇస్తున్నారు...... జ్ఞానం...... పవిత్రత...... శాంతి...... ప్రేమ...... సుఖం...... ఆనందం...... శక్తి...... దివ్య గుణాల సంపన్నతను అనుభూతి చేయండి......

ఒక్కొక్కసారి పంటపొలాలకు పరంధామం యొక్క అమితమైన శాంతిని అనుభూతి చేయించండి...... జ్యోతిర్బిందు స్వరూపుడైన పరమాత్మ నుండి వెలువడే కిరణాలు ఒక్కొక్క మొక్కలో ప్రవేశిస్తున్నాయి...... సర్వత్రా శాంతియే శాంతి...... ఈ శాంతి ప్రకంపనాలను సాగుభూమి పంటపొలాలకు అనుభూతిని చేయించండి.

సాగుభూమిని శక్తిశాలిగా లేక సారవంతముగా చేయుటకై ఎరువులను తయారుచేసే సమయంలో,

ఎరువులను యోగయుక్త స్థితిలో ఉంటూ పరమాత్మ శక్తులతో సంపన్నం చేయండి...... ఈ ఎరువులు పంటపొలాలను రోగ రహితంగా, ధృడంగా చేయుటలో సహాయపడతాయి అని సంకల్పాను చేయండి...... ఎరువులపై వరదానీ హస్తమును పెట్టి...... నా ఈ చేతుల ద్వారా పరమాత్ముని శక్తుల ప్రకంపనాలు ఎరువులపై పడుతున్నాయి...... ఎరువులలో శక్తిని నింపుతున్నాయి...... ఎరువు శక్తిశాలిగా అవుతుందని అనుభూతి చేయండి...... ఏ టానిక్స్‌నైన కూడా తయారుచేసే సమయంలో ఇదే అభ్యాసము చేయండి...... వాటిని చల్లే సమయంలో కూడా యోగయుక్తంగా ఉంటూ, పరమాత్మ శక్తులతో పాటు సేంద్రియ అఱక్ (టానిక్స్)ను చల్లండి......

రోగనిరోదక లేక క్రిమిసంహారక మందులను తయారుచేసే సమయంలో పవిత్రత ప్రకంపనాలను వాటిలో నింపండి...... విత్తనాలను బాప్‌దాదా సమక్షంలోకి తీసుకుని వెళ్ళండి......

# పంట భూములను సారవంతముగా చేయుట

ప్రకృతి సిద్ధమైన చెట్లు, పొదలు, మొక్కల పెరుగుదలకు కావలసిన పోషణ భూమి నుండి లభించును. వాటికి అవసరమైన వాటిని అదే భూమి నుండి గ్రహించుకునే సమర్థత వృక్షజాతిలో సహజసిద్ధంగా ఉంటుంది. నేడు వృక్షాలను విపరీతంగా నరకడం వల్ల రసాయనిక ఎరువులను, కలుపుమొక్కల నాశకాలను, క్రిమిసంహారకాలను అధికంగా వాడటం వల్ల మొక్కలలో పెరుగుదలకు కావలసిన పోషక వ్యవస్థలో అంతరాయం కలగడమేకాక భూమి నిస్సారంగా మారుతుంది. ఇలాంటి బంజరు భూమిని తిరిగి సారవంతంగా తయారుచేసేందుకు మొక్కలను నాటడం, పంట భూములలో సేంద్రీయ, జైవిక ఎరువులను ఉపయోగించటం చాలా అవసరం. వర్తమాన సమయంలో మనం ప్రకృతితో పాటు కలిసిమెలిసి నడుచుకోవడం చాలా అవసరం. దీనికోసం ఆధ్యాత్మికతను ఆధారంగా చేసుకోవడం చాలా చాలా అవసరం.

**సేంద్రీయ జైవిక ఎరువులను తయారుచేయు విధానాలు :-**

**1**. అన్నింటికంటే మొదట పంట దిగుబడి తర్వాత అనవసరమైన మొక్క భాగాలను అదే భూమిపై పరచి కుళ్ళబెట్టాలి లేక భూమిలో పాతిపెట్టాలి. ఉదా॥కు మొక్కల కాడలు, వేర్లు, గడ్డి పోచలు, ధాన్యపు పొట్టు, గోధుమల పొట్టు, వేరుశనగ తొక్కలు, చెఱకు ఆకులు మొ॥వి భూమిపై పరచి పెట్టాలి లేక భూమిలో సేద్యం ద్వారా కలిపివేయాలి. ఇవి భూమిలో కుళ్ళుట ద్వారా సేంద్రీయ పదార్థాల ప్రమాణము పెరుగుతుంది.

**2**. పంట భూములలో ప్రతి ఎకరానికి కనీసం 6 టన్నుల పేడను కలపాలి. ఈ పేడ మొక్కలకు ఉపయోగకారియగు సూక్ష్మజీవులను భూమిలో తయారుచేస్తుంది.

**3**. ఒకవేళ పేడ లభించలేదంటే 'ఎరువు మొక్కలను' ఉపయోగించాలి. ఇందులో –

| | | | |
|---|---|---|---|
| జనుము | –5 కిలోలు | జొన్నలు | –1 కిలోగ్రాము |
| బుడం కాయ | –5 కిలోలు | ధనియాలు | –1 కిలోగ్రాము |
| పెసలు | –1 కిలోగ్రాము | అలసందలు (హరిశ్చంద్రలు) | –2 కిలోగ్రాము |
| మినుములు | –1 కిలోగ్రాము | గోగునార (గోంగూర) | –1 కిలోగ్రాము |
| శనగలు | –1 కిలోగ్రాము | తోటకూర గింజలు (రాజ్‌గిరా) | –200 గ్రాములు |
| మెంతులు | –1 కిలోగ్రాము | | |

* పై అన్ని రకాల విత్తనాలను కలిపి ఒక ఎకరం పొలంలో సాగు చేయాలి. 45 నుంచి 50 రోజులలో ఈ పంట మొక్కలను కోసి, భూమిలోనే సేద్యము ద్వారా పాతి పెట్టాలి.

* చెఱకు, అరటి తోటలలోని భూమిలో ఆకుపచ్చని మొక్కలను కోసి భూమిపై పరచి పెట్టాలి.

**4. జీవామృతము :-** దేశవాళి ఆవు పేడ 10 కిలోలు, గోమూత్రము 5 లీటర్లు, 2 కిలోలు రసాయానాలు లేని బెల్లం, 250 గ్రాములు దేశవాళి ఆవు నెయ్యి (ఇది లభించనిచో 250 గ్రాములు వేరుశనగ నూనె లేక సోయాబీన్ నూనె), 2 లీటర్లు దేశీ ఆవు పెరుగు, 2 కిలోలు శనగలు లేక అలసందలు, పెసలు లేక మినుముల పిండి, మఱ్ఱి చెట్టు క్రిందనున్న మట్టి 1 కిలో (లేకుంటే ఏ పంటకైతే జీవామృతము చల్లాలో ఆ పంట వేర్ల వద్దనున్న మట్టి ఒక కిలో), వీటికి 200 లీటర్ల నీటిని కలిపి ఒక సిమెంట్ లేక ప్లాస్టిక్ తొట్టిలో వేసి, 8 రోజుల వరకు తొట్టిని లేదా ట్యాంకు పై భాగాన్ని మందమైన బట్టతో బిగించి కట్టాలి. ప్రతిరోజు రెండు సార్లు ఈ మిశ్రమాన్ని కర్రతో గడియారపు ముల్లు తిరుగు దిశలో బాగా కలపాలి. ఇలా చేయడం ద్వారా సూక్ష్మ జీవుల సంఖ్య పెరుగుటకు ఆక్సిజన్ బాగా లభిస్తుంది.

* ఈ మిశ్రమాన్ని ఒక ఎకరం భూమికి, అదికూడా భూమి తడిగా నున్నప్పుడు సాయంత్ర సమయంలో లేక పంట పొలాలకు నీరు పెట్టే సమయంలో నీటితో వదలాలి. దీని వలన సూక్ష్మ జీవులన్నీ గణనీయంగా పెరుగుతాయి.

* ప్రతి పంటకు కనీసం నెలకు ఒక్కసారైనా జీవామృతమును ఇవ్వడం చాలా అవసరం.

**5**. ఒక ఎకరం భూమిలో ఒక టన్ను వానపాముల ఎరువును భూమి తడిగానున్నప్పుడు ప్రతి మూడు మాసాలకొకసారైనా వాడాలి. ఈ ఎరువు ద్వారా భూమి సారవంతముగా అవుతుంది.

**6. ధాన్య సంబంధిత ఎరువులు ( పచ్చి రొట్టె ఎరువులు ) :-**

| | | | |
|---|---|---|---|
| మొక్కజొన్న | −10 కిలోలు | మినుములు | − 2 కిలోలు |
| సోయాబీన్స్ | −10 కిలోలు | పెసలు | − 2 కిలోలు |
| జొన్నలు | −10 కిలోలు | అలసందలు | − 2 కిలోలు |
| గోధుమలు | −10 కిలోలు | శనగలు | − 2 కిలోలు |
| బియ్యము | −10 కిలోలు | రాగులు | − 2 కిలోలు |

వీటన్నింటిని కలిపి నూకగా చేయాలి. పంటలు పండించుటకు ముందే ఒక ఎకరం భూమిలో చల్లి, నీరు పెట్టాలి. మరసటి రోజు సాయంత్రము సమయంలో 200 లీటర్ల జీవామృతములో పంటల అవసరాన్ని బట్టి నత్రజని, ఫాస్పరస్, పొటాషియంలచే పెంపొందించబడిన జైవిక ఎరువులను భూమి

తడిగానున్నప్పుడు చల్లాలి లేక సాగునీటితో పాటు కలపడం చాలా అవసరము. ఈ ఎరువుల ద్వారా భూమిలో ఉపయుక్త సూక్ష్మజీవుల సంఖ్య అధికమవుతుంది, భూమి కూడా సారవంతమవుతుంది.

* పంట పైర్ల అవసరాలను బట్టి వీటిని ఒకటి లేక రెండు, మూడు సార్లు కూడా ఎలాంటి పంటలకైనా ఉపయోగించవచ్చు.

**7. పైర్ల పై చల్లేందుకు టానిక్స్ ( శక్తి వర్ధకాలు) :-** 3 లీటర్లు దేశీ ఆవు పాలు, 3 లీటర్లు గోమూత్రము, 3 లీటర్లు టెంకాయ (కొబ్బెరి) నీళ్ళు, 1 కిలో రసాయనాలు లేని బెల్లము, 200 లీటర్ల నీటిని కల్పి, అవసరాన్ని బట్టి ఎలాంటి పంటల పైనైనా చల్లవచ్చు.

**8. బీజామృతము :-** 1 కిలో దేశీ ఆవు పేడ, 1 లీటరు గోమూత్రము, 200 మి.లీ.దేశీ ఆవు పాలు, 50 గ్రాములు వేడి సున్నము, 10 గ్రా॥లు ఇంగువను 10 లీటర్ల నీటిలో రెండు రాత్రుల పాటు పాత్రలో లేక తొట్టిలో నానబెట్టాలి(పులియబెట్టాలి). ప్రతి రోజు రెండు సార్లు గడియారపు ముల్లు తిరుగు దిశలో కర్రతో ఈ మిశ్రమాన్ని బాగా కలపాలి, మందమైన బట్టతో బిగించి కట్టాలి. రెండు రోజుల తర్వాత ఈ బీజామృతమును విత్తన శుద్ధికై వినియోగించాలి.

**9. జైవిక ఎరువులు (సంశ్లేషిత బ్యాక్టీరియాలు) :-**

తయారు చేయబడిన జైవిక ఎరువులు నేడు మార్కెట్‌లో లభిస్తున్నాయి.

**(అ) రైజోబియమ్ జైవిక ఎరువులు :-** అలసంద, వేరుశనగ, పెసలు, కందులు, మినుములు, అనపకాయలు, ఉలవలు, మొటిక్కాయలు, జనుము, దిల్‌ఖుష్ కాయ (బుడంకాయల వంటివి), శనగలు, బఠాణీలు, సోయాబీన్స్, వెల్లుల్లి మొ॥గు పంటల కోసం ఈ ఎరువులను వినియోగించవచ్చు- దీనితో

* 15 నుంచి 20 శాతం పంటలలో పెరుగుదల కనిపిస్తుంది.
* విత్తనాలలో మొలకెత్తే శక్తి పెరుగుతుంది.
* రోగ నిరోధక శక్తి పెరుగుతుంది.
* భూమిలో నత్రజని శాతం పెరుగుతుంది.
* సాగుభూమిలో కార్బన్, నత్రజనుల శాతాలు తగిన విధంగా ఉంటాయి మరియు భూమి సారవంతంగా మారుతుంది.

**(ఆ) అజొటో బ్యాక్టర్ జైవిక ఎరువులు :-**

జొన్న, గోధుమ, వరి, పత్తి, కోసు గడ్డ (క్యాబేజి), గోబీ పువ్వు (కాలీఫ్లవర్), పొద్దు తిరుగుడు

పువ్వులు, చెఱకు, సజ్జ, రాగి, మొక్క జొన్న మరియు కూరగాయలగు క్యారెట్, పాలకూర, తోటకూర కాకరకాయ, మిరపకాయ, వంకాయ, టమోటా మొ॥గు పంటలకై ఉపయోగించవచ్చు. వీటి ద్వారా–

* పంట దిగుబడి శాతం బాగా పెరుగుతుంది.
* విత్తనాలలో మొలకెత్తే సామర్థ్యం పెరుగుతుంది.
* పంట మొక్కల వేర్లు ధృడంగా అభివృద్ధి చెందుతాయి.
* పంట ఉత్పాదనలలో పౌష్టికత పెరుగుతుంది.
* బూజులు పట్టకుండా నిరోధిస్తుంది.
* కూరగాయలకు సంబంధించిన పంటలలో, ముఖ్యంగా బఠాణీలలో స్టార్చ్ (పిండి పదార్థ) శాతం, కంద గడ్డ, చెఱకులలో చక్కెర శాతం పెరుగుతుంది.

**(ఇ) అజొస్పిరీలియమ్ జైవిక ఎరువులు :–**

మొక్క జొన్న, జొన్న, సజ్జ, గోధుమ, చెఱకు, గడ్డి వంటి పంటలకు ఇవి చాలా ఉపయోగకరమైనవి. ఈ బాక్టీరియాలు అజొటో బ్యాక్టర్ బ్యాక్టీరియా కంటే 2 శాతం ఎక్కువగా గాలిలోని నైట్రోజన్‌ని గ్రహించి పంటలకిస్తుంది. అందుచేత 15 నుంచి 16 శాతం అధిక దిగుబడి లభించును. వీటిని వినియోగించడం ద్వారా ప్రతి ఎకరానికి 8 కిలోల నైట్రోజన్ తయారవుతుంది.

**(ఈ) పి.యస్.బి. జైవిక ఎరువులు :–**

ఇవి అన్ని రకాలైన పంటలకు అత్యంత అవసరమైనవి. వీటి ద్వారానే సిట్రిక్, లైక్టిక్, సక్సినిక్, మలిక్ లేక ఫ్యూమరిక్(ఆమ్లాలు) వంటి సేంద్రీయ ద్రవాలు లభిస్తాయి. ఈ ద్రవాలు ద్రవ రూపం కానటువంటి(ఘన రూపంలో నున్న) ఫాస్ఫరస్‌ను ద్రవ రూపంలోకి మారుస్తాయి. దీనిచే భూమిలోని పి.హెచ్. విలువ తగ్గి, కాల్షియం, మెగ్నీషియమ్, ఐరన్, అల్యూమినయం వంటి మూల ఖనిజాల స్థిరీకరణ జరుగుతుంది. ఇవి ఫాస్ఫరస్‌తో కలవకుండా ఉంటాయి. అందుచే ఫాస్ఫరస్ ఆర్థోఫాస్ఫేట్ రూపంలో ఉండుటచే మొక్కలకు సహజంగా లభించును.

**10. విత్తన శుద్ధికై అవలంబించు విధానాలు : -**

**(అ) ఏకదళ బీజాలను శుద్ధి పరచు విధానము :–**

మొక్కజొన్న, జొన్న, గోధుమ, వరి, పత్తి, క్యాబేజీ (కోసు గడ్డ), క్యాలిఫ్లవర్ (గోబీ పువ్వు), ప్రొద్దుతిరుగుడు పువ్వులు, చెఱకు, సజ్జ మరియు కూరగాయలైన క్యారెట్, పాలకూర, తోటకూర,

కాకరకాయ, మిరపకాయ, వంకాయ, టమాటో మొ॥గు వాటికి చెందిన 15 నుంచి 20 కిలోల విత్తనాలపై జీవామృతము చల్లి తడిగా చేయవలెను. 250 గ్రాముల రైజోబియమ్ సంశ్లేషిత బ్యాక్టీరియా, 250 గ్రాములు పి.యస్.బి బ్యాక్టీరియాలతో అనగా ఈ రెండు రకాలైన జైవిక ఎరువులను (సంశ్లేషిత బ్యాక్టీరియాలను) బీజామృతముతో కలిపి విత్తనాలపై లేపనము (పూతగా) చేయాలి. కాని, విత్తనాలు పాడుకాకుండా జాగ్రత్తపడాలి. ఈ విత్తనాలను నీడలో ఆరబెట్టి 8 లేక 10 గంటల లోపలనే భూమి తడిగా ఉన్నప్పుడే విత్తుకోవాలి.

### (ఆ) ద్విదళ బీజాలను శుద్ధి పరచు విధానము :-

పెద్ద శనగలు, వేరుశనగ, పెసలు, మినుములు, కందులు, శనగలు, సోయాబీన్స్, వెల్లుల్లి, జనుములు, ఆనపకాయలు (సొరకాయ), ఉలవులు, దిల్‌ఖుష్‌కాయలు, మొ॥గు పంటలకు చెందిన 15 లేక 20 కిలోల విత్తనాలపై బీజామృతము చల్లండి. తరువాత 250 గ్రాములు రైజోబియమ్ బ్యాక్టీరియాలను (జైవిక ఎరువులను) మరియు 250 గ్రాములు పి.యస్.బి జైవిక ఎరువులను పూతగా పూయాలి. కాని, విత్తనాలు పాడవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి తరువాత విత్తనాలను నీడలో ఆరబెట్టి 8 లేక 10 గంటల లోపలనే తేమగానున్న భూమిలో విత్తుకోవాలి.

### జైవిక ఎరువులను ఉపయోగించు విధానము :-

ఏ పంటలకు ఏ రకమైన జైవిక ఎరువులను ఉపయోగించాలి అనే విషయాన్ని ముందే వివరించడం జరిగింది.

**ఒక ఎకరం పొలానికి -**

1. ఒక కిలో రైజోబియమ్ లేక ఒక కిలో అజొటోబ్యాక్టర్ లేక ఒక కిలో అజోస్పిరిలియమ్‌ను, 25 కిలోల పేడతో కలిపి, దీనిపై నీళ్ళు చల్లి ఒకటి లేక రెండు రోజులు నీడలో పెట్టాలి.
2. దీనితో పాటు ఒక కిలో పి.యస్.బి. జైవిక ఎరువును, 25 కిలోల పేడలో కలిపి, దీని మీద నీళ్ళు చల్లి నీడలో ఒకటి లేక రెండు రోజుల పాటు పెట్టాలి.
3. పంటల అవసరాన్ని బట్టి అధిక దిగుబడి పొందుటకై 1 కిలో జైవిక ఎరువులను (సంశ్లేషిత బ్యాక్టీరియాలను) 25 కిలోల పేడలో కలపండి. దీనిపై నీళ్ళు చల్లి (తడిపి) ఒకటి లేక రెండు రోజుల పాటు నీడలో ఉంచండి.

పై మూడింటిని ఒకటిగా కలిపి పంట భూమి తడిగా నున్నప్పుడు సాయంత్ర సమయంలో భూమిలో కలపాలి. ద్రవ రూపంలోనున్న సంశ్లేషిత బ్యాక్టీరియాలను డ్రిప్ (ఇరిగేషన్ ) ద్వారా వదలచ్చు.

## నడేప్ పద్ధతిలో సేంద్రియ(కంపోస్ట్) ఎరవులను తయారుచేయు విధానము

నడేస్ పద్ధతిలో కంపోస్ట్ ఎరువులను తయారు చేయుటకై 15 అడుగుల పొడవు, 5 అడుగుల వెడల్పు, 3 అడుగలు ఎత్తు గల చేంబర్‌ను(తొట్టిని) ఇటుకలతో తయారుచేసుకోవాలి. గోడ మందము 9 అంగుళాలు ఉండాలి. నలువైపులా గోడలలో ఇటుక వెడల్పంత సైజులో రంధ్రాలు ఉంచడం అవసరము. వీటి ద్వారా గాలి లోపలికి ప్రవేశిస్తుంది. గోడల లోపల మరియు బయట చిక్కటి గాఢమైన పేడ నీళ్ళతో పూతగా అలకాలి. ఇది ఎండిన తర్వాత ఈ తొట్టిని ఉపయోగించవచ్చు.

ఈ విధానంలో చేంబర్ (తొట్టిని) నింపడానికి పొలం నుండి వ్యర్ధ పదార్థాలు ఉదా॥కు పంటమొక్క ల కాడలు, వరి గడ్డి, గోధుమ గడ్డి, ( వరి, గోధుమ తౌవుడు ), వేరుశనగ పొట్టు, సోయాబీన్ పొట్టు (తొక్కలు), చెఱకు ఆకులు, ఆవు పేడ మొ॥గు వాటిని వాడవచ్చు.

మొదట తొట్టి లోపలి గోడలు మరియు అడుగు భాగములో పేడ నీళ్ళను చల్లాలి. తరువాత 6 అంగుళాల మందముతో సహజంగా ఎండిన లేక పంటల చెత్త పదార్థాలను పొరలుగా వేయాలి. వీటిపై వేపాకు, అద్దాసరము (కప్పరెల్లాకు వంటింది), గ్లేరిసీడియా యొక్క ఆకుపచ్చ ఆకులను పరచాలి. వీటిపై 4 కిలోలు దేశీ ఆవు పేడను, 150 లీటర్ల నీటిలో కలిపిన పేడనీళ్ళతో బాగా తడపాలి. ఆతరువాత పంట పొలంలోని 50 – 60 కిలోల మట్టిని సమానంగా పరిచి మన్ను తడిసే వరకు నీటిని చల్లాలి. దీనిని ఒక లేయర్ (పొర) అని అనవచ్చు. ఇలాగే దీనిపై తొట్టిలో 11/2 (ఒకటిన్నర) అడుగు మిగులునంత వరకు ఇలా పొరలు పొరలుగా తయారు చేయాలి. నిండిన తొట్టిలో 400–500 కిలోల మట్టిని తడిగా చేసి 3 అంగుళాల మందముతో కప్పినట్లుగా లేపనం చేయాలి, దానిపై మళ్ళీ పేడతో లేపనం చేయాలి. ఎండ కారణంగా మట్టిలో పగుళ్ళు వస్తాయి, కాబట్టే మట్టి లేయర్‌పై పేడ నీళ్లతో అలకాలి. ఒకవేళ ఎండలు ఎక్కువగా ఉంటే ఈ తొట్టిపై గడ్డిని కప్పాలి. 90 నుండి 120 రోజులలో కంపోస్ట్ ఎరువు తయారయిపోతుంది. ఈ ఎరువును ఎండిపోకుండా 20 శాతం తేమగా ఉండాలి.

ఇందులో 3.5 నుండి 4 టన్నుల వరకు కంపోస్ట్ ఎరువు లభిస్తుంది. ఈ ఎరువులో 0.5% నుంచి 1% వరకు నైట్రోజన్, 0.5% నుంచి 0.8% వరకు ఫాస్ఫరస్ (భాస్వరం) మరియు 1.2% నుండి 1.4% వరకు పొటాషియం లభిస్తాయి.

## వానపాముల ఎరువులను తయారుచేయు విధానము

వానపాముల ఎరువును తయారుచేయడానికి నీడ ఉండే ప్రదేశము అవసరం. సూర్యుని వెలుతురు మరియు వర్షం నుండి రక్షించుటకై ఒక షెడ్‌ను నిర్మించాలి దీని క్రింద 3 అడుగుల వెడల్పు, 8 లేక

10 అడుగుల పొడవు గల స్థానంలో 1 1/2 అడుగు ఎత్తుతో 4 అంగుళాల మందముతో ఒక చేంబర్‌ను కట్టాలి. మొదట తొట్టి అడుగు భాగమున నీళ్ళు చల్లి భూమిని తడిగా చేయాలి. తరువాత వ్యర్థ పదార్థాలు ఏలాగంటే వరిగడ్డి, గోధుమ గడ్డి, (లేక తవుడు) చెఱకు ఆకులు మొ॥గు తొందరగా ఎండని పదార్థాలను 15 నుంచి 20 సెం. మీ. మందము (దళసరి)తో ఒక లేయర్‌గా వేసి దీనిపై నీళ్ళను చల్లి తడిగా చేయాలి. తర్వాత దీని పై పేడ లేక కంపోస్ట్ ఎరువు లేక తోటలోని మట్టిని 5 సెం. మీ. మందముతో ఒక పొరగా వేయాలి. ఇలా చేయడం ద్వారా వానపాములు సురక్షితంగా ఉంటాయి. ఈ మట్టిలో వానపాములను వదలిపెట్టాలి. ప్రతి చదరపు అడుగులో దాదాపు 2 వేల వానపాములను వదలాలి. ఈ లేయర్ పై భాగాన్ని జనపనార (బార్‌దాన్) గుడ్డతో కప్పేయాలి. 40 నుండి 45 % వరకు తేమగా ఉండేటట్లు మరియు షెడ్‌లో 20 నుండి 30 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత ఉండేటట్లుగా జాగ్రత్త తీసుకోవాలి. వానపాముల రక్షణ కోసం తొట్టి లోపలకి ఎలాంటి కీటకాలు, చీమలు రాకుండా జాగ్రత్త పడాలి. అవసరాన్ని బట్టి ఒకటి లేక రెండు రోజులు నీళ్ళను చల్లుతూ ఉండాలి. 30 లేక 40 రోజులలో వానపాముల ఎరువు తయారవుతుంది. వానపాములను వేరుచేసి ఎరువును భూమి తేమగా ఉన్నప్పుడు పంట భూమిలో చల్లుకోవాలి.

# సశ్యసంరక్షణ

ప్రకృతిలో జరిగే అనేక మార్పులను తట్టుకునే శక్తి, వాటి ప్రభావాలను ఎదుర్కొనే శక్తి మొక్కలకు ప్రకృతిసిద్ధంగా లభించింది. భూమి సారవంతముగా ఉంటే మొక్కలు శక్తిశాలిగా పెరుగుతాయి, రోగ నిరోధక శక్తి కూడా పెరుగుతుంది. ఎలాంటి చీడలు పట్టినా లేక బూజుల వంటి రోగాలు వచ్చినా తట్టుకోగలవు. ఒకవేళ భూమి నిస్సారంగా ఉంటే మొక్కలు బలహీనంగా ఉండటమేగాక చీడను, రోగాలను ఎదుర్కోలేకపోతాయి. కావున, క్రిమిసంహారకాలను ఉపయోగించవలసి వస్తుంది.

పంటలపై చీడ పురుగు పట్టినప్పుడు వీటిని పరభక్ష ప్రాణులు వచ్చి భక్షిస్తాయి, ఇది ప్రకృతి నియమము. కాని పరపోషితాలు నివశించే వాతావరణాన్ని మనం నాశనం చేసేశాము కాబట్టే, అటువంటి వాతావరణాన్ని మనం తిరిగి తయారుచేయవలసిన అవసరం ఉంది. దీనికోసం మొదట భూమిని సారవంతముగా చేయడానికి, వాతావరణాన్ని తయారుచేయడానికి పొలం గట్టున మొక్కలను నాటాలి. అంతేగాక ప్రకృతి నియమాలకనుసారంగా అనగా ఏ కాలములో ఏ పంటలు పండించాలో ఆకాలంలో అవే పండించాలి. మొక్కలు అనుకూల వాతావరణంలోనే తమ రక్షణ కావించుకోగలవు, తక్కువ ఖర్చుతోనే అధిక దిగుబడులను అందించవచ్చు.

మనం భూమిని సారవంతముగా చేసుకున్నట్లయితే వాతావరణాన్ని కూడా తయారుచేసిన వారమవుతాము. అయినప్పటికి ప్రకృతి వాతావరణంలోని మార్పుల వల్ల చీడలు లేక రోగాలు వస్తాయి, వీటి నివారణ కోసం కీటకనాశకాలను, రోగ నివారణ మందులను ఉపయోగించుకోవచ్చు. ఈ మందులతో పాటు యోగ ప్రయోగము చేసినచో చీడలను నిరోధించుటలో నూరు శాతం (100%) ఫలితం లభిస్తుంది.

## అనేక విధాలైన మందులను తయారుచేయ విధానాలు

1. **దశపర్ణి రసాయనము :-**

| | | | |
|---|---|---|---|
| వేపాకులు | – 5 కిలోలు, | గన్నేరు ఆకులు | –2 కిలోలు |
| బొప్పాయి ఆకులు | –2 కిలోలు, | గానుగాకులు | –2 కిలోలు |
| వయ్యారి భామ ఆకులు | –1 కిలో, | తెల్ల ఉమ్మెత్త ఆకులు | –2 కిలోలు |
| సీతాఫలం ఆకులు | –3 కిలోలు, | పత్తి ఆకులు | –2 కిలోలు |
| ఆముదమాకులు | –2 కిలోలు, | తిప్పతీగ | –2కిలోలు |
| పచ్చి మిరపకాయలు | –2 కిలోలు (నూరినవి) | | |

వీటన్నింటిని సిమెంట్ లేక ప్లాస్టిక్ తొట్టిలో 200 లీటర్ల నీటిని కలిపి 30 లేక 40 రోజుల పాటు కుళ్ళబెట్టాలి. తొట్టి మూతిని మందమైన (దళసరి) బట్టతో బిగించి కట్టాలి. ఈ మిశ్రమాన్ని ప్రతి రోజు కట్టెతో గడియారపు ముల్లు తిరిగే దశలో కలుపుతూ ఉండాలి. 30– 40 రోజుల తర్వాత దీనిని వడగట్టి 15 లీటర్ల నీటిలో 1 లేక 2 లీటర్లు ఈ మిశ్రమాన్ని కలిపి (చీడల ప్రమాణాన్ని బట్టి) ఎలాంటి చీడల నివారణకైనా పంటలపై చల్లుకోవచ్చు.

ఒకసారి తయారుచేసుకున్న ఈ మిశ్రమాన్ని 6 మాసాల పాటు ఉపయోగించుకోవచ్చు. ఈ మిశ్రమములో 200 మి.లీ. గోమూత్రమును తప్పక కలపాలి.

**2. వేప రసాయనము :–**

5 కిలోల వేప విత్తనాలను పొడి చేసి 9 లీ. నీటిలో రాత్రంతా నానబెట్టాలి. ఇందులో 500 గ్రాములు నూరిన పచ్చిమిరపకాయలను కలపాలి. దీని ద్వారా వేప కషాయం చాలా ప్రభావవంతముగా తయారవుతుంది. ఈ రసాయనంతో పాటుగా ఒక లీటరు నీటిలో 200 గ్రా॥ల ఏదైనా వాషింగ్ పౌడర్ను మిశ్రితము చేసి నానబెట్టాలి. రెండవ రోజు పై రెండు మిశ్రమాలను బాగా కలిపి వడపోసి 100 లీ. నీటిలో కలపాలి. ఏ రోజు మీరు ఉపయోగించవలెనో, ఒక రోజుకు ముందుగా ఈ మిశ్రమాన్ని తయారుచేసుకుని ప్రయోగించినచో అనేక విధాలైన చీడలు మరియు బూజుల(శిలీంధ్రాలు)కు చెందిన రోగాలు నియంత్రించబడతాయి.

**3. లిఫ్ మైనర్ (నాగహాలి) నియంత్రణ కోసం :–**

250 మి.లీ. దేశీ ఆవు మజ్జిగ, 50 గ్రా॥ల నిమ్మకాయ రసం, 100 గ్రా॥లు బెల్లం, 100 మి.లీ చింతపండు నీళ్ళు, 10 గ్రా॥లు ఇంగువ, 10 గ్రా॥లు కర్పూరము, 15 మి.లీ నీరు కల్పి స్ప్రే చేసువాలి. దీనిచే అనేక విధాలగు కీటకాలు పారిపోతాయి. విశేషంగా లిఫ్ మైనర్ వల్ల వచ్చే రోగాలకు ఇది చాలా ప్రభావవంతమైనది.

**4. మిలీ బగ్జ్ మరియు థ్రిప్స్ కీటకాల (రసాన్నిపీల్చు పురుగులు, తెల్లదోమల) నివారణ:–**

200 లీ. నీటిలో 5 కిలోల దేశీ ఆవు పేడ, 5 లీ. గోమూత్రము కలిపి 24 గం॥ల పాటు నానబెట్టి వడపోయాలి. దీనిని స్ప్రే చేసినచో డౌనీ, థ్రిప్స్ (తెల్లని దోమల వంటివి) తక్కువగును మరియు అన్ని విధాలైన పోషక తత్వాలు పంటలకు లభిస్తాయి. **లేక,**

5% వేప రసం, 3 % గోమూత్రమును కలిపి స్ప్రే చేసుకోవచ్చు. **లేక,**

15 లీ. నీరు, 30 గ్రాములు వర్ట్ సిలీయల్ బురశీ, 500 మి.లీ. పాలు కలిపి చల్లుకోవచ్చు.

**5. బూజుల (ఫంగస్) నివారణ కోసం :-**

ఎకరానికి ఒక కిలో ట్రయికోడర్మాను 200 లీ. నీటిలో కలిపి సాయంత్ర సమయంలో భూమి తేమగా ఉన్నప్పుడు చల్లుకోవాలి.(వీలయితే వేపాకు కొమ్మతో చల్లాలి) **లేక,**

50 కిలోల పేడ లేక 50 కిలోల తడి మట్టిలో ఒక కిలో ట్రయికోడర్మాను సాయంత్ర సమయంలో భూమి తడిగా ఉన్నప్పుడు ఒక ఎకరం భూమిపై చల్లుకోవాలి. **లేక,**

ఎకరానికి ఒక కిలో ట్రయికోడర్మాను 200 లీ. నీటిలో కలిపి సాయంత్రపు సమయంలో (ఎండ తక్కువగా ఉన్నప్పుడు) పంటపై చల్లుకోవాలి. **లేక,**

200 గ్రాముల వాయువిడింగ్‌ను పొడి చేసి, 3 లీ. గోమూత్రమును, 200 లీ. నీటిలో కలిపి రెండు రోజుల పాటు తొట్టిలో నానబెట్టి, తొట్టి మూతిని దళసరి బట్టతో కట్టాలి. రోజుకు రెండు సార్లు ఈ మిశ్రమాన్ని కట్టెతో గడియారపు ముల్లు తిరిగే దిశలో కలపాలి. దీనిని వడపోసి చల్లుకోవాలి. **లేక,**

5 లీ. దేశీ ఆవు మజ్జిగను రెండు రోజుల పాటు రాగి పాత్రలో ( పుల్లగా అయ్యేందుకు) పెట్టి 200 లీ. నీటితో పాటు 10 గ్రాములు ఇంగువ, 100 గ్రాములు పసుపు కల్పి పంటలపై స్ప్రే చేసుకోవాలి.

**6. బూజుల (ఫంగస్‌ల) రకాలు మరియు వాటి నివారణోపాయాలు**

**అ) కరపా (ఆకులు కాలినట్లు అవుట) నివారణ :**

**1)** సూర్యోదయానికి ముందుగా ఏ వైపు నుండి గాలి వీస్తుందో ఆ వైపు దేశీ ఆవు పేడ పిడకలను కాల్చి, పొగ పెట్టాలి. తర్వాత చల్లారిన బూడిదను పంటలపై చల్లాలి.

**2)** 5 లీ. దేశీ ఆవు మజ్జిగను రెండు రోజుల పాటు రాగి పాత్రలో ఉంచి 200 లీ. నీటితో పాటుగా 100 గ్రాముల ఇంగువ, 100 గ్రాములు పసుపు కలిపి పంటలపై చల్లాలి.

**ఆ) ఎఱ్ఱ తాంబ్రం (తాంబేరా) నివారణ :-**

వరి, సోయాబీన్, గోధుమ, పంటలలో వచ్చు రోగము.

**1)** 100 మి. లీ వేప నూనె, 100మి.లీ. గానుగ నూనె, 100 మి.లీ గోమూత్రము, 10మి.లీ స్టీకర్ (ఎబ్సా-80, ఆమ్‌వే, 20 గ్రా॥ సబ్బు పొడి) 15 లీ. నీరు కల్పి చల్లుకోవాలి. **లేక,**

**2)** కరపా నివారణకు సంబంధించిన బి ఫార్ములాను ప్రయోగించవలెను.

**ఇ) భూరి మరియు డౌనీ మిల్డ్యు నివారణ :**

**1)** దేశీ బొప్పాయి ఆకులు 2 కిలోలు, మునగ ఆకులు 2 కిలోలు, 4 లీ. గోమూత్రమును,

200 లీటర్ల నీటిలో కలిపి 3 రోజుల పాటు తోట్టిలో కుళ్ళునట్లు చేయాలి. ఈ తొట్టి పై భాగాన్ని మందమైన బట్టతో కట్టాలి. ఈ మిశ్రమాన్ని రోజుకు రెండు మార్లు కర్రతో గడియారం ముల్లు తిరిగే దిశలో బాగా కలపాలి. దీనిని వడపోసి స్ప్రే చేయాలి. **లేక,**

**2)** కరపా నివారణా బి ఫార్ములాను ప్రయోగించవచ్చు.

## 7. తెల్ల చెదలు నిర్మూలన (లట్, హుమిని) :-

**అ**) ఒక కిలో వసను నూరి పౌడర్‌గా చేసి, 6 లీటర్ల నీటిలో కలిపి, దానిని 3 లీటర్లుగా అయ్యే వరకు మరగబెట్టాలి. ఈ మిశ్రమము చల్లగా అయిన తర్వాత 500 గ్రాములు ఇంగువ, 200 లీటర్ల నీటిని కలిపి, ఒక ఎకరం భూమిలో తడిగానున్నప్పుడు లేక సాగునీటితో పాటు చల్లుకోవాలి. **లేక,**

**ఆ)** ఒక కిలో పచ్చిగా నున్న పత్తి కొమ్మలను చిన్న చిన్న ముక్కలుగా చేసి 6 లీటర్ల నీటిలో కలిపి దానిని 3 లీటర్లుగా అయ్యే వరకు మరగబెట్టాలి. ఈ మిశ్రమము చల్లగా అయిన తర్వాత 200 లీటర్ల నీటిని కలిపి ఒక ఎకరం భూమిలో తడిగానున్నప్పుడు లేక సాగునీటితో పాటు చల్లుకోవాలి. **లేక,**

**ఇ)** ఒక కిలో మెటరీజియమ్ ఎనీసోపలీయి 1.0 % కరిగే చూర్ణమును ఒక ఎకరం భూమిలో 50 కిలోల మట్టితో లేక పేడతో కలిపి భూమి తడిగానున్నప్పుడు సాయంత్ర సమయంలో చల్లుకోవాలి. లేక 100 లీటర్ల నీటిలో కలిపి సాయంత్ర సమయంలో భూమి తడిగానున్నప్పుడు చల్లుకోవాలి.

## 8. పండ్ల సైజును పెంచుట :-

200 గ్రాముల పెద్ద గురిగింజ వేరు చూర్ణము, 200 గ్రాముల నువ్వులు నూరుకుని 5 లీటర్ల నీటిలో కలిపి ఆ నీరు 2 1/2 లీటర్లు అయ్యేవరకు మరగబెట్టాలి. ఈ మిశ్రమాన్ని చల్లార్చి 500 గ్రాములు బెల్లం మరియు 200 లీ. నీటిని కలిపి స్ప్రే చేసుకోవాలి.

# పంట పొలాలకు అనుకూలమైన వాతావరణము

పంట పైర్లకు తగిన అనుకూల వాతావరణాన్ని తయారుచేసేందుకు అనేక రకాలైన చెట్లు, మొక్కలు పెంచటం చాలా అవసరం. పూర్వం పొలం గట్లపై అనేక చెట్లు ఉండేవి. దీని కారణంగా వాతావరణం సంరక్షించబడుతూ ఉండేది. కాని, నేడు అనేక కారణాల వల్ల వృక్షాల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. దీనివల్ల ఉపయోగకారి కీటకాలు నశించిపోతున్నాయి, మట్టి నిస్సారంగా అవుతుంది. వర్షపు నీరు భూమిలోకి ఇంకిపోవడానికి వృక్షాలు చాలా ఉపకరిస్తాయి. చాలా వేగంతో వీచే గాలులను, వేడి గాలులను, వాతావరణంలోని తేమను గట్టు మీద ఉండే వృక్షాలు నియంత్రిస్తూ ఉంటాయి. కావున, అలాంటి మొక్కలను గట్లపై నాటుకోవాలి. పొలాల గట్లపై పశ్చిమ దిశలో వేప, కరివేప, ఆముదం, పత్తి, గానుగ, సీతాఫలం, మధుపర్ణిక, గిరిపుష్పి, మరువము, సబ్జా, అద్దాసరాము, మొ॥గు వృక్షాలను పెంచవలెను. దక్షిణ దిశలో అశోక చెట్లు (నాంజూలము), సరుగుడు, సిల్వర్ వోక్ వంటి వృక్షాలను పెంచాలి. పంట పొలాలలో ప్రతి 1000 చదరపు అడుగులలో ఒక తులసి మొక్క మరియు బంతి పూల మొక్కలను పెంచుట చాలా అవసరము.

**పొలాలలో వృక్షాలు, మొక్కల మహత్వము**

**1. వేప చెట్టు :–** ఇది 250 విధాలైన విషతుల్య రోగాలను అరికట్టును. దీని ద్వారా వాతావరణం కూడా పరిశుద్ధంగా అవుతుంది మరియు ఉపయోగకారి కీటకాలకు ఆశ్రయం కూడా లభిస్తుంది.

**2. సీతాఫలం చెట్టు :–** మిలీబగ్జ్ పేరుగల కీటకం ఈ చెట్టుపై వచ్చి వ్రాలుతుంది. దీనివల్ల దగ్గరలోని పంటపొలాలో ఈ కీటకం వ్యాపించదు.

**3. కరివేపాకు చెట్టు :–** పికిలి పిట్ట పక్షులు దీనిపై గూడు కట్టుకుంటాయి. ఈ పక్షి అనేక విధాలైన చీడ పురుగులను తింటుంది.

**4. బంతి పూల మొక్కలు :–** ఈ పూల మొక్కల వేర్ల కారణంగా నిమిటోడ్ (సూత్రక్రిమి)ని నిరోధిస్తుంది. లేడీ బర్డ్ బిటల్ అనే తుమ్మెదలు ఈ మొక్కలపై వాలుతాయి. ఇవి మిలీబగ్జ్ (మావా) కీటకాలను తింటాయి.

**5. తులసి మొక్క :–** వీటి ద్వారా ఓజోన్ వాయువు తయారవుతుంది. తెల్లని రంగులలో ఉండే మిడతలలో మగ మిడతలు (చిమ్మట పురుగులు) తులసి మొక్కపై వాలటం (కూర్చోవటం) ద్వారా అవి నపుంసకముగా మారుతాయి. ఈ మొక్కల వల్ల దోమలు కూడా పారిపోతాయి. తులసి మొక్కలో 27

రకాల ఆల్కలాయిడ్స్ ఉంటాయి. వీటి వల్ల భూమిలో కూడా బూజులు (ఫంగస్‌లు) నివారించబడును.

**6. గిరిపుష్పి ః–** ఇది గాలిలోని నత్రజనిని తయారుచేస్తుంది. ఈ మొక్క ఆకులను భూమిలో కల్పి సేద్యం చేసినచో భూమికి నత్రజని లభిస్తుంది.

**7. అలసి ః–** దీనిని పశువులకు మంచి మేతగా ఉపయోగిస్తారు. దీనిని పచ్చని ఎరువుగా కూడా ఉపయోగించవచ్చు.

**8. సబ్జా మరియు అద్దాసరాము ః–** ఇవి ఆయుర్వేద ఔషధ మొక్కలు. (అద్దాసరాము మొక్కల ఆకులను వానపాముల ఎరువు తయారుచేయుటలో ఉపయోగిస్తారు.)

**9.** వేప, సీతాఫలం, ఆముదం, గానుగ, పత్తి, మొ॥గు ఆకులతో దశపర్ణి కషాయం తయారవుతుంది. ఇది ఉత్తమ క్రిమి సంహారకం.

**10.** అశోక, సరుగుడు వంటి చెట్లు పెంచడం ద్వారా వేగంగా ప్రవహించే గాలి నుండి పంట పైర్లు సంరక్షించబడుతాయి.

# శాశ్వత యోగిక వ్యవసాయం గావించే రైతులకు సూచనలు మరియు నియమాలు

**సూచనలు:-**

1. **శాశ్వత యోగిక పంట పొలాలలో శివ పరమాత్మ ఝండా :-**

యోగిక పొలంలో పరమాత్మ ఝండాను తప్పకుండా ఎగురవేయాలి. ఒకటి – ఝండాను చూడగానే మనలో (చెడు)సంకల్పాలు మారతాయి, శ్రేష్ఠ భావనలు ఉత్పన్నమవుతాయి. రెండవది – ఝండాలోని ఎఱుపు, పసుపు వర్ణాల వల్ల పంట పైర్లలో ఎదుగుదల పెరుగుతుంది మరియు కీటకాలు నియంత్రించబడతాయి. వీచే గాలుల కారణంగా ఝండా రెపరెపలాడుతూ కదిలే సమయంలో సూర్య కిరణాలు ఎరుపు రంగుపై పడి పరావర్తనం చెందుతూ పంట పైర్లపై పడడం వలన పంట శక్తిశాలిగా అవుతుంది మరియు పంట వృద్ధి అవుతుంది. గ్రుడ్లను పెట్టే మిడతలను పసుపు రంగు ఆకర్షిస్తుంది. ఈ మిడతలు పసుపు రంగుపై వాలి గ్రుడ్లను పెడతాయి, ఈ గ్రుడ్ల నుండి లార్వాలు బయటకు వచ్చినప్పుడు వాటికి ఎలాంటి ఆహారము లభించక చనిపోతాయి. ఈ రకంగా కీటక నివారణ కూడా జరుగుతుంది. కాబట్టే ప్రతి 10,000 చదరపు అడుగులలో ఒక ఝండాను పంట పై భాగానికి 5 అడుగుల ఎత్తులో ఉండేట్లుగా ఎగురవేయాలి.

2. ' కృషితో నాస్తి దుర్భిక్షం, పురుషార్థంతోనే ప్రాలబ్ధం '. కాబట్టి ఎప్పుడు ఏ విషయంలోనూ అలసట చెంది నిరాశ పడకూడదు. నిశ్చయంతో ప్రయత్నం చేస్తే తప్పకుండా ప్రాప్తి లభిస్తుంది.
3. యోగిక వ్యవసాయం కొనసాగించే రైతులు పొలంలో నాగలి దున్నేటప్పటి నుండి తీసుకొని పంట చేతికొచ్చే వరకు అనగా పంట ఇంటికి చేరే వరకు క్రింద చెప్పిన విధంగా నడుచుకోవాలి.

అ) పొలంలో వేరు వేరు పనులు చేసేటప్పుడు రకరకాల సంకల్పాలు చేయాలి. దీని గురించి యోగ ప్రయోగ విధానంలో చెప్పడం జరిగింది.

ఆ) మంచి మంచి పాటలను రైతులు వినుటకై ప్రేరణనివ్వాలి. ఉదా॥కు కితనా సుందర్ కితనా విరాట్ హోగా రచనా కార్ ......., సబ్‌కా మాలిక్ ఏక్ హై......, భలే భలే అందాలు సృష్టించావు....., ఇలా మురిపించావు అదే ఆనందము.... అలాగే దేశభక్తి పాటలను వినవచ్చును. పంచ తత్వాలపై శ్రద్ధ పెడుతూ ఈ గాలి ఈ నేల ఈ ఊరు...... ఇలాంటి పాటలను లేక

సంగీతమును వింటూ పనులు చేసినట్లైయితే రైతులకు సంతోషం కలుగుతుంది మరియు పంటలపై, మొక్కలపై కూడా ఈ సంతోష ప్రభావం బాగా పడుతుంది, చెట్లు మొక్కలు సంతోషంతో ఊగుతుంటాయి.

**నియమాలు :-**

1. పంటలు పండించే రైతులలో వ్యసనాలు ఉండకూడదు. సారాయి, సిగరెట్, గుట్కా మరియే ఇతర మత్తు పదార్థాలను సేవించరాదు.
2. పవిత్రతా మహత్వాన్ని తెలుసుకుని బ్రహ్మచర్య పాలన చేయాలి.
3. శుద్ధ సాత్వికాహారిగా, శాఖాహారిగా ఉండాలి.
4. సదాలోచనలు చేయడానికి ప్రతిరోజు ఈశ్వరీయ మహావాక్యాలను(జ్ఞాన మురళి) అధ్యయనము లేక వినడం చేయాలి.
5. వ్యర్థమైన చెడు చింతనలు చేయకూడదు. వ్యర్థాన్ని సమర్థంగా, చెడు(నకారాత్మక) భావనలను మంచి (సకారాత్మకం)గా మార్చుకునే అలవాటును చేసుకోవాలి.
6. ఎవరితోనూ వైర విరోధ భావనలు పెట్టుకోరాదు.శుభకారి,శక్తిశాలీ భావనలతో సంపన్నంగా ఉండాలి.
7. ఈర్ష్య, ద్వేషము, అసూయ, అసహ్యము మొ॥వి ఉండకూడదు.
8. ఆత్మవిశ్వాసంతో, దృఢ సంకల్పధారి కావాలి.
9. ఏకాంత ప్రియులుగా, పరమాత్మ స్నేహిగా ఉండాలి.
10. అమృతవేళ మహత్వాన్ని తెలుసుకుని ఉదయమే లేచి ప్రతి రోజు యోగాభ్యాసం చేసే అలవాటు చేసుకోవాలి.
11. గోమాతకు సేవ చేయడంలో ప్రీతిని కల్గి ఉండాలి, దేశీ ఆవులను పోషిస్తూ గోమూత్రాన్ని, పేడను పంట పొలాలలో ఉపయోగించాలి.
12. రైతు సోదరీ సోదరులు పొలంలో పనిచేసే కూలీల (కర్మ చారుల)ను వ్యసన ముక్తులుగా చేయాలి. వీలైతే వారికి 7 రోజుల ఆధ్యాత్మిక రాజయోగ శిక్షణను ఇప్పించడం మంచిది.

# వివిధ పంటలలో శ్రద్ధ చూపవలసిన విషయాలు

## 1. జొన్న పంట :-

### భూమిని శక్తిశాలిగా తయారుచేయడానికి -

1. ఎకరానికి 6 టన్నులు పేడ లేక పచ్చి ఎరువును భూమిలో కలిపి విత్తనాలు విత్తుకోవడానికి సిద్ధంగా పెట్టుకోవాలి.
2. విత్తనాలు విత్తుకునే సమయంలో తర్వాత కూడా ప్రతి 20 రోజులకొకసారి 200లీ. జీవామృతాన్ని ఎకరం భూమిలో తేమగానున్నప్పుడు సాయంత్ర సమయంలో చల్లుకోవాలి లేక సాగునీటితో పాటు లేక డ్రిప్ ద్వారా వదలవచ్చు.
3. పంట వేసిన ఒక నెల తరువాత భూమి తడిగానున్నప్పుడు ఒక ఎకరానికి ఒక టన్ను వానపాముల ఎరువును భూమిలో కలపాలి. ఇది భూమి పోషక విలువలను పెంచుతుంది. స్థానిక వాతావరణాన్ని బట్టి ప్రయోగించాలి.

### మిశ్రమ పంటలు

1. ఖరీఫ్‌లో జొన్న పంటతోపాటు కంది,పెసలు, మినుములు వంటి పంటలను కలిపి పండిచడం అవసరం. ఎలాగంటే 6 వరసలు జొన్న తరువాత ఒక వరస కంది లేక రెండు వరసలు పెసలు మరియు మినుములు ఈ రకంగా కలిపి వేసుకోవచ్చు.
2. రబీ సీజన్‌లో జొన్నతో పాటు 10% ధనియాలు మిశ్రిత పంటగా విత్తుకోవచ్చు.

### విత్తన శుద్ధి

20 కిలోల విత్తనాలపై బీజామృతమును చల్లి తడిగా చేయాలి, అజొటోబ్యాక్టర్ లేక అజోస్పిరిలియమ్ సంశ్లేషిత బ్యాక్టీరియాలు 250 గ్రాములు మరియు 250 గ్రాములు పి.యస్.బి. బాక్టీరియాలను విత్తనాలపై పూతగా (లేయర్‌గా) పూసి నీడలో ఆరబెట్టాలి. 8-10 గంటలలోనే భూమి తేమగానున్నప్పుడు విత్తనాలను విత్తుకోవాలి.

### సశ్య సంరక్షణ

1. మొక్కల కాండాలపై, ఆకులపై వాలి రసాలను పీల్చే చీడ పురుగులు, లార్వాలు, మిలీబగ్జ్ కీటకాలు, కంకులలో లార్వాలు మొ॥వి కనిపించగానే, (వాటి ప్రభావం తక్కువయ్యే వరకు) వారానికి ఒకసారి లేక రెండు సార్లు **4%** గోమూత్రము, వేప కషాయం లేక దశపర్ణి కషాయములలో ఒకదానిని చల్లవలెను. మొదట గోమూత్రము రెండవసారి వేప కషాయం మూడవసారి దశపర్ణి

కషాయములను స్ప్రే చేయాలి. (ఈ మూడింటిని ప్రయోగిస్తే చాలా మంచిది, లేదంటే ఏదైనా ఒక మందును ప్రయోగించవచ్చు.)

2. టార్ఫుల్ రోగము – మొక్కలకు నీరు తక్కువైనప్పుడు దీని ప్రభావము అధికంగా కనిపిస్తుంది. దీని నివారణకై విత్తనాలపై బీజామృతంను చల్లి, 10% ధనియాలను మిశ్రమ పంటగా విత్తుకోవాలి.

## 2. సజ్జ పంటలు :–

### భూమిని సారవంతముగా తయారుచేసుకోవడానికి–

( జొన్న పంటకు భూమిని శక్తిశాలిగా చేసే విధానాన్నే అనుసరించాలి).

### మిశ్రమ పంటలు

సజ్జ పంటతో పాటుగా కంది, పెసలు, మినుములు లేక ఉలవలు వంటి పంటలను కలిపి పండిచడం అవసరం. 6 వరసలు సజ్జలు తర్వాత ఒక వరస కంది లేక 2 వరసలు పెసలు మినుములు లేక ఉలవలు ఈ రెండింటిలో ఏదో ఒకటిని మిశ్రమ పంటలుగా విత్తుకోవచ్చు.

### విత్తన శుద్ధి

10 లీటర్ల నీటిలో 2 కిలోల ఉప్పు కలిపి ఇందులో 10 కిలోల సజ్జ విత్తనాలను వేసి కలపాలి. నీటిపై తేలే విత్తనాలను తొలగించి వేరుచేయాలి. నీటిలో మునిగిన విత్తనాలను 2–3 సార్లు స్వచ్ఛమైన నీటితో కడిగి ఆరనివ్వాలి. ఈ విధముగా విత్తుకునేందుకు ఎన్ని విత్తనాలైతే కావాలో అన్నింటిని వేరుచేసుకొని ఇందులో 20 కిలోల విత్తనాలను బీజామృతములో నానబెట్టాలి. తరువాత అజొటోబ్యాక్టర్ లేక అజోస్పిరీలియమ్ 250 గ్రాములు, 250 గ్రాములు పి.యస్.బి సంశ్లేషిత బ్యాక్టీరియాలను ఒక లేయర్‌గా పూసి విత్తనాలను నీడలో ఆరబెట్టాలి. 8– 10 గంటలలోపలనే భూమి తడిగానున్నప్పుడు విత్తుకోవాలి.

### సశ్య సంరక్షణ

ఎలాంటి చీడలు లేక రోగాలు పంటలలో కనిపించినా ప్రతి 8–10 రోజులలో ఒకసారి మొదట వేప కషాయం రెండవసారి దశపర్ణి కషాయం, మూడోసారి 4% గోమూత్రము, ఈరకంగా చీడలు లేదా రోగాలు తక్కువయ్యే వరకు ప్రయోగించాలి.

## 3. మొక్కజొన్న పంట :–

### భూమిని శక్తిశాలిగా తయారుచేసుకోవడానికి–

( జొన్న పంటకు భూమిని శక్తిశాలిగా చేసే విధానాన్నే అనుసరించాలి).

**మిశ్రమ పంటలు**

1. ఖరీఫ్ సీజన్‌లో 2 వరసలు మొక్కజొన్న, రెండు వరసలు అలసందలు లేక సోయాబీన్‌లను మిశ్రమ పంటలుగా పండించడం అవసరం.
2. రబీ సీజన్‌లో మొక్కజొన్నలో అలసి (బిత్తు), కొత్తిమీర, మెంతిలాంటి పంటలను 10% మిశ్రమ పంటలుగా విత్తుకోవడం అవసరము.

**విత్తన శుద్ధి**

20 కిలోల విత్తనాలపై బీజామృతముతో తడిగా చేయాలి. తర్వాత అజొటోబ్యాక్టర్ లేక అజోస్పిరిలియమ్ సంశ్లేషిత బ్యాక్టీరియాలు 250 గ్రాములు, 250 గ్రాములు పి.యస్.బి. బ్యాక్టీరియాలను విత్తనాలపై పూతగా పూసి నీడలో ఆరనివ్వాలి. 8- 10 గంటల లోపలనే భూమి తేమగానున్నప్పుడు విత్తనాలను విత్తుకోవాలి.

**సశ్య సంరక్షణ**

కాండములపై, ఆకులపై కూర్చొని రసాన్ని పీల్చే కీటకాలు, లార్వాలు, మిలీబగ్జ్ మొ॥ వాటి నివారణ కోసం 4% గోమూత్రము, 5% వేప కషాయం లేక దశపర్ణి కషాయములను మార్చి మార్చి స్ప్రే చేయాలి.

**4. వేరుశనగ పంట :-**

**భూమిని సారవంతముగా తయారుచేసుకోవడానికి-**

( జొన్న పంటకు భూమిని శక్తిశాలిగా చేసే విధానాన్నే అనుసరించాలి)

**మిశ్రమ పంటలు**

వేరుశనగ పంటలో 2% ప్రొద్దు తిరుగుడు పూలను విత్తుకోవడం ద్వారా పర పరాగ సంపర్కము బాగా జరుగుతుంది మరియు అలసందలు 2% నుంచి 5% మిశ్రమ పంటగా విత్తుకోవడం వల్ల మిలీబగ్జ్ కీటకాలు అలసంద మొక్కలపై కూర్చొని ఉంటాయి, కాబట్టే వేరుశనగలో వ్యాపించదు.

* వేరుశనగతో పాటు పెసలు, మినుములు వంటి పంటలను మిశ్రమ పంటగా వేయకూడదు.

**విత్తన శుద్ధి**

20 కిలోల విత్తనాలను బీజామృతములో నానబెట్టాలి. మొదట 100 గ్రాముల ట్రైకోడర్మా బూజు నివారణ సంశ్లేషిత బ్యాక్టీరియాను తరువాత రైజోబియమ్ మరియు పి.యస్.బి. సంశ్లేషిత బ్యాక్టీరియాలను 250 గ్రాముల విత్తనాలపై పూతగా పూసి నీడలో ఆరబెట్టాలి. 8- 10 గంటలలోపలనే

భూమి తేమగానున్నప్పుడు విత్తనాలను విత్తుకోవాలి.

### సశ్య సంరక్షణ

1. రసాన్ని పీల్చే కీటకాలు, లార్వాలు, మిలీబగ్జ్ మొ॥ వాటి నివారణ కోసం 4% గోమూత్రము, వేప కషాయం లేక దశపర్ణి కషాయములను మార్చి మార్చి స్ప్రే చేయాలి.
2. టీకా (మచ్చలు పడుట), ఎర్ర తాంత్రం (ఆకులు రాలిపోవుట) రోగ నివారణకై 5% వేప కషాయం స్ప్రే చేయండి. వేప నూనె 100 మి.లీ. గానుగ నూనె 100మి.లీ, గోమూత్రము 100మి.లీ. వాషింగ్ పౌడర్ లేక 10 గ్రాముల బెల్లం , 15 లీటర్ల నీటిని కలిపి చల్లాలి.

## 5. సోయాబీన్ పంట ః-

### భూమిని సారవంతముగా తయారుచేసుకొనుటకై-

(జొన్న పంటకు భూమిని శక్తిశాలిగా చేసే విధానాన్నే అనుసరించాలి).

### మిశ్రమ పంటలు

సోయాబీన్‌తో పాటు 2% మొక్కజొన్న లేక జొన్నను మిశ్రమ పంటలుగా విత్తుకోవచ్చు.

### విత్తన శుద్ధి

20 కిలోల విత్తనాలను బీజామృతములో నానపెట్టాలి. మొదట ట్రైకోడర్మా బూజు నివారణ సంశ్లేషిత బ్యాక్టీరియా 100 గ్రాములు, తరువాత రైజోబియమ్, పి.యస్.బి. సంశ్లేషిత బ్యాక్టీరియాలను 250 గ్రాములు విత్తనాలపై పూతగా పూసి విత్తనాలను నీడలో ఆరబెట్టాలి. 8- 10 గంటల లోపలనే భూమి తేమగానున్నప్పుడు విత్తనాలను విత్తుకోవాలి.

### సశ్య సంరక్షణ

(దీని కోసం వేరుశనగ సంరక్షణ పద్ధతులనే అనుసరించాలి).

## 6. కంది పంటలు ః-

### భూమిని శక్తిశాలిగా తయారుచేసుకోవడానికి-

(జొన్న పంటకు భూమిని శక్తిశాలిగా చేసే విధానాన్నే అనుసరించాలి)

### మిశ్రమ పంటలు

రెండు వరసలు కంది మరియు 4 వరసలు జొన్న లేక వేరుశనగ లేక సోయాబీన్ లేక పెసలు లేక మినుములు వీటిలో ఏదోఒకటి కలిపి పండించడం అవసరం.

**విత్తన శుద్ధి**

20 కిలోల విత్తనాలను బీజామృతములో నానబెట్టాలి. తరువాత రైజోబియమ్ మరియు పి.యస్.బి. సంశ్లేషిత బ్యాక్టీరియాలను 250 గ్రాముల విత్తనాలపై పూతగా పూసి నీడలో ఆరబెట్టాలి. 8- 10 గంటల లోపలనే భూమి తేమగానున్నప్పుడు విత్తనాలను విత్తుకోవాలి.

**సశ్య సంరక్షణ**

1. లార్వాలు, సూత్రక్రిములు మరియు మర్ రోగ నివారణకై కందితో పాటు జొన్నను విత్తుకోవడం చాలా అవసరం.
2. పూలు, పిందెలు వెలువడే సమయంలో చీడల నిర్మూలన కోసం 4% గోమూత్రము లేక వేప కషాయం లేక దశపర్ణి కషాయాలను వారానికొకసారి మార్చి మార్చి స్ప్రే చేయాలి.
3. ఒక ఎకరం పంట భూమిలో 12 - 15 పొడుగాటి కర్రలను (టి ఆకారంలో) పాతాలి. వీటిపై పక్షులు కూర్చొని కీటకాలను తింటాయి.

**7. పెసలు, మినుముల పంటలు :-**

**భూమిని శక్తిశాలిగా తయారుచేసుకోవడానికి**

(జొన్న పంటకు భూమిని శక్తిశాలిగా చేసే విధానాన్నే అనుసరించాలి)

**మిశ్రమ పంటలు**

4 వరసలు పెసలు లేక మినుములు, ఒక వరస మొక్కజొన్న లేక జొన్న పంటలను పండించుకోవచ్చు.

**విత్తన శుద్ధి**

20 కిలోల విత్తనాలను బీజామృతములో నానబెట్టాలి తరువాత రైజోబియమ్ మరియు పి.యస్.బి. సంశ్లేషిత బ్యాక్టీరియాలను 250 గ్రాములు విత్తనాల పై పూతగా పూసి నీడలో ఆరబెట్టాలి. 8-10 గంటల లోపలనే భూమి తేమగానున్నప్పుడు విత్తనాలను విత్తుకోవాలి.

**సశ్య సంరక్షణ**

అన్ని రకాల కీటకాలకు, లార్వాల నివారణ కోసం 4% గోమూత్రము, 5% వేప
కషాయం లేక దశపర్ణి కషాయాలలో ఏదో ఒక దానిని స్ప్రే చేయాలి.

**8. శనగ పంట :-**

**భూమిని శక్తిశాలిగా తయారుచేయడానికి**

1. ఎకరానికి 6 టన్నుల పేడను భూమిలో కలిపి విత్తనాలు విత్తుకునేందుకు సిద్ధంగా పెట్టుకోవాలి.
2. విత్తనాలు విత్తుకునే సమయం మరియు నీరు పెట్టే సమయంలో 2 – 3 సార్లు 200లీ. జీవామృతాన్ని ఎకరం భూమిలో తేమగానున్నప్పుడు సాయంత్ర సమయంలో చల్లుకోవాలి లేక సాగునీటితో పాటు లేక డ్రిప్ పద్ధతిని కూడా వినియోగించుకోవచ్చు.
3. విత్తనాలు విత్తిన తర్వాత భూమి తడిగానున్నప్పుడు ఒక ఎకరానికి ఒక టన్ను వానపాముల ఎరువును చల్లుకోవాలి.

## మిశ్రమ పంటలు

1. శనగ పంటకు నలువైపులా 1 లేక 2 వరసలు మొక్కజొన్న వేసుకోవాలి. 6 వరసలు శనగ, 3 వరసలు అలసి మరియు ఒక వరస ధనియాలు వంటి పంటలను మిశ్రమ పంటలుగా వేయడం అవసరం.
2. మొక్కజొన్నపై ఉపయోగకారి కీటకాలు పెరుగుతాయి. కొత్తిమీరపై ట్రైకోగ్రామా పెరుగుతుంది, దీనితో కీటక నియంత్రణ మరియు తేనెటీగల సంఖ్య పెరిగి పరపరాగ సంపర్కము బాగా జరుగుతుంది. అలసి మొక్కలపై పక్షులు ఎక్కువుగా వచ్చి లార్వాలను తినేస్తాయి.

## విత్తన శుద్ధి

20 కిలోల విత్తనాలను బీజామృతములో నానబెట్టాలి. మొదట ట్రైకోడర్మ్ బూజు నివారణ సంశ్లేషిత బ్యాక్టీరియా 100 గ్రాములు, తరువాత రైజోబియమ్ మరియు పి.యస్.బి.సంశ్లేషిత బ్యాక్టీరియాలను 250 గ్రాముల విత్తనాలపై పూతగా పూసి విత్తనాలను నీడలో ఆరబట్టాలి. 8– 10 గంటల లోపలనే భూమి తేమగానున్నప్పుడు విత్తనాలను విత్తుకోవాలి.

## సశ్య సంరక్షణ

1. ఒక ఎకరం పంట భూమిలో 12 – 15 పొడుగాటి (T ఆకారంలో)కర్రలను పాతాలి. వీటిపై పక్షులు కూర్చొని కీటకాలను తినేస్తాయి.
2. లార్వాల నివారణ కోసం మొదటి వారంలో 4% గోమూత్రము, రెండవ వారంలో 5% వేప కషాయం, మూడవ వారంలో దశపర్ణి కషాయమును, తిరిగి 4% గోమూత్రమును చల్లుకోవాలి.

## 9. గోధుమ పంటలు :–

## భూమిని శక్తిశాలిగా తయారుచేసుకోవడానికి

( జొన్న పంటకు భూమిని శక్తిశాలిగా చేసే విధానాన్నే అనుసరించాలి)

### మిశ్రమ పంటలు

గోధుమతో పాటు ఆవాలు, రాజమా, పెద్ద అలసందలు 2-3 శాతము కలపడము అవసరము.

### విత్తన శుద్ధి

20 కిలోల విత్తనాలను బీజామృతములో నానబెట్టాలి. అజొటోబ్యాక్టర్ సంశ్లేషిత బ్యాక్టీరియా 250 గ్రాములు మరియు 250 గ్రాములు పి.యస్.బి. సంశ్లేషిత బ్యాక్టీరియాలను విత్తనాలపై పూతగా పూసి విత్తనాలను నీడలో ఆరబెట్టాలి. 8- 10 గంటల లోపలనే భూమి తేమగానున్నప్పుడు విత్తనాలను విత్తుకోవాలి.

### సశ్య సంరక్షణ

(ఇందులో కూడా వేరుశనగపంటలోని విధానాన్నే అనుసరించాలి).
ఇంకా దీనితో పాటు పంటలో గింజ ఎదుగే సమయంలో రెండు సార్లు 5% పులియబెట్టిన మజ్జిగను (రెండు రోజులు పాటు రాగి పాత్రలో ఉంచి) చల్లినచో గోధుమ గింజలో మెరుపు పెరుగుతుంది.

## 10. వరి పైర్లు :-

### భూమిని శక్తిశాలిగా తయారుచేసుకోవడానికి

(జొన్న పంటకు భూమిని శక్తిశాలిగా చేసే విధానాన్నే అనుసరించాలి).
దీనితోపాటు పంట ఒక నెలైన తర్వాత ఒక ఎకరానికి ఒక టన్ను వానపాముల ఎరువును మరియు 60 కిలోల పచ్చి రొట్టె ఎరువును కలుపుకోవాలి.

### మిశ్రమ పంటలు

వరి పైరుతో పాటు 5% రాగులు మరియు నువ్వులను మిశ్రమ పంటలుగా విత్తుకోవచ్చు.

### విత్తన శుద్ధి

10 లీటర్ల నీటిలో 300గ్రాములు ఉప్పును కలిపి ఇందులో 10 కిలోల వడ్లను వేసి కలపాలి. నీటిలో తేలుతూ వుండే వడ్లను తీసి పారవేయాలి. మునిగి వున్న వాటిని రెండు లేక మూడు సార్లు మంచి నీటిలో కడిగి ఆరబెట్టాలి. ఈ విధంగా విత్తుకోవటానికి కావలసిన విత్తనాలను వేరుచేసుకోవాలి. ఇందులోని 20 కిలోల విత్తనాలపై బీజామృతమును చల్లి తడిగా చేయాలి. తర్వాత పై నుండి 50 గ్రాములు ట్రైకోడర్మ్ తర్వాత అజొటోబ్యాక్టర్ 250 గ్రాములు మరియు 250 గ్రాములు పి.యస్.బి. సంశ్లేషిత బ్యాక్టీరియాలను విత్తనాలపై పూతగా పూసి నీడలో ఆరబెట్టాలి. 8- 10 గంటల లోపలనే భూమి తేమగానున్నప్పుడు విత్తనాలను విత్తుకోవాలి. ఒకవేళ వరినాట్లను నాటుకుంటే 5 లీటర్ల

బీజామృతములో 250 గ్రాముల అజొటోబ్యాక్టర్ మరియు 250 గ్రాములు పి.యస్.బి. సంశ్లేషిత బ్యాక్టీరియాలను కలిపి, వరినాట్ల వేర్లను 15 లేక 20 నిముషాల వరకు ముంచి ఉంచి తరువాతనే నాటుకోవాలి.

## సశ్య సంరక్షణ

1. రసాన్ని పీల్చే కీటకాల, లార్వాల నిర్మూలనకై 4% గోమూత్రము, 5% వేప కషాయం లేక దశపర్ణి కషాయములలో ఒకదానిని మార్చి మార్చి చల్లాలి.
2. మొక్కలు చనిపోతూ ఉంటే, ఎకారానికి ఒక కిలో ట్రైకోడర్మ్ ఫంగస్‌ను 200 లీటర్ల నీటిలో కలిపి విత్తనాలు విత్తుకున్న వెంటనే చల్లుకోవాలి లేక పంటల పైర్లపై చల్లుకోవాలి.
3. కరపా (ఆకు కాలినట్లుగా అయ్యే తెగులు) నివారణకై – దేశీ తుమ్మ చెట్టు లేత ఆకులు 200 గ్రాములును 2 లీటర్ల నీటిలో వేసి ఆ నీటిని ఒక లీటరు అయ్యేవరకు మరగబెట్టాలి. ఈ మిశ్రమాన్ని 200 లీటర్ల నీటిలో కలుపుకొని చల్లుకోవాలి లేక 5 లీటర్లు దేశీ ఆవు పచ్చి పాలు, 2 లీటర్ల గోమూత్రము లేక 2 లీటర్లు కొబ్బరి బోండ నీళ్ళను 200 లీటర్ల నీటితో కలిపి చల్లుకోవాలి.

## 11. పత్తి పంటలు :–

## భూమిని శక్తిశాలిగా తయారుచేసుకోవడానికి

(జొన్న పంటకు భూమిని శక్తిశాలిగా చేసే విధానాన్నే అనుసరించాలి)

## మిశ్రమ పంటలు

పత్తి పంటలో నలువైపులా మొక్కజొన్న ఒక వరస విత్తుకోవాలి. పత్తి మొక్కల వరసలోనే ఒక పత్తి మొక్క, ఒక మొక్కజొన్నను మిశ్రమముగా వేసుకోవాలి. రెండు వరసల పత్తి పంటకు మధ్యలో పెసలు, మినుములు లేక సోయాబీన్ వంటి పంటలను విత్తుకోవాలి. పత్తి పంటకు 8 వరసల తర్వాత ఒక వరస అలసందలు వేసుకోవాలి. ప్రతి 1000 చదరపు అడుగులలో ఒక బంతి పూల మొక్క మరియు తులసి మొక్కను నాటుకోవాలి.

## విత్తన శుద్ధి

20 కిలోల విత్తనాలపై బీజామృతమును చల్లి తడిగా చేయాలి. మొదట ట్రైకోడర్మ్ బూజు నివారణ సంశ్లేషిత బ్యాక్టీరియా 100 గ్రాములు, తరువాత అజొటోబ్యాక్టర్ మరియు పి.యస్.బి. సంశ్లేషిత బ్యాక్టీరియాలను 250 గ్రాములు విత్తనాలపై పూతగా (లేయర్‌గా) పూసి నీడలో ఆరబట్టాలి. 8–10 గంటల లోపలనే భూమి తేమగా ఉన్నప్పుడు విత్తనాలను విత్తుకోవాలి.

## సశ్య సంరక్షణ

1. రసాన్ని పీల్చే కీటకాల, లార్వాల నిర్మూలనకై వారానికి ఒకసారి 4% గోమూత్రము, 5% వేప కషాయం లేక దశపర్ణి కషాయములను మార్చి మార్చి చల్లాలి.
2. ఆకులపై మచ్చలు కనిపించినచో 25 గ్రాములు ట్రైకోడర్మా, 50 మి.లీ. పాలు 10 లీటర్ల నీటిలో కలిపి చల్లుకోవాలి.
3. మొక్కలు చనిపోతూ ఉంటే లేక వేర్లు కుళ్ళిపోతూ ఉంటే ఒక కిలో ట్రైకోడర్మా ఫంగస్‌ను 200 లీటర్ల నీటిలో కలిపి భూమి తడిగా ఉన్నప్పుడు లేక సాగు నీటితో పాటు చల్లుకోవాలి.
4. లిఫ్ మైనర్ – 15 లీ. నీరు, 250 మి.లీ. మజ్జిగ, 50 మి.లీ. నిమ్మరసం, 100గ్రాముల బెల్లం, 100 మి.లీ. చింతపండు రసం, 10 గ్రా॥లు ఇంగువ, 10 గ్రాముల కర్పూరమును కలిపి చల్లుకోవాలి.
5. కరపా నివారణకై – దేశీ తుమ్మ చెట్టు లేత ఆకులు 200 గ్రాములును 2 లీటర్ల నీటిలో వేసి ఒక లీటరు అయ్యేవరకు మరగబెట్టాలి. ఈ మిశ్రమాన్ని 100 లీటర్ల నీటిలో కలుపుకుని చల్లుకోవాలి.
   * 200 గ్రాములు వాయవిడింగ్‌ను నూరి 2 లీ. నీటిలో వేసి ఒక లీటరు అయ్యేవరకు మరగబెట్టాలి. 5 లీటర్లు పాలను మరగబెట్టి అందులో నుండి మీగడ తీసేసి, ఈ రెండింటి మిశ్రమాన్ని 200 లీటర్ల నీటితో కలిపి చల్లుకోవాలి.
   * సూర్యోదయానికి ముందుగా ఎటు వైపు నుండి గాలి వీస్తుందో ఆ దిశలో ఆవు పేడ పిడకలను కాల్చి పొగ బెట్టాలి. చల్లారిన తరువాత బూడిదను పంటలపై చల్లుకోవాలి.

## 12 చెఱకు పంట : –

### భూమిని శక్తిశాలిగా తయారుచేసుకోవడానికి –

1. ఎకరానికి 6 టన్నులు పేడ లేక ఎరువు మొక్కలను భూమిలో కలిపి విత్తనాలను నాటేందుకు సిద్ధంగా పెట్టుకోవాలి.
2. విత్తనాలు విత్తుకునే ముందుగా దుక్కిలో 60 కిలోల ధాన్యపు ఎరువును ఎకరం భూమిలో కలపాలి. తరువాత పంట 4 నెలలకు చేరుకున్న తరువాత వేర్లపై మట్టి కప్పేటప్పుడు 60 కిలోలు మరియు వర్షాకాలంలో (జూన్ నెలలో) 60 కిలోలు ధాన్యపు ఎరువును భూమిలో చల్లుకోవాలి.
3. పంట వేసిన 4 నెలల తర్వాత చెఱకు వేర్లపై మట్టిని కప్పే సమయంలో ఎకరం భూమిలో తేమగా ఉన్నప్పుడు ఒక టన్ను వానపాముల ఎరువును చల్లుకోవాలి.

4. విత్తనాలు విత్తుకునే సమయంలో 200లీ. జీవామృతమును ఎకరం భూమిలో తేమగా ఉన్నప్పుడు లేక సాగునీటితో పాటు లేక డ్రిప్ పద్ధతిలో చల్లుకోవచ్చును. ఈ విధంగా నెల కొకసారిగా సంవత్సరం పాటు చల్లుకోవాలి.
5. చెఱకును మట్టితో కప్పే సమయంలో మరియు జూన్ మాసంలో పై విధంగా రెండు సార్లు జీవామృతములో ఒక కిలో చొప్పున అజొటోబ్యాక్టర్, అజోస్పిరీలియమ్, పి.యస్.బి. సంశ్లేషిత బ్యాక్టీరియాలను కలిపి భూమి తడిగా ఉన్నప్పుడు లేక సాగునీటితోపాటు చల్లుకోవాలి.

**విత్తన శుద్ధి**

20 కిలోల విత్తనాలను 200 లీటర్ల బీజామృతములో ఒక కిలో ట్రైకోడర్మా, 2 కిలోలు అజొటోబ్యాక్టర్ మరియు 2 కిలోలు పి.యస్.బి. సంశ్లేషిత బ్యాక్టీరియాలను కలిపి ఇందులో అర్ధగంట వరకు విత్తనాలను ముంచి ఆతరువాత విత్తుకోవాలి.

**సశ్య సంరక్షణ**

1. రసాన్ని పీల్చే కీటకాల, లార్వాల నిర్మూలనకై వారానికి ఒకసారి 4% గోమూత్రము, 5% వేప కషాయం లేక దశపర్ణి కషాయములను మార్చి మార్చి చల్లాలి.
2. మిలీబగ్జ్ కీటకాల కోసం 30 గ్రాముల వర్టిసిలీయమ్ పౌడర్, 50 మి.లీ. పాలను 15 లీటర్ల నీటిలో కలిపి చల్లుకోవాలి.

**13. వంగ పంట :-**

**భూమిని శక్తిశాలిగా తయారుచేసుకోవడానికి**

1. ప్రతి ఎకరానికి 6 టన్నులు పేడ ఎరువును భూమిలో కలిపి సేద్యం చేసి విత్తనాలను నాటుకొనుటకు సిద్ధంగా పెట్టుకోవాలి.
2. మొక్కలు నాటిన 15 రోజుల నుండి మొక్కలకు దగ్గరగా అరఅడుగు దూరంలో ప్రతి మొక్కకు 50 గ్రాములు వానపాముల ఎరువును భూమి తడిగా ఉన్నప్పుడు కలుపుకోవాలి.
3. మొక్కలు నాటుకునేటప్పుడే 200 లీ. జీవామృతమును ఒక ఎకరం భూమిలో తడిగా ఉన్నప్పుడు సాయంత్ర సమయంలో లేక సాగునీటితో పాటుగా చల్లుకోవాలి. తరువాత ప్రతి 20 రోజుల గడువులో 200 లీటర్ల జీవామృతమును ప్రయోగించాలి.
4. మొక్కలు నాటేటప్పుడు, పూలు- కాయలు వెలువడిన సమయంలో, నాటిన మూడు నెలల తర్వాత ఈ విధంగా మూడు సార్లుగా నత్రజని, ఫాస్ఫరస్, పోటాషియంలు లభింపచేసే సంశ్లేషిత బ్యాక్టీరియాలను ఒక కిలో జీవామృతముతో కలిపి వదలాలి.

5. పూలు, కాయలు వెలువడే సమయంలో, నాటిన 3 నెలల తర్వాత ఈ విధంగా రెండు పర్యాయాలు 30 కిలోలు ధాన్యపు ఎరువును ఒక టన్ను వానపాముల ఎరువుతో పాటుగా భూమి తడిగా ఉన్నప్పుడు కలుపుకోవాలి.
6. 50 కిలోల వేప పొడిని నెలకొకసారి మొక్కలపై, భూమిలో చల్లుకోవాలి.

**మిశ్రమ పంటలు**

వంగ తోటకు చుట్టూ రెండు వరసలు మొక్కజొన్న, ఒక వరస అలసంద, 8 వరసలు వంగ, ఒక వరస బంతి పూల మొక్కలు, తిరిగి మళ్ళీ వంగ, ఈ విధంగా నాటుకోవాలి. ప్రతి 1,000 చదరపు అడుగులలో ఒక తులసి మొక్కను నాటాలి.

**విత్తన శుద్ధి**

1. 100 గ్రాముల విత్తనాలను బీజామృతములో నానబెట్టాలి. వీటిపై మొదట 2గ్రాములు ట్రైకోడర్మా, బూజు నివారణ సంశ్లేషిత బ్యాక్టీరియా, 2 గ్రాములు చొప్పున అజొటోబ్యాక్టర్ మరియు పి.యస్.బి. సంశ్లేషిత బ్యాక్టీరియాలను విత్తనాలపై పూతగా (లేయర్‌గా) పూసి విత్తుకోవాలి. ఆతరువాత పై నుండి ఒక లీటరు జీవామృతం నీటిలో కలిపి నాటాలి. మొక్కలు నాటే చోట పేడను, వానపాముల ఎరువును భూమిలో తప్పక కలుపుకోవాలి.
2. మొక్కలను నాటేందుకు ముందే 10 లీ. నీటిలో 40 గ్రాములు ట్రైకోడర్మ్, 500 లీ. వేప కషాయాన్ని కలిపి మొక్కల వేర్లను 3 గంటలు వరకు ఇందులో ముంచి పెట్టాలి. తరువాత వేర్లల్లో అజొటోబ్యాక్టర్, పి.యస్.బి. సంశ్లేషిత బ్యాక్టీరియాలను పూతగా పూసి నాటుకోవాలి.

**సశ్య సంరక్షణ**

1. విత్తనాలు మొలకెత్తిన తర్వాత 15 రోజులలో 3% గోమూత్రము లేక 5% వేప కషాయం చల్లుకోవాలి.
2. మొక్కల రసాన్ని పీల్చే కీటకాలు, మొక్కల కాండములపై మరియు వంకాయలలో వచ్చే పురుగుల నిర్మూలనకై 4% గోమూత్రము, 5% వేప కషాయము లేక దశపర్ణి కషాయమును ఒకదాని తర్వాత మరొకదానిని చల్లుకోవాలి.

## 14. క్యాలిఫ్లవర్ (కోసు పువ్వు) మరియు క్యాబేజి (కోసు గడ్డ) పంట :-

**భూమిని శక్తిశాలిగా చేయడానికి**

1. ప్రతి ఎకరానికి 6 టన్నుల పేడ ఎరువును భూమిలో కలిపి సేద్యం చేసి విత్తుకొనుటకు సిద్ధంగా

ఉంచుకోవాలి.

2. మొక్కలు నాటుకునేటప్పుడే మరియు ప్రతి 20 రోజుల తర్వాత 200 లీ. జీవామృతమును ఒక ఎకరం భూమిలో తడిగా ఉన్నప్పుడు సాయంత్ర సమయంలో లేక సాగునీటితో పాటుగా చల్లుకోవాలి.
3. మొక్కలు నాటిన నెల రోజుల తర్వాత భూమి తడిగా ఉన్నప్పుడు ఎకరం భూమిలో వానపాముల ఎరువును 60 కిలోలు ధాన్యపు ఎరువు, నత్రజని, ఫాస్ఫరస్ మరియు పొలస్ లభింప చేసే సంశ్లేషిత బ్యాక్టీరియాలను కలిపి భూమిలో వదలాలి.
4. వేప పిండి 50 కిలోలు నెలకొకసారి పంటపై నుండి భూమిపై చల్లుకోవాలి. దీనవల్ల అనేక విధాలైన కీటకాలు మరియు బూజులు వంటి రోగాలు నిరోధించబడతాయి.

## మిశ్రమ పంటలు

పంట చుట్టూ రెండు వరసలలో మొక్కజొన్న, ఒక వరస అలసంద, 20 వరసలు కోసుగడ్డ, ఒక వరస ఆవాలు, 20 వరసలు కోసుగడ్డ లేక కోసుపువ్వు, ఇలా మిశ్రమ పంటలుగా విత్తుకోవాలి. 20 వరసలు కోసు గడ్డలో 2% మొక్కజొన్న మరియు ప్రతి వెయ్యి చదరపు అడుగులలో ఒక బంతి పూల మొక్క మరియు ఒక తులసి మొక్కను నాటుకోవాలి.

## విత్తన శుద్ధి

1. 100 గ్రాముల విత్తనాలను బీజామృతములో నానబట్టాలి. వీటిపై మొదట 2 గ్రాముల ట్రైకోడర్మా, బూజు నివారణ సంశ్లేషిత బ్యాక్టీరియా, 2 గ్రాములు చొప్పున అజొటోబ్యాక్టర్ మరియు పి.యస్.బి. సంశ్లేషిత బ్యాక్టీరియాలను విత్తనాలపై పూతగా (లేయర్‌గా) పూసి విత్తుకోవాలి. మొక్కలు నాటే చోట పేడ, వానపాముల ఎరువును తప్పక కలపాలి. విత్తనాలను నాటిన తర్వాత ఒక లీటరు జీవామృతాన్ని సాగునీటితో పాటు వదలాలి.
2. మొక్కలను నాటుటకు ముందే 2 లీ. బీజామృతములో 50గ్రాములు ట్రైకోడర్మా, 250 గ్రాములు అజొటోబ్యాక్టర్, 250 గ్రాములు పి.యస్.బి. సంశ్లేషిత బ్యాక్టీరియాలను కలిపి, ఇందులో మొక్కల వేర్లను 15 నిమిషాల వరకు ముంచి తర్వాత నాటుకోవాలి.

## సశ్య సంరక్షణ

1. మొక్కలు చిన్నవిగా ఉన్నప్పుడు 3% గోమూత్రము, 5% వేప కషాయం స్ప్రే చేసుకోవాలి.
2. మొక్కల రసాలను పీల్చే చీడలు లేదా లార్వాల నియంత్రణ కోసం 4% గోమూత్రము, 5% వేప కషాయం లేక దశపర్ణి కషాయమును ఒకటి మార్చి మరొకదానిని చల్లాలి. చీడల ప్రభావం

ఎక్కువగా కనిపిస్తే 30 గ్రా॥లు వర్టీసిలీయమ్ పొడిని, 50 మి.లీ. పాలు 15 లీటర్ల నీటిలో కలిపి స్ప్రే చేసుకోవాలి.

3. ఎకరం భూమిలో 12–15 కర్రలను (T ఆకారంలో) పాతాలి, వీటిపై పక్షులు కూర్చొని పంటల లోని చీడలను తినటం వల్ల కీటకాల నియంత్రణ జరుగుతుంది.

## 15. మిరప పంటలు :–

### భూమిని శక్తిశాలిగా చేయడానికి

1. ప్రతి ఎకరానికి 6 టన్నులు పేడ ఎరువును లేక ఎరువు మొక్కలను భూమిలో కలిపి సేద్యం చేసి విత్తుకునుటకు సిద్ధంగా ఉంచుకోవాలి.
2. మొక్కలు నాటుకునేటప్పుడు మరియు ప్రతి 20 రోజుల తర్వాత 200 లీ. జీవామృతమును ఒక ఎకరం భూమిలో తడిగా ఉన్నప్పుడు సాయంత్ర సమయంలో లేక సాగునీటితో పాటుగా చల్లుకోవాలి.
3. పూలు, కాయలు వెలువడే సమయంలో ఒక ఎకరం భూమిలో ఒక టన్ను వానపాముల ఎరువును మరియు 60 కిలోల ధాన్యపు ఎరువును మరియు ఒక కిలో చొప్పున ట్రైకోడర్మా, అజొటోబాక్టర్, పి.యస్.బి. సంశ్లేషిత బ్యాక్టీరియాలను కలిపి ఈ విధంగా భూమి తడిగా ఉన్నప్పుడు కలుపుకోవాలి.
4. వేప పిండి 50 కిలోలు ఒక ఎకరం పంట మొక్కలలో చల్లుకోవాలి.

దీనివల్ల అనేక విధాలైన కీటకాలు మరియు బూజులు వంటి రోగాలు నిరోధించబడతాయి.

### మిశ్రమ పంటలు

1. పంట నలువైపులా రెండు వరసలు మొక్కజొన్న, ఒక వరస నూవ్వులు, 10 వరసలు మిరప, ఒక వరస బంతి పూలు, తిరిగి మిరప.... ఈ విధంగా విత్తుకోవాలి.
2. ప్రతి వెయ్యి చదరపు అడుగులలో ఒక తులసి మొక్క మరియు సోంపు మొక్క (శతపుష్పము)లను నాటుకోవాలి.

* మొక్కజొన్న మరియు నువ్వుల మొక్కలు నాటడం వల్ల ఆకుల ఒరవడి (బిగువు) తగ్గుతుంది.
* బంతి పువ్వు మొక్కల వల్ల సూత్రక్రిములు నిరోధించబడుతాయి.
* పెద్ద సోంపుపై తేనెటీగలు వచ్చి వాలును, దీనివల్ల పరపరాగ సంపర్కము సహజంగా జరుగును.
* తులసిలో 27 రకాల ఆల్కలాయిడ్స్ ఉంటాయి, వీటి వల్ల మిరప మొక్కల వేర్లు కుళ్ళుట మరియు మొక్కలు చనిపోవుట వంటివి సమాప్తమవుతాయి. దీని ద్వారా ఓజోన్ వాయువు తయరవుతుంది.

### విత్తన శుద్ధి

1. 100 గ్రాముల విత్తనాలను బీజామృతములో నానపెట్టాలి. వీటిపై మొదట 1 గ్రాము ట్రైకోడర్మా, 2 గ్రాములు చొప్పున అజొటోబ్యాక్టర్ మరియు పి.యస్.బి. సంశ్లేషిత బ్యాక్టీరియాలను విత్తనాలపై పూతగా (లేయర్‌గా) పూసి విత్తుకోవాలి. మొక్కలు నాటే చోట పేడ మరియు వానపాముల ఎరువులను భూమిలో తప్పక కలుపుకోవాలి. తరువాత ఒక లీటరు జీవామృతమును సాగునీటితో పాటు లేక తర్వాత చల్లుకోవాలి.
2. మొక్కలను నాటుటకు ముందే 2 లీ. బీజామృతములో 50గ్రాములు ట్రైకోడర్మా, 250 గ్రాములు అజొటోబ్యాక్టర్, 250 గ్రాములు పి.యస్.బి. సంశ్లేషిత బ్యాక్టీరియాలను కలిపి, ఇందులో మొక్కల వేర్లను 30 నిమిషాల వరకు ముంచి తర్వాత నాటుకోవాలి.

## సశ్య సంరక్షణ

1. విత్తనాలు అంకురించిన 8 రోజుల తర్వాత 3% గోమూత్రము, 5% వేప కషాయం మొక్కలపై చల్లుకోవాలి.
2. రసాలను పీల్చే కీటకాలు, మొక్క ఆకులను కలిపివేసే కీటకాల నియంత్రణకై 4% గోమూత్రము, 5% వేప కషాయం లేక దశపర్ణి కషాయములను మార్చి మార్చి మొక్కలపై చల్లుకోవాలి.
3. ఆకులు కలిసిపోవుట – దీని నివారణ కోసం 5 లీటర్ల దేశీ ఆవు మజ్జిగను రెండు రోజుల పాటు (రాగి పాత్రలో) పెట్టి పులియబెట్టి 200 గ్రాములు వర్టిసిలీయమ్, 100 లీటర్ల నీటిలో కలిపి స్ప్రే చేయాలి.

## 16. టమోటా :–

### భూమిని శక్తిశాలిగా చేయడానికి

1. ప్రతి ఎకరానికి 6 టన్నుల పేడ ఎరువును లేక ఎరువు మొక్కలను భూమిలో కలిపి సేద్యం చేసి విత్తుకొనుటకు సిద్ధంగా పెట్టుకోవాలి.
2. మొక్కలు నాటుకునేటప్పుడు మరియు ప్రతి 20 రోజుల తర్వాత 200 లీ. జీవామృతమును ఒక ఎకరం భూమిలో తడిగా ఉన్నప్పుడు సాయంత్ర సమయంలో లేక సాగునీటితో పాటుగా చల్లుకోవాలి.
3. పూలు, కాయలు వెలువడే సమయంలో ఒక టన్ను వానపాముల ఎరువు మరియు 60 కిలోలు ధాన్యపు ఎరువును మరియు ఒక కిలో చొప్పున ట్రైకోడర్మా, నత్రజని– ఫాస్ఫరస్– పోటాషియమ్‌లు లభింపచేసే సంశ్లేషిత బ్యాక్టీరియాలను కలిపి, భూమి తడిగా ఉన్నప్పుడు కలుపుకోవాలి.
4. వేప పిండి 50 కిలోలు నెలకొకసారి పంట మొక్కలలో చల్లుకోవాలి.

## మిశ్రమ పంటలు

1. పంట నలువైపులా ఒక వరస మొక్కజొన్న, ఒక వరస అలసంద, 15 వరసలు టమాటా తిరిగి ఒక వరస అలసంద, ఒక వరస బంతి పూలు, ఈ విధంగా విత్తుకోవాలి.
2. 15 వరసల టమాటోలో 2% మొక్కజొన్న తప్పక విత్తుకోవాలి. వెయ్యి చదరపు అడుగులలో ఒక తులసి మొక్కను తప్పనిసరిగా నాటుకోవాలి.

## విత్తన శుద్ధి

1. విత్తనాలను బట్టలో కట్టి ఒక రాత్రంతా గోమూత్రములో నానబెట్టాలి. వీటిని ఆరబెట్టి తర్వాత బీజామృతమును చల్లాలి. వీటిపై మొదట 100 గ్రాముల విత్తనాలకు 2 గ్రాముల చొప్పున ట్రైకోడర్మ్, అజొటోబాక్టర్ మరియు పి.యస్.బి. సంశ్లేషిత బ్యాక్టీరియాలను విత్తనాలపై పూతగా (లేయర్‌గా) పూసి విత్తుకోవాలి. మొక్కలు నాటే చోట పేడ మరియు వానపాముల ఎరువును, వేప పిండిని తప్పక కలుపుకోవాలి.
2. మొక్కలను నాటుటకు ముందే 2 లీ. బీజామృతములో 50గ్రాములు ట్రైకోడర్మా , 250 గ్రాములు అజోటోబాక్టర్, 250 గ్రాములు పి.యస్.బి. సంశ్లేషిత బ్యాక్టీరియాలను కలిపి, ఇందులో మొక్కల వేర్లను 30 నిమిషాల వరకు ముంచి తర్వాత నాటుకోవాలి.

## సశ్య సంరక్షణ

1. రసాలను పీల్చే కీటకాలు, లార్వాల నియంత్రణకై 4% గోమూత్రము, 5% వేప కషాయం లేక దశపర్ణి కషాయములను మార్చి మార్చి మొక్కలపై చల్లుకోవాలి. ఒకే సమయంలో కేవలం ఒక్క దానిని మాత్రమే చల్లుకోవాలి.
2. ఎకరం భూమిలో 12-15 కర్రలను (T ఆకారంలో) పాతాలి, వీటిపై పక్షులు కూర్చొని పంటలలోని చీడలను తినడం వలన కీటకాల నియంత్రణ జరుగుతుంది.
3. కీటకాల ప్రభావం అధికంగా కనిపిస్తే 30 గ్రాములు వర్టిసిలీయమ్ పౌడర్, 50 మి.లీ. పాలు 15 లీటర్ల నీటిలో కలిపి స్ప్రే చేయాలి.
4. లీఫ్ మైనర్ నివారణకై - 15 లీటర్ల నీటిలో 250 మి.లీ. మజ్జిగ, 10 గ్రాముల ఇంగువ, 50 గ్రాములు నిమ్మ రసం, 100 గ్రా॥లు బెల్లం, 100 మి.లీ. చింతపండు రసం, 10గ్రా॥లు కర్పూరము కలిపి చల్లుకోవాలి.
5. కరపా (ఆకులు కాలినట్లుగా అయిపోవడం) నివారణకై -

* దేశీ తుమ్మ చెట్టు లేత ఆకులు 200 గ్రాములును 2 లీటర్ల నీటిలో వేసి ఒక లీటరుగా అయ్యేవరకు మరగబెట్టాలి. ఈ మిశ్రమాన్ని 200 లీటర్ల నీటిలో కలుపుకుని చల్లుకోవాలి. **లేక,**
* 200 గ్రాములు వాయవిడింగ్‌ను నూరి 2 లీ. నీటిలో వేసి ఒక లీటరు అయ్యే వరకు మరగబెట్టాలి. 5 లీటర్లు పాలను మరగబెట్టి అందులో నుండి మీగడ తీసి 200 లీటర్ల నీటితో కలిపి చల్లుకోవాలి. **లేక,**
* సూర్యోదయానికి ముందుగా ఎటు వైపు నుండి గాలి వీస్తుందో ఆ దిశలో ఆవు పేడ పిడకలను కాల్చి పొగ బెట్టాలి. చల్లారిన పిదప బూడిదను పంటలపై చల్లుకోవాలి.

## 17. కీరకాయ, కాకరకాయ, బీరకాయ మరియు సొరకాయ, గుమ్మడికాయ పంటలు భూమిని శక్తిశాలిగా చేయడానికి

1. ప్రతి ఎకరానికి 6 టన్నుల పేడ ఎరువును లేక ఎరువు మొక్కలను భూమిలో కలిపి సేద్యం చేసి విత్తుకొనుటకు సిద్ధంగా ఉంచుకోవాలి.
2. మొక్కలు నాటుకునేటప్పుడు మరియు ప్రతి 20 రోజుల తర్వాత 200 లీ. జీవామృతమును ఒక ఎకరం భూమిలో తడిగా ఉన్నప్పుడు సాయంత్ర సమయంలో చల్లుకోవాలి లేక సాగునీటితో పాటుగా వదులుకోవాలి.
3. పూలు, కాయలు వెలువడే సమయంలో ఒక టన్ను వానపాముల ఎరువు మరియు 60 కిలోలు ధాన్యపు ఎరువును మరియు ఒక కిలో చొప్పున ట్రైకోడర్మ్, నత్రజని- ఫాస్ఫరస్- పోటాషియంలు లభింపచేసే సంశ్లేషిత బ్యాక్టీరియాలను కలిపి, భూమి తడిగా ఉన్నప్పుడు కలుపుకోవాలి.

### మిశ్రమ పంటలు

1. పంట నలువైపులా ఒక వరస మొక్కజొన్న, ఒక వరస అలసంద, 5% మొక్కజొన్న కలిపి విత్తుకోవాలి.
2. వెయ్యి చదరపు అడుగులలో ఒక తులసి మొక్క మరియు బంతి పూల మొక్కను తప్పనిసరిగా నాటుకోవడం కూడా అవసరము.

### విత్తన శుద్ధి

100 గ్రాముల విత్తనాలను బీజామృతములో నానబెట్టి, మొదట 2 గ్రాములు ట్రైకోడర్మా, తర్వాత 5 గ్రాములు చొప్పున అజొటోబ్యాక్టర్ మరియు పి.యస్.బి. సంశ్లేషిత బ్యాక్టీరియాలను విత్తనాలపై పూతగా (లేయర్‌గా) పూసి నీడలో ఆరబెట్టి 8-10 గంటల లోపు భూమి తడిగా ఉన్నప్పుడు విత్తుకోవాలి.

**సశ్య సంరక్షణ**

1. రసాలను పీల్చే కీటకాలు, లార్వాల నియంత్రణకై ప్రారంభిక వారంలోనే ఒకసారి 4% గోమూత్రము, రెండవ వారంలో 5% వేప కషాయం, మూడవ వారంలో దశపర్ణి కషాయములను మార్చి మార్చి మొక్కలపై చల్లుకోవాలి.
2. కీటకాల ప్రభావం అధికంగా కనిపిస్తే 30 గ్రాములు వర్టీసిలీయమ్ పౌడర్, 50 మి.లీ. పాలు 15 లీటర్ల నీటిలో కలిపి స్ప్రే చేయాలి.
3. లిఫ్ మైనర్ – 15 లీటర్లు నీటిలో 250 మి.లీ. మజ్జిగ, 10 గ్రాములు ఇంగువ, 50 గ్రాములు నిమ్మ రసం, 100 గ్రా॥లు బెల్లం, 100 మి.లీ. చింతపండు రసం, 10గ్రా॥లు కర్పూరము కలిపి చల్లుకోవాలి.
4. కరపా (ఆకులు కాలిపోయినట్లుగా అవ్వడం) నివారణకై –

* దేశీ తుమ్మ చెట్టు లేత ఆకులు 200 గ్రాములును 2 లీటర్ల నీటిలో వేసి ఒక లీటరు అయ్యేవరకు మరగబెట్టాలి. ఈ మిశ్రమాన్ని 200 లీటర్ల నీటిలో కలుపుకొని చల్లుకోవాలి. **లేక,**
* 200 గ్రాములు వాయవిడింగ్‌ను నూరి 2 లీ. నీటిలో వేసి ఒక లీటరు అయ్యేవరకు మరగబెట్టాలి. 5 లీటర్లు పాలను మరగబెట్టి అందులో నుండి మీగడ తీసి 200 లీటర్ల నీటితో కలిపి చల్లుకోవాలి. **లేక,**
* సూర్యోదయానికి ముందుగా ఎటు వైపు నుండి గాలి వీస్తుందో ఆ దిశలో ఆవు పేడ పిడకలను కాల్చి పొగ బెట్టాలి. చల్లారిన తర్వాత బూడిదను పంటలపై చల్లుకోవాలి.

**18 అరటి తోటలు :–**

**భూమిని సారవంతముగా చేయుటకై**

1. ప్రతి ఎకరానికి 10టన్నుల పేడ ఎరువును భూమిలో కలిపి సేద్యం చేసి పంట సాగుకై సిద్ధంగా ఉంచుకోవాలి.
2. అరటి పిలకలను నాటిన తర్వాత ఎరువు మొక్కలను భూమిపై పరచినట్లుగా చేయాలి లేక భూమిలో పాతి పెట్టాలి.
3. పిలకలు నాటిన ఒక నెల తర్వాత ఒక టన్ను వానపాముల ఎరువు మరియు 60 కిలోల ధాన్యపు ఎరువును భూమి తడిగా ఉన్నప్పుడు కలుపుకోవాలి.
4. నెలకు ఒకసారి 200 లీ. జీవామృతమును ఒక ఎకరం భూమిలో తడిగా ఉన్నప్పుడు సాయంత్ర సమయంలో లేక సాగునీటితో పాటుగా చల్లుకోవాలి.

## మిశ్రమ పంటలు

1. పంటల నలువైపులా అవిసె (శేవరి) వంటి చెట్లను ఒక గోడ వలె పెంచాలి.
2. పంట మధ్య మధ్యలో 5% మునగ చెట్లను పెంచాలి.

## విత్తన శుద్ధి

అరటి పిలకలను నాటుటకు ముందుగా గుంట త్రవ్వాలి. తర్వాత 200 లీటర్ల బీజామృతములో ఒక కిలో ట్రైకోడర్మా , 2 కిలోల చొప్పున అజొటోబ్యాక్టర్ మరియు పి.యస్.బి. సంశ్లేషిత బ్యాక్టీరియాలను కలిపి, ఇందులో అరటి పిలకల వేర్లను ముంచి ఉంచాలి మరియు గుంటలో కూడా 250 మి.లీ. ఈ మిశ్రమాన్ని వేసి నాటుకోవాలి.

## సశ్య సంరక్షణ

1. కరపా (ఆకులు కాలినట్లుగా అవ్వడము) నివారణకై – దేశీ తుమ్మ చెట్టు లేత ఆకులు 200 గ్రాములును 2 లీటర్ల నీటిలో వేసి ఒక లీటరు అయ్యేవరకు మరగబెట్టాలి. ఈ మిశ్రమాన్ని 200 లీటర్ల నీటిలో కలుపుకుని చల్లుకోవాలి.
2. 5 లీటర్ల పాలను మరగబెట్టి అందులో నుండి మీగడ తీయాలి. 200 గ్రాములు వాయవిడంగ్‌ను నూరి 2 లీ. నీటిలో వేసి ఒక లీటరు అయ్యేవరకు మరగబెట్టాలి. ఈ రెండు మిశ్రమాలను 200 లీటర్ల నీటిలో కలిపి చల్లుకోవాలి.
3. సూర్యోదయానికి ముందుగా ఎటు వైపు నుండి గాలి వీస్తుందో ఆ దిశలో ఆవు పేడ పిడకలను కాల్చి పొగ బెట్టాలి. చల్లారిన తర్వాత బూడిదను పంటలపై చల్లుకోవాలి.

**యోగిక వ్యవసాయం ద్వారా వి భిన్న రకాల పంటల ఉత్పాదనలు (దిగుబడులు)**

నాగేశ్ విట్టల్ కులకర్ణి,
సాఖరాలె, తాలూకా – వాలవా, జిల్లా – సాంగలీ
పంట భూమి : 1.5 ఎకరం, సోయాబీన్
ఉత్పాదన (దిగుబడి): 23 క్వింటాళ్ళు,
కృషి వ్యయం ః 2500 రూ॥లు

పాండురంగ్ సుదామా పాటిల్,
తాలూకా : వాలవా, జిల్లా – సాంగ్లీ
పంట భూమి: 22,000 చదరపు అడుగులు, గెనుసు గడ్డ
ఉత్పాదన (దిగుబడి) : 7 మెట్రిక్ టన్నులు,
కృషి వ్యయం ః 5000 రూ॥లు

భోలానాథ్ శివలింగ చౌగులే, టాకవడె,
తాలూకా : శిరోల్, జిల్లా – కోల్హాపూర్,
పంట భూమి : ఒక ఎకరం, చెఱకు,
ఉత్పాదన (దిగుబడి) : 60 మెట్రిక్ టన్నులు,
కృషి వ్యయం ః 8,100 రూ॥లు

సచిన్ దాదాసో గోధడె, టాకవడె,
తాలూకా : శిరోల్, జిల్లా – కోల్హపూర్,
పంట భూమి : ఒక ఎకరం, చెఱకు,
ఉత్పాదన (దిగుబడి): 50 మెట్రిక్ టన్నులు,
కృషి వ్యయం ః 8,000 రూ॥లు.

ఎక్కడ ప్రేమ తరంగాలు వ్యాపిస్తాయో,
అక్కడ చీడ పురుగులెలా వ్యాపిస్తాయి?

భూమాత బిడ్డలకిదే భూదేవి పిలుపు – యోగిక వ్యవసాయమే నీవు సలుపు.

## 'గ్రామీణాభివృద్ధి ఆధ్వర్యంలో శాశ్వత యోగిక వ్యవసాయంలో యోగ ప్రయోగం'

### బి.కె సర్జేరావు సోదరుడు, హనుమంతవాడి (సాంగలి)

వీరికి నదీ తీరాన చాలా చక్కని పెద్ద పొలం ఉంది, చాలా కష్టపడి పూర్తి యోగ ప్రయోగంతో చెఱకును పండిస్తారు. వీరి పొలం ప్రక్కనే రసాయనిక వ్యవసాయ చెఱకు పంట ఉండేది. అందులో హుంగునీ అనే పేరు గల కీటకం ఉండేది అది యోగిక వ్యవసాయంలో లేదు. అతి దగ్గరగా ఈ రెండు పొలాలున్నా కూడా ఈరెండింటిలో ఆశ్చర్యకరమైన తేడాను చూసాము. యోగ ప్రయోగంతో పండించిన చెఱకు రసంతో చేసిన బెల్లం తయారిలో కూడా ఎలాంటి రసాయనాలు వాడలేదు. అయినప్పటికీ చాలా మంచి రుచితో పాటు చూడడానికి కూడా చాలా బాగా ఉంది. ఇది మాకు ప్రాక్టికల్‌గా అనుభవం. దీనికి ఆధారం ప్రతి రోజు అమృతవేళ శక్తిశాలి యోగాభ్యాసం, ఆధ్యాత్మిక సత్సంగమైన మురళీ క్లాస్ అధ్యయనమే.

### బంజరు భూమిలో యోగిక వ్యవసాయం అనుభవం

### బి.కె. మాక్కీ సోదరుడు, కవటే పిరాన్ (సాంగలి, మహారాష్ట్ర)

నలువైపుల క్షార లవణాల నీటితో ఉన్న బంజరు భూముల మధ్యలో ఒక అన్నయ్య 2 ఎకరాల చెఱకును పండిచడంలో విజయులై అడివిని ఉద్ధరించిన అద్భుతాన్ని సాధించారు. చెప్పాలంటే వీరి యోగ ప్రయోగాన్ని ధైర్య సాహసాలను, బాబా సహాయాన్ని అందుకోవడం నిరంతర శ్రమ, ఓపిక, నమ్మకాలను ఎంత కొనియాడినా తక్కువే. అందరూ వీరి పొలాన్ని చూడటానికి దూరదూరాల నుండి వచ్చి చూసి ఎంతో ప్రేరణ పొందారు. చాలామంది విలేకర్లు, వ్యవసాయ శాఖ అధికారులందరూ వీరిని పలు విధాల మెచ్చుకున్నారు. ఇలాంటి అద్భుతమైన వ్యవసాయ ఫలితాలకు ఆధారం ప్రతి నిత్యం శక్తిశాలి అమృతవేళ యోగాభ్యాసం, ఆధ్యాత్మిక మురళీ క్లాస్ అధ్యయనంతో సకారాత్మక ఆలోచనలు చేయడం.

### బి.కె విలాస్ సోదరుడు, శిరోక్ (టేంభుర్ణి, మహారాష్ట్ర)

మహారాష్ట్రలోని టేంభుర్ణి అనే గ్రామంలో విలాస్ అనే రైతుకు 75 ఎకరాల పొలం ఉంది అందులో కేవలం ఒక ఎకరంలో మాత్రం యోగిక పద్ధతితో చెఱకు పంటను పండించారు. ఈ పద్ధతితో పండించిన చెఱకు రసాన్ని అందరూ అమృత తీర్థంగా తీసుకుంటారు. కొందరైతే దీన్ని ఔషదంగా కూడా ఉపయోగిస్తున్నారు. దీంతో ఇక ముందు మొత్తం పొలాన్ని జైవిక, యోగిక పద్ధతిలో సాగుబడి చేయాలని వీరు అభిప్రాయ పడుతున్నారు. "ప్రకృతితో ఎంతగా కలిసి ఉంటామో, పంచతత్వాలతో ఎంత స్నేహపూర్వకంగా వ్యవహరిస్తామో, వాటికి సన్నిహితంగా సంబంధాలు పెట్టుకుంటామో అవి కూడా అంతగా మనకు సహకరిస్తాయి. మనమనుకున్నట్లుగా అనుకూలంగా ఎలాగంటే అలా ఎప్పుడంటే అప్పుడు అది మనకు సేవలందిస్తుంది.

వీరు తన పొలంలో ధ్యానం కోసం విశేషంగా బాబా గదిని ఏర్పాటు చేసారు. పొలంలో పనికెళ్ళే ముందు యజమాని నుండి కూలిల వరకు అందరు ఆ గదిలో కూర్చొని యోగాభ్యాసం చేసిన తర్వాతనే పని మొదలుపెడతారు. దీనితో అక్కడ పని చేసేవారికి ఉన్న వ్యసనాలు తొలగిపోయాయి. అంతేగాక అక్కడి వాతావరణం కూడా పవిత్రంగా పరిశుద్ధంగా మారి ఆ పరిసరాలలోకి వచ్చిన వారికి చక్కని సుఖశాంతుల అనుభూతి కలిగేది. ప్రకృతి కూడా చాలా సహకరిస్తుంది.

## బి.కె శశికాంత్ సోదరుడు కవఠెపిరాన్ (సాంగలి, మహారాష్ట్ర) 09049420134

మహారాష్ట్రాలోని కవఠెపిరాన్ గ్రామానికి చెందిన శశికాంత్ రైతుకు 2 ఎకరాల పొలముంది అందులో ఒక ఎకరంలో చెఱకు మరోఎకరంలో వరి, గోధుమ, శనగ పంటలను పండిస్తారు. ఒకమారు యోగిక వ్యవసాయ పద్ధతిని అనుసరించమని బాబా మురళీలో ఒక్క సన్నివేశంలో వినడం జరిగింది దాంతో ఆ మాట పై పూర్తి నిశ్చియం కలిగి యోగిక, జైవిక పద్ధతిలో వ్యవసాయాన్ని చేయాలని ఆలోచన కల్గింది. దాంతో ఒక సంవత్సరం నుండి యోగ విదానంలో వ్యవసాయం చేస్తున్నారు. పొలంలో పని చేస్తూ యోగ ప్రయోగం చేసేవారు. పొలంలో పనికెళ్ళే ముందే బాబాకు (పరమాత్మ అయిన తండ్రికి) సమాచారాన్ని వినిపించి ఆతరువాత పొలంలోకి వెళ్ళేవారు. మనసా వాచా కర్మణా 4 గంటలు సేవ చేసేవారు.

ఆవు పేడను, జీవామృతాన్ని, జీవాణువులను ఎరువుగా వాడేవారు. దాంతో భూమి సారవంతగా శక్తిశాలిగా తయారయ్యింది. నీటి వాడకం తగ్గింది, పంట దిగుబడి చాలా పెరిగింది. అంతేగాక పంట పై ఎలాంటి క్రిమికీటకాల వ్యాదుల ప్రభావం లేకుండా శక్తిశాలి ధాన్యాన్ని పండించగలిగారు. పంట పొలానికి ఇరువైపులా వేప చెట్టు, సర్పి చెట్టు, తులసి మొక్కలు పెట్టారు. పంటకి వ్యాదులు కలగకముందే వేప నూనె, ప్రొటీన్‌లవంటి జైవిక టానిక్‌ను పిచికారి చేయడం వలన కీటకాలు రాలేదు.

జీవాణు ఎరువులను ఉపయోగించడంతో పంట బలంగా పౌష్ఠికంగా పెరిగింది. శక్తిశాలి పంట దిగుబడి కూడా గణనీయంగా పెరిగింది. కాయకష్టం తక్కువ నీటి వాడకం కూడా తక్కువే. భూమి సారవంతంగా అయ్యింది.

యోగిక, జైవిక సాగుబడితో ఆత్మిక బలం పెరుగుతున్నట్లనిపించింది. ఇతరులకు ఈ అనుభవాలను వినిపించడంతో ఆత్మ గౌరవం కూడా పెరిగింది. కాబట్టి మొత్తం జిల్లాలో దీనిని ప్రచారం చేయాలనే ప్రణాళిక తయారు చేసారు.

## బి.కె యోగేశ్ సోదరుని అనుభవం

### చక్కరగడ్, అమరేలి (గుజరాత్) మొ.09426555003

నేను కుమార్‌ను, గత 10 సం॥లుగా అమరేలి సేవాకేంద్రంలో రాజయోగాన్ని అభ్యసిస్తున్నాను. గ్రామీణాభివృద్ధి వర్గం ద్వారా ఆరంభమైన యోగిక వ్యవసాయ విధానం చాలా లాభదాయకం ప్రశంసనీయం. రాబోయే సత్యయుగ నూతన ప్రపంచంలో ఈ పద్ధతిలోనే సాగుబడి ఉంటుంది. గత సంవత్సర కాలం బట్టి ఈ యోగిక పద్ధతిలో వ్యవసాయం చేస్తున్నాను. ఈ పద్ధతితో రెండు సార్లు పంట పండించాము. ముందుగా ఖరీఫ్‌లో జొన్నపంట (హైబ్రీడ్) తరువాత రబీలో శనగపంటను పండిచాము. మొదటి పంట సమయంలో వర్షాభావం కారణంగా నీరు పెట్టేందుకు మరోమార్గం కూడా లేక నేను యోగ ప్రయోగం చేసాను. ప్రతిరోజు అమృతవేళ నేను, బాప్‌దాదా ఇద్దరం కలిసి పొలానికి నలువైపులా నడుస్తూ ఉన్నట్లుగా భావించేవాడిని ఆ సమయంలో పైనుండి పొలం మధ్యలో ఒక నీటి బొట్టు పడుతున్నట్లు తరువాత అది తరంగాల రూపంలో పొలమంతా వ్యాపిస్తున్నట్లు నాకు అనుభూతి కలిగేది. దానితో మొక్కలన్నింటికి నీటి అవసరం తీరినట్లుగా ఉండేది చివరి వరకు కూడా ప్రత్యేకించి నీరు పెట్టే అవసరమే రాలేదు. చివరకు పంటకోత సమయంలో కూడా ఇప్పుడే నీరు పెట్టినట్లుగా అనిపించేది. అంతేగాక ఇవి హైబ్రీడ్ గింజలైనప్పటికీ దేశీ గింజల్లా కనిపించేవి, రుచి కూడా చాలా బాగుంది. ఈ పంట కోసం ఆవు పేడను మాత్రమే ఎరువుగా వాడాము అది కూడా ఎక్కువ మోతాదులో కాకుండా సాధారణంగానే వేయాల్సినంతనే వేసాము. ఆతరువాత కూడా జీవామృతంలాంటి ఎరువులు ఏమి వాడలేదు అయినప్పటికీ అంతే మొత్తంలో దిగుబడి వచ్చింది. ధాన్యం పరిమాణంలో కూడా తేడా లేదు. రుచికరమైన మెరిసే గింజలను పండించగలిగాము. ఆశ్చర్యమేమంటే ఈ విధంగా పండించిన పంట మొత్తం ఊరిలోనే అమ్ముడు పోయింది. మార్కెటుకు వెళ్ళే పని లేకుండా మార్కెట్ కన్నా ఎక్కువ ధరకు అంటే దాదాపు ఒక మణుగు (10 నుండి 12 కేజీల వరకు) 20 రూపాయల చొప్పున ఎక్కువ ధరకు అమ్ముడుపోయింది.

రైతులందరికి నేను చెప్పాలనుకున్నదేమంటే – పొలంలో గడ్డితోపాటు పంట మిగుళ్ళు ఏమైనా ఉంటే వాటిని కాల్చొద్దు ఎందుకంటే దీనివల్ల కాలుష్యం పెరుగుతుంది. పొలంలోనే ఒక మూలాన ఒక గోతిని తవ్వి అందులో వీటిని పోగు చేయండి, ఒక సంవత్సరం వరకు పెట్టి దీనిని ఎరువుతో పాటు పొలంలో వేయాలి. దీనితో ఎరువు శాతం పెరుగుతుంది, పర్యావరణం శుద్ధిగా ఉంటుంది.

నా సలహా ఏమంటే ఒకవేళ ప్రతి రైతు ఈ యోగిక వ్యవసాయాన్ని అవలంభిచినట్లైయితే విదేశీ ఎరువును, కీటకనాశ మందులను వాడనవసరం లేదు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పౌష్టికమైన పంటను పండించగలరు. ఎంతగా క్రిమిసంహారక మందులను వాడుతారో అంతగా క్రొత్త క్రొత్త కీటకాలు జబ్బులు పుట్టుకొస్తాయి. ఒక పురుగు పోతే మరొక పురుగు తయారవుతుంది అప్పుడు దాన్ని తొలగించేందుకు మరో మందు అవసరమవుతుంది, ఇలాంటి క్లిష్ట సమస్యల నుండి ప్రత్యక్షంగానో పరోక్షంగానో తెలిసి తెలియక చేసే పాపకర్మల నుండి సురక్షితంగా ఉండవచ్చును.

**‘ కేసర్ మామిడి ’ పొలం అనుభవం ( సోదరుడు బి.కె. రాజేశ్ దావే )**

మా ఈ మామిడి తోటలో పూర్తిగా నైసర్గిక, జైవిక పద్ధతితో, ప్రాచీన రాజయోగ అభ్యాసాన్ని ప్రయోగిస్తూ పండిస్తాము. ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం మార్గదర్శకంలో ఈ శాశ్వత యోగిక వ్యవసాయం ఆర్థికంగా లాభదాయకం, అహింసాత్మక విధానం అనవచ్చు. ఎందుకంటే ఈ పద్ధతిలో ఎలాంటి హానికారక రసాయనిక ఎరువులు కాని కృత్రిమ ఎరువులు కాని క్రిమిసంహారక మందులను గాని ఉపయోగించరు. భారతీయ దేశీయ గోమూత్రం, పేడ, వనస్పతి కషాయం, జైవిక ఎరువు, బయోగ్యాస్ ద్రవ రూపంలోని ఎరువు, వర్మీ కంపోస్ట్ లాంటి నైసర్గిక తత్వాలు భూమిని మొక్కలను శక్తిశాలిగా చేస్తాయి వీటిని కూడా మేము పొలంలో ఉపయోగిస్తాము.

**ఈ తోట విశేషతలు క్రిందన ఇవ్వబడ్డాయి :-**

1. ‘ ప్రభు– ఉపవన ’ తోటనిర్వహణ కార్యకలాపాలను చూసుకునేవారు – తమ నిత్య జీవితంలో నైతిక, ఆధ్యాత్మిక విలువలను ఆదర్శాలను ఆచరిస్తారు.
2. వారి సకారాత్మక జీవిత విదానం మామిడి చెట్ల పై మంచి ప్రభావం చూపించడం గమనించాము. ఈ మామిడి తోటలో రాజయోగం ద్వారా పవిత్రత, సుఖం, శాంతి, దివ్యతా ప్రకంపనాల ప్రయోగం ద్వారా శాశ్వత యోగిక వ్యవసాయాన్ని చేయడం జరుగుతుంది.
3. ఇలా ‘శాశ్వత మామిడి’ మీకు, మీ కుటుంబానికి సంపూర్ణ ఆరోగ్యం కోసం చాలా లాభదాయకమైంది. శాశ్వత యోగిక వ్యవసాయ పద్ధతి ద్వారా ఉత్పత్తి అయిన బెల్లం, ధాన్యం మిగితా వ్యవసాయ ఉత్పత్తులు మా ఈ ఫార్మ్‌లో లభిస్తాయి.
4. ఈ ఫార్మ్ ఉత్పత్తిలో కొంత భాగాన్ని విశేషంగా నైసర్గిక, జైవిక, ‘శాశ్వత యోగిక వ్యవసాయం’ ప్రచారం కోసం ఉపయోగిస్తుంటాము.
5. విశేషంగా ఇంకా ఏమైన తెలుసుకోవడానికి సంప్రదించగలరు :-

**మొబైల్** : 09969263936, 09619710468

**చిరునామ** : ‘ప్రభు– ఉపవనం’ ఫార్మ్, సెలోద్, మండలం– ఝగఢీయా,

**జిల్లా** : భరూచ్ (గుజరాత్)

**ఈమేల్** : prabhupvanfarm@yahoo.in, shashwatmango@yahoo.in

**సోదరుడు బి.కె. సోమెగౌడ , పాండవపురా, జిల్లా.మాండ్యా (కర్ణాటక)**

నేను గత 11 సం॥ల నుండి ఈ జ్ఞానమార్గంలో ఉన్నాను, నేను దాదాపు 20 సం॥ల నుండి నైసర్గిక పద్ధతితో వ్యవసాయాన్ని చేస్తున్నాను. నాకు మొదటి నుండి ప్రకృతితో ప్రేమతో వ్యవహరించడం అలవాటు. వనస్పతిలో (మొక్కలలో) సంవేదనాలతో పాటు అనుభూతి చేసే శక్తి ఉంటుంది అది నేను కూడా గమనించాను కాబట్టి, నేను కూడా ఆ సంవేదనాల ఆధారంగా వనస్పతితో లోతైన సంబంధాన్ని జోడించుకున్నాను. దీనివల్ల పంచ తత్వాలు ఎల్లప్పుడు సహయోగాన్ని ఇస్తాయి.

2 సం॥ల క్రితం మైసూర్‌కు చెందిన ప్రాణేశ్ సోదరునితో కలవడం జరిగింది. వారు నాకు రూరల్ వింగ్ (గ్రామీణాభివృద్ధి వర్గం) తరపున జరిగే సేవల గురించి కొద్దిమంది రైతుల ప్రాక్టికల్ అనుభవాలను తెలియజేసారు. వారి మార్గదర్శకంలో (5 గుంటలు) పొలంలో శాశ్వత యోగిక వ్యవసాయ పద్ధతిని అవలంభించాను దీని ఫలితాన్ని చూసిన తర్వాత నా సంతోషానికి అవధులు లేవు.

మొదట నేను నడుస్తూ తిరుగుతూ నలువైపులా బాబా స్మృతిలో తిరుగుతూ పూర్తి ప్రకృతికి సద్భావనల తరంగాలను వ్యాపింపచేసేవాన్ని. దీనితో చాలా మంచి అనుభవం అవుతుండేది మనసులో సంతోషం కలిగేది. ఇప్పుడు నేను విశేషంగా అమృతవేళ యోగం చేస్తాను సకాశ్ రూపంలో పవిత్రతా తరంగాలను వ్యాపింపచేస్తాను. సాయంత్రం యోగంలో శాంతి, ప్రేమ తరంగాలతో వాయుమండలాన్ని తయారుచేస్తాను. బాబా స్మృతి శక్తి మనసులోని ఏకాగ్రతా శక్తుల ప్రభావం ప్రకృతి పై చాలా పడుతుంది. దీని ప్రత్యక్ష ప్రమాణాలను ఏవైతే మేము చేసామో వాటిని మాటలతో చెప్పడం సాధ్యం కాదు దీనిని ప్రత్యక్షంగా చూస్తేనే తెలుస్తుంది.

శాశ్వత యోగిక వ్యవసాయ పద్ధతితో నేను 6 నెలల క్రితం మిశ్రమ పంటలను ఎలాగంటే టమోటా, బెండకాయ, బీన్స్, వంకాయ, పచ్చిమిర్చి, క్యాబేజి లాంటి పంటలను పండిస్తాము. ఇందులో ఇప్పటికీ ఎలాంటి రోగం వాటిల్లలేదు, ఎందుకంటే ఎక్కడైనా రసాయనిక ఎరువులు లేకుండా క్యాబేజిని పండిచరు, ఒకవేళ పండించినా దానికి తప్పకుండా పురుగు సోకుతుంది. కాని ఈ పద్ధతిని అవలంభించాక చాలా ఆశ్చర్యమైన విషయాన్ని చూడడం జరిగింది, కేవలం భగవంతుడి స్మృతిలో ఉండి సద్భావనల దృష్టి , మనోవృత్తితో సాగుబడి చేసినట్లయితే ఆత్మికతతో నిండిన చిరునవ్వుతో, స్నేహంతో తమ వరదానీ హస్తాలతో మొక్కలను, చెట్లను చూసుకోవడం, ప్రేమతో వ్యవహరించడం వల్ల చాలా మంచి పెద్ద పరిమాణాల్లో రోగంలేనటువంటి క్యాబేజి పండిచాము. నేను ముందు క్యాబేజిని తినేవాన్ని కాదు కాని, ఇప్పుడు తింటున్నాను చాలా బాగనిపిస్తుంది. చాలామంది ఈ క్యాబేజిలను తిని సంతోషపడి ప్రేరణలను పొందారు.

టమోటా మొక్కలైతే నా అంత ఎత్తు 5 అడుగులు పెరిగాయి. ఈ టమోటా పంటలో ఒక విశేషమైన విషయమేమంటే – టమోటాలను కోసాక 10 రోజుల తర్వాత చూసినా అది ఇప్పుడు తెంపినట్లుగా తాజాగా అనిపిస్తాయి, రుచికూడా ఉంటాయి. ఏమాత్రం వడలినట్లుగా కనిపించవు. రంగులో కూడా తేడా రాదు. ఎరుపుగానే ఉంటాయి, అవి ఎండిపోతాయి కాని కుల్లిపోవు. శాశ్వత యోగిక పద్ధతిలో నేను చూసినదేమంటే ఇందులో పంటల నాణ్యతకాని రుచికాని చాలా బాగా ఉంటుంది. శాశ్వత యోగిక వ్యవసాయాన్ని అవలంబించాక నాలో వ్యక్తిగతంగా వ్యవసాయాన్ని చేసే అభిరుచి పెరిగింది. నాకు చాలా సంతోషం కలుగుతుంది ఆనందంగా ఉంది. ఆత్మ విశ్వాసం పెరగడంతో పాటు నా యోగం చార్ట్ కూడా పెరుగుతూ ఉంది.

**సోదరుడు బి.కె కృష్ణాత్ శిందే, పోర్లె, జిల్లా. కోల్హాపూర్ (మహారాష్ట్ర)**

నేను గత 16 సం॥జ్ఞానంలో ఉన్నాను నేను 10 సం॥ల నుండి వ్యవసాయం చేసేవాణ్ణి. ఇప్పుడు కూడా కొద్దిగా చేస్తున్నాను. మొదట రసాయనిక పద్ధతిలో వ్యవసాయాన్ని చేసేవారము. ఇప్పటికి కాస్త చేస్తున్నాము. 5 సం॥ల క్రితం ఒక సంవత్సరం కోసం పూర్తి 6 ఎకరాల పొలంలో జైవిక పద్ధతిలో సాగు చేసి చూసాము కాని, అనుకున్నంతగా విజయం సాధించలేదు. కాబట్టి ఆ పద్ధతిలో సాగు చేయడం మానేసాము.

ఇప్పుడు కొన్ని నెలల క్రితం బ్రహ్మాకుమారీ సోదరి సూచనల మేరకు కేవలం ఒక అర ఎకరం పొలంలోశాశ్వత యోగిక వ్యవసాయ పద్ధతిని అవలంబించాను. నాకు మొదట దీని పై విశ్వాసం ఉండేదికాదు అయినప్పటికి సోదరి చెప్పారనే గౌరవంతో సరే అన్నాను. ఇక యోగం కోసం వారినే పొలానికి ఆహ్వానించాను. అన్నింటి కన్నా ముందు ఆ అర ఎకరంలో 2 ట్రాలీల పేడ ఎరువును వేసి భూమిలో దున్నాను. తరువాత 15-16 మంది బ్రహ్మాకుమరీ విశ్వ విద్యాలయ సేవాకేంద్రానికి వచ్చే రైతు సోదరులు సేవాకేంద్రంలో ఉండే సోదరీలు కూడా పొలానికి వచ్చి వారంతా తమ చేతులతో 9 కిలోల వేరుశనగ (ఎస్‌పి11), 250 గ్రా. నువ్వులు, 100 గ్రా. పొద్దుతిరుగుడు పువ్వు విత్తనాలను నాటారు. పొలం మధ్య మధ్యలో ఒక పెద్ద 3 చిన్న శివబాబా ?ఝండాలను వేరు వేరుగా పెట్టడం జరిగింది. దాని తరువాత పొలంలో 'శాశ్వత యోగిక వ్యవసాయం' అని ఒక బోర్డ్‌ను కూడా పెట్టాము. తరువాత సోదరీలు సెంటరు నుండే యోగ ప్రయోగం చేస్తామని చెప్పారు. ఈ పంటకి 5 సార్లు సరీ(ద్రవ రూపంలోని ఎరువును) తయారు చేసి నీళ్ళను పెట్టాము. 40 రోజుల తరువాత ఇందులోని కలుపుగడ్డి, చెత్తాచెదారాన్ని తీసేసాము.

3 నెలల తరువాత 7 సంచుల (400 కిలోల) వేరుశనగ, 30 కిలోల నువ్వులు, 50 కిలోల పొద్దుతిరుగుడు పువ్వు పంటలు చేతికొచ్చాయి. ఇందులో ఒక్క కిలో కూడా వేరుశనగ నాసిరకంగా రాలేదు వేరుశనగ గింజలన్నీ నిండుగా ఉన్నాయి. ఎలాంటి పురుగు సోకలేదు ఈ 3 నెలలలో ఎలాంటి నైసర్గిక విపత్తులు వాటిల్లలేదు. మేము అనుకున్న దానికన్నా ఎక్కువ ఉత్పత్తి జరిగింది అప్పుడు మాకు గట్టి నమ్మకం ఏర్పడింది. ఈ రాజయోగ అభ్యాసంతో మొక్కల పై లోతుగా ప్రభావం పడుతుంది. కావున ఇప్పుడు ఈ ఆధారంతో, విశ్వాసంతో శాశ్వత యోగిక వ్యవసాయ పద్ధతితోనే విత్తన శుద్ధ చేసి ఆ అర ఎకరం పొలంలోనే వరి విత్తనాలను వేసాము. ఈ పంట సేద్యం కోసం బయట నుండి పనివాళ్ళు కాకుండా బి.కె అన్నయ్యలు అక్కయ్యలే వచ్చి తమ చేతులతో అన్ని పనులు చేసారు. అలా చేస్తే వచ్చిన పంటలో చాలా తేడాను గమనించాము.

**సోదరుడు బి.కె. హీరా, ఊంజా గ్రామం (గుజరాత్)**

**జీలకర పంట పై యోగ ప్రయోగ అనుభవం**

1. నేను 2002 సం॥లో జీలకర పంట వేసినప్పుడు యోగ ప్రయోగాన్ని చేసాను. ఆ సమయంలో జీలకరలో కాలియా అనే పేరు గల కీటకం సోకడం మొదలైంది. ఆ సమయంలో నేను బాబా ముందు జీలకర పంటను ఇమర్జ్ చేసి (ఆ దృశ్యాన్ని ఊహించి) బాబా నుండి తెల్లని ప్రకాశ కిరణాలను తీసుకుని పంటకు ఇవ్వడం ఆరంభించాను. ఇక బాబాను ఆ పంటలో భాగస్వామిగా చేసాను. దీనితో బాబా స్మృతి ఎక్కువైంది. యోగంలోని శక్తిశాలి వైబ్రేషన్స్‌తో రోగం పెరగలేదు, పంట బాగా ఎదిగింది. ఒక ఎకరం భూమి నుండి 10 వేల రూపాయల రాబడి కలిగింది.
2. మరొక ప్రయోగంలో జొన్న పంట పై జూన్ 2008 సం॥లో చేసాను. ఏరకమైన రసాయనిక ఎరువులు కాని క్రిమిసంహారక మందులు కాని వాడకుండా పొలంలో యోగప్రకంపనాలను అందిచాను. ప్రతిరోజు పొలానికి వెళ్ళి యోగం చేసేవాడిని అమృతవేళ బాబా ముందు పంటను ఇమర్జ్ చేసి (ఆ దృశ్యాన్ని ఊహించి) మంచి చింతన చేసేవాడిని. ఈరకంగా పరిశుద్ధమైన స్మృతి తరంగాలతో పంటలో బలం పెరుగుతూ వచ్చింది, సూక్ష్మంగా ప్రకృతికి కూడా సేవ జరిగేది.

పంట ఏపుగా ఎదిగి రెపరెపలాడేది. పంట కోతకు ఇంకా 10-15 రోజులుండగా తుఫాన్లు చెలరేగాయి, వడగాల్పులు వీచాయి, బాగా వర్షం పడింది. ఎన్నో వృక్షాలు నేలరాలాయి కాని, నా పొలంలోని సజ్జ పంట ఎలాగుందో అలాగే ఉంది ఎలాంటి నష్టం వాటిల్లలేదు. సరికదా ఒక ఎకరం పొలం నుండి 30 మణుగుల (ఒక మణుగుకు 10 లేక 12 కిలోలు) సజ్జ పంట ఉత్పాదన అయ్యింది. ఆ సజ్జలు తినడానికి కూడా రుచికరంగా ఉన్నాయి. 30 జూన్ 2010కి 2 సంవత్సరాలయింది యోగిక వ్యవసాయంతో ఉత్పత్తి అయిన 2 సంచుల సజ్జలు ఈ రోజు వరకు నావద్ద వాడకానికి ఉన్నాయి. కాని ఎలాంటి పురుగు పట్టలేదు. 2 సం॥లైనా ఇప్పటికీ వాడకానికి యోగ్యంగానే ఉన్నాయి.

3. మూడవ ప్రయోగం 2009 సం॥లో సోంప్ పై చేసాను. మొట్టమొదటగా సోంప్ విత్తనాలను బాబా సేవాకేంద్రానికి పంపించాము. అక్కడ రాజయోగీ బ్రహ్మాకుమారీ అక్కయ్యలు యోగశక్తితో వాటిని సూక్ష్మంగా బలశాలిగా చేసారు. దాని తర్వాత విత్తనాలను పొలంలో నాటాము. విత్తనాలు యోగంతో ఎంత శక్తిశాలిగా అయ్యాయంటే ఒక్కసారే నీరు పెట్టడంతోనే మొక్క భూమి నుండి మొలకెత్తాయి. ఎప్పుడైతే ఈ పంట 3-4 ఇంచులు పెరిగిందో అప్పుడు ప్రకృతి వాతావరణం అంతగా బాగా లేక మేఘాలు కమ్ముకున్నాయి. వెలుతురునిచ్చే సూర్య కిరణాలు పంటకు లభించేవి కావు. దీనితో పంటపైర్ల పై తెల్లని మచ్చలు ఆరంభమైయ్యాయి. వాటి ఆకులు కూడా తెల్లని మచ్చలతో కనిపించేవి. ఆ సమయంలో జ్ఞాన సూర్యుడైన శివబాబా తో శక్తిశాలి కిరణాలను గ్రహించి వాటిని పంటపైర్లకు అందజేసాను. అలా 4-5 రోజులు గడిచాక ఆ తెల్లని మచ్చలన్ని తొలగిపోయాయి, పంట పూర్తిగా ప్రకాశవంతంగా పచ్చగా మారింది. దాని తరువాత 2-3 అడుగులు పంట ఎదిగిన తర్వాత ఊంజా సేవాకేంద్రం నుండేగాక మా గ్రామంలోని గీతాపాఠశాలకు చెందిన అన్నయ్యలు, అక్కయ్యలు కలిసి పొలానికి వచ్చి బాబా ఝండాను ఎగురవేసారు, బాబా మధురమైన పాటలను మ్రోగించారు, అందరూ కలిసి యోగం చేసారు, బాబా ప్రసాదాన్ని అందరికీ పంచారు. ఈ రకంగా రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులు ఉపయోగించకుండా పంటకు వచ్చిన రోగాన్ని యోగ శక్తితో దూరం చేయగలిగాము.

# Comparative Study of Perpetual Yogic Farming and Chemical Farming...

In Chipri Village of Shirol Tehseel, in the Kolhapur District of Maharashtra State, Farmers made a comparative study of the difference between the Yogic Farming process and the Chemical Farming on the crop of Tomatoes. The experiment was done on the **Namdhari 2535 breed** of tomatoes. The crop from the both the experiments were sent for analysis in the research laboratory. The findings of the comparative study are as given below.

| Particulars | Yogik Farming | Other Farming |
|---|---|---|
| Name of Farmer | Kumar Bapu Powar | Dinkar Tatoba Pawar |
| Field | 18 AAR | 38 AAR |
| Date of Planting | 24th April, 2008 | 25th April, 2008 |
| | In this experiment, no organic or Chemical Fertilizers were used | Urea - 50 kgs. Potash - 200 kgs., Super Phosphate - 100 kgs. Sampurna (19:19:19) - 100 kgs. DAP - 200 kgs. Neem Seed Cakes - 150 kgs. were used |
| | No pesticides were used - neither Yogic nor Chemical. | Pesticides and fungicides were used as follows 1 kg. of M-45; 1 liter of Tiltop 1 kgs of Bioctin; 1 liter of Rogor 1 kg of Dunet; 1 kg. of Topas |
| | Crop was watered 4 times | Crop was watered 4 times |
| | Rajayoga / Meditation was applied on this crop | No Rajyoga / Meditation was experimented on this crop |
| Expenses till Ploughing (Rs.) | 1360.00 | 3200.00 |
| Seeds Expense (Rs.) | 440.00 | 660.00 |
| Fertilizer Expense (Rs.) | 00.00 | 9800.00 |
| Crop Conservation expense (Rs.) | 00.00 | 3000.00 |
| Labour Expenses: weeding, watering, tying (Rs.) | 4220.00 | 10080.00 |
| Total Expense (Rs.) | 6020.00 | 26740.00 |
| **Total Expense per Acre** | **13378.00** | **28147.00** |
| Total Crop | 18 Aar 6150 Kg. | 38 Aar 14400 Kg. |
| Total Crop per Acre | 13667 Kg. | 15158 Kg. |
| Market Value of crop per Acre (Rs.) | 77446.00 | 85895.00 |
| Profit (Rs.) per Acre | 64068.00 | 57778.00 |

## Food Analysis of Tomato

| | Yogic Process | | Chemical Process | |
|---|---|---|---|---|
| Parameters | Result | Unit | Result | Unit |
| Fat | 0.11 | % | **0.20** | % |
| Protin | **1.13** | % | 0.74 | % |
| Carbohydrate | **5.63** | % | 4.15 | % |
| Energy Value | **27.47** | KCal/100 gms. | 19.5 | KCal/100 gms. |
| Vitamin – C | **14.9** | mg./100 gms. | 6.05 | mg./100 gms. |

The analysis clearly shows that the yogic process in comparison to the chemical saves a sum total of about Rs. 14769.00 per acre and as the expenses under the Yogic process is extremely low, the profit margin of the Yogic process is higher by about Rs. 6290.00. The quality of the organic process is better than that of the inorganic of chemical process.

It can be easily said that the expenses under the yogic process are low and the profit is more in comparison to the chemical process. Small farmers will not have to borrow money from money lenders and the best of all the benefits is that the crop (fruits, vegetables etc) through the yogic process makes mind and body healthy.

# Comparative Result of Vital Nutrients in Tomato crop produced through Perpetual Yogic Agriculture

NATIONAL AGRICULTURE AND FOOD ANALYSIS AND RESEARCH INSTITUTE
Promoted by : MCCIA and COFIT
Supported by : MFPI GOI., FRAC, SIDBI, NABARD and UNIDO
III FL, MAHRATTA CHAMBER OF COMMERCE, INDUSTRIES AND AGRICULTURE
Tilak Road, Pune 411 002. India. Tel. : 91-20-24440079, 24441776, 24440371, 24440472 Fax : 91-20-24440079
Email : nafaripune@yahoo.co.in

nafari

Report No. : 08-09/0768 Date of issue : 20/08/2008

Issued To : Mr. Kumar Pawar
At Post Chipri, Tal. Shirol,
Dist. Kolhapur

TEST REPORT

1 Sample Name : Organic Tomato (CI - 0825)
2 Date of sample receipt : 01/08/2008
3 Your Ref. No. : Request form with samples
4 Brand Name : ---
5 Sample Pkg : Plastic Bag
6 Sample collected by : Client
7 Customer Code No : 0108/0311/0825
8 Date(s) of testing : 02/08/2008 to 19/08/2008

| SR.NO. | SAMPLE NAME | PARAMETERS | RESULT | UNIT | TEST METHOD |
|---|---|---|---|---|---|
| 1 | Organic Tomato | Fat | 0.11 | % | IS : 12711 - 2005 |
| 2 | | Protein | 1.13 | % | AOAC 920.152 |
| 3 | | Carbohydrates | 5.63 | % | IS : 1656 - 1997 |
| 4 | | Energy Value | 27.47 | Kcal/100 g | IS : 1350 (P-II) 2003 |
| 5 | | Vitamin C | 14.90 | mg/100 g | IS : 5838 - 2005 |

Verified by
(Padmaja Kotkunde - Analyst)

B. D. Kulkarni
Authorised by
(Bhagyashree Kulkarni - Analyst)

1. The above results pertain only to the sample tested.
2. This Report, in full or in part, shall not to be used for advertising or legal action.
3. This Report cannot be re-produced, except when in full, without the written permission from the Director.
4. The sample will be destroyed after three weeks from the date of issue of test report ( in case of non -perishable items only. )
5. Fees not established between the company and the client at the time the order is placed or a contract is negotiated shall be at the company's standard rates (which are subject to change) and all applicable taxes shall be payable by the client.

Pray mother earth with organic farming, it will fill you with power ever thriving.

NATIONAL AGRICULTURE AND FOOD ANALYSIS AND RESEARCH INSTITUTE
Promoted by : MCCIA and COFIT
Supported by : MFPI GOI., FRAC, SIDBI, NABARD and UNIDO
III FL, MAHRATTA CHAMBER OF COMMERCE, INDUSTRIES AND AGRICULTURE
Tilak Road, Pune 411 002. India. Tel. : 91-20-24440079, 24441776, 24440371, 24440472 Fax : 91-20-24440079
Email : nafaripune@yahoo.co.in

nafari

Report No. : 08-09/0769 Date of issue : 20/08/2008

Issued To : Mr. Kumar Pawar
At Post Chipri, Tal. Shirol,
Dist. Kolhapur

TEST REPORT

1 Sample Name : Inorganic Tomato (CI - 0826)
2 Date of sample receipt : 01/08/2008
3 Your Ref. No. : Request form with samples
4 Brand Name : ---
5 Sample Pkg : Plastic Bag
6 Sample collected by : Client
7 Customer Code No : 0108/0312/0826
8 Date(s) of testing : 02/08/2008 to 19/08/2008

| SR.NO. | SAMPLE NAME | PARAMETERS | RESULT | UNIT | TEST METHOD |
|---|---|---|---|---|---|
| 1 | Inorganic Tomato | Fat | 0.20 | % | IS : 12711 - 2005 |
| 2 | | Protein | 0.74 | % | AOAC 920.152 |
| 3 | | Carbohydrates | 4.15 | % | IS : 1656 - 1997 |
| 4 | | Energy Value | 19.5 | Kcal/100 g | IS : 1350 (P-II) 2003 |
| 5 | | Vitamin C | 6.05 | mg/100 g | IS : 5838 - 2005 |

Verified by
(Padmaja Kotkunde - Analyst)

B. D. Kulkarni
Authorised by
(Bhagyashree Kulkarni - Analyst)

1. The above results pertain only to the sample tested.
2. This Report, in full or in part, shall not to be used for advertising or legal action.
3. This Report cannot be re-produced, except when in full, without the written permission from the Director.
4. The sample will be destroyed after three weeks from the date of issue of test report ( in case of non -perishable items only. )
5. Fees not established between the company and the client at the time the order is placed or a contract is negotiated shall be at the company's standard rates (which are subject to change) and all applicable taxes shall be payable by the client.

Strong and sturdier the crop, we shall have generation of people top.